28-04Pg1exHMNWJQEBPRCKLT.qxd:28-04Pg1exHMNWJQEBPRCKLT.qxd 1/1/02 6:12 AM Page 1

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం : fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

28-4-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 87 పేజీలు: 16 వెల: 6.50

28-4pg2exHMNWJQE.qxd:28-4pg2exHMNWJQE.qxd 1/1/02 6:43 AM Page 1

సోమవారం కూర్మనాధుని సేవలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

ఆదిత్యుని సన్నిధిలో ఉపరాష్ట్రపతి

శ్రీకూర్మనాథుని సేవలో పాల్గొన్న రాధాకృష్ణన్

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నివాసంలో ఆత్మీయ విందు

శ్రీకాకుళం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ జిల్లా పర్యటన సోమవారం ఆధ్యాత్మికంగా, అత్యంత ఆత్మీయంగా సాగింది. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడంతో పాటు కేంద్ర మంత్రితో ఉన్న పాత అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ముందుగా డచ్ బంగ్లా హెలిప్యాడ్ వద్ద ఉపరాష్ట్రపతికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, డీఐజీ గోపీనాథ్ జెట్టి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. అక్కడి నుండి మిల్లు జంక్షన్ మీదుగా కాన్వాయ్‌లో నేరుగా శ్రీకూర్మ క్షేత్రానికి చేరుకున్నారు. లోకైక ఏకైక కూర్మ రూప క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అరసవల్లిలో ఆశీర్వచనం: అనంతరం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం లభించింది. అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్న ఆయనకు వేద మంత్రోచ్ఛారణల మధ్య తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన ఇంద్ర పుష్కరిణిలో జరుగుతున్న నూతన నిర్మాణ పనులను స్వయంగా వెళ్లి దగ్గరుండి పరిశీలించారు. పర్యటనలో భాగంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడికుదుటి ఈశ్వరరావు, మామిడి గోవిందరావు తదితరులు ఉపరాష్ట్రపతిని గౌరవపూర్వకంగా కలుసుకున్నారు.

మంత్రి నివాసంలో ఆత్మీయ సమావేశం: ఆలయాల దర్శనం అనంతరం ఉపరాష్ట్రపతి నేరుగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పలువురు ప్రముఖులను ఆయన పలకరించారు. ఈ సందర్భంగా దివంగత కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడుతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎర్రన్న సతీమణి విజయలక్ష్మిని, సోదరుడు కింజరాపు ప్రభాకరరావును ఆత్మీయంగా పలకరించారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సుమారు గంటన్నర పాటు గడిపిన ఆయన, అక్కడి నుండి నేరుగా హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ఉపరాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పర్యటన అంతా ప్రశాంతంగా ముగిసింది.



కేంద్రమంత్రి రామ్మోనాయుడు నివాసానికి ఇచ్చేసిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

వర్సిటీలకు దిక్సూచి ఎయు

>> యూనివర్సిటీ అనుసంధానం కావాలి. మీరు ఉద్యోగం చేయడం కాదు, పది మందికి ఉద్యోగం ఇచ్చే శక్తి మీకు రావాలి దీనికి సహకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నేను ఎన్నో కార్యక్రమాలకు వెళ్లాను కానీ యూనివర్సిటీలో మీ ఉత్సాహం చూస్తుంటే ఆనందం ఆకాశాన్ని తాకుతోంది. విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్నాను. రెండు ప్రతిష్ఠాత్మక కార్యక్ర మాల్లో పాల్గొనేందుకు నేను విశాఖ వచ్చాను. 100 ఏళ్ల ఏయూ పండుగ ఒక చరిత్ర. రేపు ప్రపంచంలో నెంబర్ 1 టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన మరో చరిత్ర. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నారంటే అది విశాఖ గొప్పతనం. గూగుల్ కంటే ముందుగానే ఏయూ ప్రపంచాన్ని విశాఖతో కనెక్ట్ చేసింది. 58 దేశాల విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారంటే రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం. ఏయూ 100 ఏళ్ల చరిత్ర ఒక బ్రాండ్. రాష్ట్ర విభజన తర్వాత కేబినెట్ సమావేశం ఏయూలో నిర్వహించాం. అదీ ఏయూ ప్రత్యేకత. 53 యూనివర్సిటీలు రాష్ట్రంలో ఉన్నాయి... అన్నింటికీ ఏయూ దిక్సూచి, లీడర్. స్వాతంత్ర్య పోరాటం కంటే ముందే ఈ యూనివర్సిటీ వచ్చింది. జైపూర్ రాజ్ విక్రమ దేవ్, గజపతి, పిఠాపురం, బొబ్బిలి రాజులు ఈ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేశారు. వారిని మనం స్మరించుకోవడం ధర్మం, బాధ్యత. కట్టమంచి రామలింగారెడ్డి ఏయూకు మొదటి వీసీగా చేసి బలమైన పునాది వేశారు. ఆయన కూడా చిత్తూరు జిల్లా వాసే... నేనూ చిత్తూరు జిల్లా నుంచి వచ్చి వందేళ్ల ఉత్సవంలో పాల్గొన్నాను. 2వ వీసీ సర్వేపల్లి రాధాకృష్ణ దేశ రాష్ట్రపతి అయ్యారు. ఈ రోజు మన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తండ్రి సర్వేపల్లి రాధాకృష్ణ అభిమాని. ఈయనకు రాధాకృష్ణన్ అని పేరు పెట్టారు. కేవలం చదువు చెప్పడమే కాదు... తెలుగు వైభవానికి ఏయూ కృషి చేస్తోంది. విద్య, సాహిత్య, కళా రంగాల్లో ప్రముఖులను కళా ప్రపూర్ణ అవార్డుతో గౌరవిస్తున్నారు' అని సీఎం చంద్రబాబు అన్నారు. 'మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఏయూ నుంచే వచ్చారు. ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కూడా ఇక్కడి నుంచే వచ్చారు. ప్రపంచంలోని చాలా యూనివర్సిటీల్లో ఇక్కడ చదువుకుని వెళ్లిన వారు ప్రొఫెసర్లుగా చేస్తున్నారు. న్యాక్ ఏ ప్లస్ ప్లస్‌ను ఏయూ సాధిస్తోంది. ఎన్ఐఆర్ఎఫ్‌లో 41వ ర్యాంక్, పబ్లిక్ సెక్టార్‌లో 5వ ర్యాంక్‌లో ఉంది. అన్ని యూనివర్సిటీల్లో విద్యాశాఖామంత్రి, గవర్నర్ ప్రతిభ ఉన్నవారిని వీసీలుగా ఎంపిక చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా వారిని అభినందిస్తున్నాను. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెట్రాలజీతో ఎంఒయూలు కుదుర్చుకున్నాం. నాకు 76 ఏళ్లయినా.. నేను 26 ఏళ్ల యువకుడిలానే ఆలోచిస్తాను. ఒకప్పుడు మనం ఐటీ ప్రారంభించాం హైటెక్ సిటీ కట్టాం. నాలెడ్జ్ ఎకానమీకి దోహదం చేశాం. నేడు డేటా సెంటర్, ఏఐ, క్వాంటం తీసుకొచ్చాం. వీసీని కోరుతున్నా... ఏయూకు బ్రాండ్ ఉంది. మీరు అడిగితే ప్రపంచంలోని చాలా యూనివర్సిటీలు మీతో ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉంటాయి. పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే ఆస్తి చదువు. చదువుతో ప్రపంచాన్ని జయించే ఆత్మవిశ్వాసం వారికి వస్తుంది. ఏయూ చాలా సుందరమైన ప్రాంతం. ఒత్తిడి ఉన్నప్పుడు సముద్ర తీరంలో కాసేపు నడిస్తే సేదతీరుతారు' అని సీఎం అన్నారు. ఏయూ అభివృద్ధికి రూ.500 కోట్లు'ఏయూలో చదువుకునే వారంతా అదృష్టవంతులు. ఇక్కడ చదువుకుంటే ఎంత బావుంటుందో అనే ఆలోచన మళ్లీ నాకూ వస్తోంది. ఉపకులపతికి లక్ష్యం నిర్దేశిస్తున్నాం... ఏయూ దేశంలో యూనివర్సిటీల్లో టాప్5 జాబితాలో ఉండాలనేది నా ఆకాంక్ష. ప్రపంచంలో 100 అత్యుత్తమ యూనివర్సిటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఉండాలి. ఈ స్థాయిలో అభివృద్ధి చేయాలంటే నిధులు కావాలి. అందుకే రూ.500 కోట్లను ఆంధ్ర యూనివర్సిటీకి ఇస్తాం. రూ.500 కోట్ల కార్పస్ ఫండ్ వస్తుంది. ఒక్కో విద్యార్థి ఒక్కో రూపాయి చొప్పున సాయం అందించినా చాలు. ఏయూ పూర్వ విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధ్యమే అవుతుంది. ఏయూ వందేళ్ల చరిత్ర రోజున చెప్తున్నా... రాబోయే వందేళ్లలో ఏయూ మరో చరిత్ర సృష్టిస్తుంది... బెస్ట్ బ్రాండ్ క్రియేట్ చేస్తుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు. నేను, నా మిత్రుడు పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రాన్ని పునర్ నిర్మించేందుకు ముందుకొచ్చాం. తెలుగుజాతి పునర్వైభవానికి ప్రధాని మోదీ మనకు సహకరిస్తున్నారు. వారి సంకల్పం వికసిత్ భారత్ 2047. మన లక్ష్యం స్వర్ణాంధ్ర 2047. 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ 1 జాతిగా తెలుగు జాతి ఉండాలనేది మా సంకల్పం. మా సంకల్ప జైత్ర యాత్ర ఏయూ నుంచే ప్రారంభం కావాలి. పని చేసే బాధ్యత మాది, సహకరించే బాధ్యత మాది... దాన్ని నిరూపించుకునే బాధ్యత మీదే' అని విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఒడిశా గవర్నర్ హరిబాబు, కేంద్ర మంత్రులు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్, మాజీ క్రికెటర్ సచిన్, దర్శకుడు త్రివిక్రమ్, మంత్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గొప్ప పరిశోధనా కేంద్రంగా ఎయు

>> నాయకత్వం విశ్వవిద్యాలయాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయని కొనియాడారు. అలాగే జైపూర్ మహారాజు విక్రమ్ దేవ్ వర్మ, విజయనగరం మహారాజులు, బొబ్బిలి ఇతర సంస్థానాల సహకారాన్ని గుర్తుచేశారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ, కేవలం డిగ్రీలు సాధించడం సరిపోదని, కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం బోధనా కేంద్రంతో పాటు పరిశోధనా కేంద్రంగా మారాలని, పరిశోధనలు క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా ఉండాలని ఆకాంక్షించారు. పేటెంట్లపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్యూర్ సైన్సెస్‌పై ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగుతోందని అన్నారు. 202526 నాటికి దేశంలోనే అత్యధిక పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రంగా ఏపీ నిలిచిందని పేర్కొన్నారు. వైఫల్యాలకు కుంగిపోకుండా, క్రమశిక్షణతో లక్ష్యం వైపు సాగాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. సచిన్ టెండూల్కర్ తన 100వ సెంచరీ కోసం ఎదురుచూసిన పద్ధతిని ఉదాహరణగా చూపుతూ, ఓపిక ఆత్మ విశ్వాసం విజయానికి మూలసూత్రాలని వివరించారు. సమయాన్ని సరిగ్గా నిర్వహించే వారే విజేతలుగా నిలుస్తారని ఉద్ఘాటించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో కలిసి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, జిఎంఆర్ సంస్థ ఫౌండర్, చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, బి.వి.ఆర్.మోహన్ రెడ్డి, సత్యనారాయణ, ప్రొఫెసర్ ఎం.ఆర్.మాధవ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ లకు ఎక్స్‌లెన్సీ అవార్డుతో పాటు శతాబ్ది వేడుకల జ్ఞాపికలను అందజేశారు.

సోమవారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లిఖార్జున ఆలయం వద్ద తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్

మల్లన్న ఆలయంలో మంత్రి పొన్నం

శ్రీశైలంప్రాజెక్టు, ఏప్రిల్27,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం రవాణా మరియు బిసి వేల్ఫర్ శాఖ మంత్రి పొన్నం ప్రబాకర్ శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ముందుగా ఆలయ రాజగోపురం వద్ద ఈఓ ఎం.శ్రీనివాసరావు,ఏఈఓ వెంకటేశ్వరరావు, అర్చకస్వాములు సాదర స్వాగతం పలికారు.తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.తదుపరి అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో వేదపండింతులు వేధాశీర్వచనములు వల్లించగా అర్చకస్వాములు తీర్థ ప్రసాదములు అందజేసారు.తదుపరి శ్రీస్వామివార్ల శేషవస్త్రములతో సత్కరించి లడ్డు ప్రసాదములు,శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటంను, శ్రీశైల చరిత్ర పుస్తకంను ఈఓ శ్రీనివాసరావు అందజేసారు.

ముందుగానే నైరుతి రుతుపవనాలు

>> ముందుగానే రావడం వల్ల వేడిమి నుంచి ఉపశమనం లభించడమే కాకుండా, నేలలో తేమ పెరిగి విత్తనాల విత్తకానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. నీటి వనరులపై ఒత్తిడి తగ్గి, వ్యవసాయ కార్యకలాపాలు వేగవంతం కావచ్చు. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఇది ఊరటనివ్వనుంది.అయితే, నైరుతి రుతుపవనాల రాకపై భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డీ) ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. మే మధ్యలో తమ అంచనాలను వెల్లడించనున్నట్లు ఐఎమ్‌డీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు.

పట్టాలు తప్పిన వందేభారత్

>> దంతో స్పీడ్‌కూడా ఎక్కువగానే ఉంటుంది. ప్లాట్‌ఫామ్ సమీపంలోకి వస్తున్న సమయంలో వందేభారత్‌కోచ్‌లలో ఒకదాని చక్రాలు పట్టాలు తప్పాయి. డైమండ్‌క్రాసింగ్‌వద్దనే ఈ ఘటన జరిగింది. అయితే యుద్ధప్రాతిపదికన ఈ క్రాసింగ్‌ను మరమ్మతుచేసి పునరుద్ధరించారు. పూణెస్టేషన్‌లో యార్డు రీమోడలింగ్‌పనులు జరుగుతుండటంతో క్రాసింగ్ కొంతమేర వంగింది. అంతేకాకుండా వెంటనే సరిచేసి ప్రయాణాలకు అనువుగా మార్చినట్లు అధికారులు తెలిపారు. పట్టాలు తప్పిన కోచ్‌నుంచి ప్రయాణీకులు దిగి సమీపంలోని ప్లాట్‌ఫామ్‌పైకి పరుగులుపెట్టారు.

ఆంధ్రా విశ్వవిద్యాలయం ఒక ఎమోషన్..

>> ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది, విద్యార్థులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఆంధ్ర యూనివర్సిటీ ఒక పేరు మాత్రమే కాదు.. వందేళ్ల చరిత్ర. 2014లో రాష్ట్రం విడిపోయింది. కట్టుబట్టలతో మెడపట్టి మనల్ని బయటకు గెంటేశారు. రాజధాని లేదు, సచివాలయం లేదు, అసెంబ్లీ లేదు, ముఖ్యమంత్రి కూర్చోవడానికి కుర్చీ లేదు. ఆ రోజు ఆంధ్రప్రదేశ్ కు ఉన్నవి రెండే. ఒకటి ఆంధ్ర యూనివర్సిటీ, రెండు మన బ్రాండ్ సీబీఎన్. రాష్ట్ర విభజన తర్వాత కేబినెట్ మీటింగ్ పెట్టుకోవడానికి ఒక హాల్ కూడా లేదు. ఆ రోజు మొదటి కేబినెట్ మీటింగ్ ఆంధ్ర యూనివర్సిటీలో పెట్టుకున్నాం. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు మొదటి అసెంబ్లీ సమావేశాలు కూడా ఏయూలోనే నిర్వహించారు. దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి. స్వతంత్రం రాకముందు తెలుగు ప్రజలు పోరాడి ఆంధ్ర యూనివర్సిటీ సాధించుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీకి ఎన్నో రికార్డ్స్ ఉన్నాయి. భాషాప్రయుక్త రాష్ట్రాల్లో మొదటిది ఆంధ్ర రాష్ట్రం. తెలుగు ప్రజల కోసం మనం యూనివర్సిటీని ఏర్పాటుచేసుకోవడం జరిగింది. నేను కార్నెగీ మెలన్ యూనివర్సిటీ, స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఈ రోజు ఇక్కడ మిమ్మల్ని చూసి అసూయ పడుతున్నాను. ఆంధ్ర యూనివర్సిటీలో చదివి ఉంటే ఎంతో బాగుండేదని. ఆంధ్ర యూనివర్సిటీ చరిత్ర వెనుక ఎంతో మంది త్యాగం ఉంది. మానసిక వికాసం మానవ జీవితానికి అత్యున్నత లక్ష్యంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారు. సీఆర్ రెడ్డి మొదటి వైస్ ఛాన్స్‌లర్ గా ఒక క్లియర్ డైరెక్షన్ మనకు అందించారు. తర్వాత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వైస్ ఛాన్స్‌లర్ గా పనిచేశారు. ఆయన విజన్, స్పీడ్, కమిట్ మెంట్ ఆంధ్ర యూనివర్సిటీకి బలమైన పునాది వేసింది. ఎంతోమంది దాతలు ఏయూ అభివృద్ధికి సహకరించారు. భారతదేశానికే గర్వకారణంయూనివర్సిటీని సాధారణంగా విశ్వవిద్యాలయం అంటారు. కానీ మన ఆంధ్ర యూనివర్సిటీని ఆంధ్ర విశ్వకళా పరిషత్ అంటారు. ఇది అకడమిక్ విద్య, లిబరల్ ఆర్ట్స్ సమ్మిళితం. దీనికి మంచి ఉదాహరణ త్రివిక్రమ్ శ్రీనివాస్ గారు. మన ఏయూ నుంచి ఎమ్మెస్సీ న్యూక్లియర్ ఫిజిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు ప్రఖ్యాత సినీ దర్శకులుగా ఆయన ఎదిగారు. ఆంధ్ర యూనివర్సిటీ చిహ్నం దగ్గర నుంచి కోర్సుల వరకు అన్నీ స్పెషల్. ఉన్నత విద్యలో భిన్నమైన ప్రోగ్రామ్స్ ను అందిస్తోంది ఆంధ్ర యూనివర్సిటీ. ఏయూలో 7 అనుబంధ కళాశాలలతో కలిపి 68 అకడమిక్ విభాగాలు ఉన్నాయి. మొత్తం 121 అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు వివిధ పరిశోధనా కార్యక్రమాలు అందిస్తున్నారు. అదేవిధంగా ఏయూకి 304 అనుబంధ కళాశాలలు ఉన్నాయి. సుమారు 85,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 56 దేశాల నుండి వచ్చిన సుమారు 1050 మంది విదేశీ విద్యార్థులు కూడా ఉన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికి గర్వకారణం అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

గంజాయి కేసులో 27 మందికి జైలు

>> ప్రాంతాల్లో చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తూ వుంటారు. అదేవిధంగా దుగ్గిరాల పోలీస్ స్టేషన్ పరిధిలో 1.620 కేజీల గంజాయిని పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఈ కేసులో పోలీసుల కథనం ప్రకారం మంగళగిరి, విజయవాడ, దుగ్గిరాల, కాజా, అమరావతి ప్రాంతాలకు చెందిన యువకులు గంజాయి వినియోగానికి అలవాటు పడి, ఆర్థిక అవసరాల కోసం గంజాయి వ్యాపారం ప్రారంభించారని తెలిపారు.ఈ ముఠాకు చెందిన నిందితులు ఒడిశా రాష్ట్రం, రాయగడ ప్రాంతం నుండి గంజాయి కొనుగోలు చేసి స్థానికంగా విక్రయిస్తూ ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసుల్లోని నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన మంగళగిరి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బ్రహ్మం , మంగళగిరి రూరల్ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ , దుగ్గిరాల ఎస్సై వెంకట రవి , పోలీస్ సిబ్బందిని గుంటూరు జిల్లా ఎస్పీ అభినందించారు.

న్యూజిలాండ్‌తో కీలక ఒప్పందం

>> గోయల్ అన్నారు. “ఇది న్యూజిలాండ్‌కు భారతీయ ఎగుమతులకు 100 శాతం సుంకరహిత ప్రవేశాన్ని కల్పిస్తుంది. ఈ దూరదృష్టి గల ఒప్పందం భారతదేశంలోకి 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సులభతరం చేస్తుందని గోయల్ అన్నారు.

రైతులు, యువత, స్టార్టప్‌లకు చాలా మేలు: ప్రధాని మోడీ: భారత్–న్యూజిలాండ్ సంబంధాల్లో ఇదో గొప్ప రోజు అని, ఇది ఇరుదేశాల అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'భారత్ న్యూజిలాండ్ భాగస్వామ్యంలో ఈరోజు ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మన రెండు దేశాల అభివృద్ధిని మరింత వేగవం తం చేస్తుంది. ఇది మనమధ్య ఉన్న నమ్మకాన్ని, ఉమ్మడి విలువలను, ఆశయా లను ప్రతిబింబిస్తోంది. ఈ ఒప్పందం వల్ల మన రైతులు, యు వత, మహిళలు, ఎంఎస్ఎంఇలు, చేతివృత్తులవారు, స్టార్టప్‌లు, విద్యా ర్థులు, ఆవిష్కర్తలకు ఎంతో మేలు చేకూరుతుంది.

విద్యుత్ కొనుగోలు ఛార్జీలు రూ.4.60కి తగ్గింపు!

>> చర్యలన్నింటి పైనా అధికారులు దృష్టి పెట్టాలి. విద్యుత్ రంగంలో ఏయే దేశాల్లో ఎలాంటి కొత్త ఆవిష్కరణలు అమలు అవుతున్నాయో అధ్యయనం చేయాలి. ఈ ఏడాది చివరి నాటికి విద్యుత్ కొనుగోలు ధరను రూ. 4.60కు తగ్గించాలి. ఈ దిశగా విద్యుత్ శాఖాధికారులు దృష్టి సారించాలి. విద్యుత్ రంగంలో సహా ఏ రంగంలో నైనా ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతోనే సంస్కరణలు అమలు చేస్తున్నాం. ప్రజలకు మేలు చేయాలంటే టెక్నాలజీ వినియోగం అత్యంత అవసరం. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ నిరంతరం గుర్తు చేసుకోవాలి. విద్యుత్ లో రీసెర్చ్ అండ్ అనాలసిస్ కు పెద్ద పీట వేయాలి. దీని కోసం ట్రాన్స్ కో, జెన్కో వంటి సంస్థలు తమకున్న సీఎస్సార్ నిధులు కేటాయించాలి. పొల్యూషన్ తగ్గేలా... పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలి. 2028 29 నాటికి సగాని పైగా విద్యుత్ ఉత్పత్తి రెన్యూవబుల్ ఎనర్జీ ద్వారా వచ్చేలా చూడాలి. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 52396 సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇచ్చాం. దీన్ని మరింత వేగవంతం చేయాలి. ఇకపై ప్రతి నెల2 లక్షల పీఎం సూర్య ఘర్ కనెక్షన్లు ఇచ్చేలా చూడాలి. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 2.94 లక్షల కనెక్షన్లు ఇచ్చాం. మొదటి విడత పీఎం కుసుమ్ పథకాన్ని డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి. ఇక ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కొనుగోళ్లపై పెద్ద ఎత్తున ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.“ అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, విద్యుత్, ట్రాన్సుకో, జెన్కో, వివిధ డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శేషాచలం అగ్నిప్రమాదంపై డి.సిఎం పవన్ ఆరా

>> ప్రమాదం గురించి తెలిసిన వెంటనే యాంటి ఫైర్ స్క్వాడ్ సిబ్బంది 20 మంది, పోలీసులు, మరో 10మంది టీటీడీ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారని, సోమవారం మధ్యాహ్నంమంటలు పూర్తిగా అదుపులోకి వస్తాయని అటవీ అధికారులు తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ యాంటి రెడ్ శాండర్స్ స్క్వాడ్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ కి వెళ్లిన సమయంలో అనుమానాస్పద చర్యలపై ఓ కన్నేసి ఉంచాలి. జూన్ చివరి వరకు ఉండే వేసవిలో అటవీ ప్రాంతంలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

పలువురు పోలీసులపై వేటు

> **హానీట్రాప్ కేసులో సంచలన నిర్ణయం**
> ఒక హెడ్, ఇద్దరు కానిస్టేబుళ్లు డిస్మిస్, మరో సిఐ డిఐజికి అటాచ్
> ఓ ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్
> **సిఐ శ్రీహార్ష సర్వీసు నుండి తొలగింపు**

అనంతపురంక్రైమ్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన హానీ ట్రాప్ కేసులో నలుగురు పోలీసు ఉద్యోగాలు ఊడాయి. ఓ ఎస్ఐ తోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. మరో సిఐకి డీఐజికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దందాలో ముఠాగ్యాంగ్ తో సం బంధాలు కలిగి వారికి సంపూర్ణ సహకారాలు అందించడంతోపాటు సెటిల్మెం ట్లు, దందాలకు తెరలేపిన పోలీసు అధికారులు సిబ్బందిపై ఉన్నతా ధికారులు కొరడా ఝుళిపించారు. దీంతో అనంతపురం జిల్లాలో పెద్ద దుమారం జరిగింది. ఇందులో రాప్తాడు శ్రీహర్షను, అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ గిరి, కానిస్టేబుల్ దుర్గా ప్రసాద్, ఇటుక లపల్లి కానిస్టేబుల్ దేవలా నాయకులు సర్వీసు నుండి పూర్తిగా తొలగిం చేసినట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు. అలాగే అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎస్ఐ రాంబాబు, కానిస్టేబుళ్లు దేవేంద్ర, జయరాం నాయక్ ను పోలీసు అధికారులు సస్పెండ్ చేశారు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్ ను డిఐజి కి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్రీ టౌన్ సీ ఐ రాజేంద్రనాథ్ యాదవ్‌ను విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఆయనను వేకెన్సీ రిజర్వుడుకు పంపారు. ఈ కేసులో ఇప్పటిదాకా 5 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది. ఇప్పటి దాకా బాధితులు ఉండి రాబట్టిన సమాచారం మేరకు నిం దితుల నుండి 13 లక్షల రూపాయలతోపాటు, రెండు కత్తులు, ఆరు సెల్ఫోన్లను స్వాధీనపరుచుకున్నారు. హానీ ట్రాప్ కేసులో పోలీసు శాఖ అత్యంత కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. హానీట్రాప్ ముఠాను నడిపించిన రంగమ్మనాయుడుతో అత్యంత సన్నిహితంగా మెలిగిన పోలీసులకు ఉద్యోగాల నుండి తొలగించడంతో పోలీ సువర్గాల్లో ప్రకం పనలు చోటు చేసుకున్నాయి. నిందితులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటంతో పాటు శ్రీహర్ష, సీఐ బాధితుల ఫిర్యాదును పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో రాప్తాడు. సీఐ శ్రీహర్షను ఉద్యోగం నుంచి తొలగిస్తూ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఆ శాఖ పై ప్రజలకు నమ్మకం ఏర్పడిందని చెప్పవచ్చు. హానీట్రాప్ కేసులో కీలక సూత్రధారిగా ఉన్న రంగమ్మ అలియాస్ చిన్ని, మల్లీశ్వరి, ఉమాదేవిలతో వీరు సన్నిహితంగా ఉన్నట్లు విచారణలో తేలింది. నిందితుల ఖాతాల నుంచి సీఐ, కానిస్టే బుళ్ల ఖాతాలకు రూ.లక్షల్లో నగదు బదిలీ అయినట్లు రూఢీ అయ్యింది. బెంగ ళూరు జాతీయ రహదారి వెంబడి ఓ రెస్టారెంట్ కేంద్రంగా వీరు పంచాయి తీలు జరిపినట్లు వీడియో, ఆడియో ఆ ద . ా ం ా ల న ు విచారణాధికారులు సేకరించారు. అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు శిక్షణ ఎస్పీ అశ్విన్, తాడిపత్రి ఏఎస్పీ రోహిత కు మార్ పూర్తి స్థాయిలో విచారించి ఉన్నతాధి కారులకు నివేదిక సమర్పించారు. దీంతో పోలీసు అధికారులు కూపీ లాగారు. అనంతపురం గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలో హానీట్రాప్‌నకు గురైన కొందరు బాధితులు ఫిర్యాదు చేయడంతో అక్కడి ఎస్సై రాంబాబు నిందితులకు అనుకూలంగా పంచాయితీ చేసినట్లు విచారణలో తేలింది. కొందరు మహిళల నుంచి రాంబాబు డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలూ వచ్చాయి. ఈ విషయం ఉన్నతాధికారుల విచా రణలో నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. రహస్య విచారణ దర్యాప్తు వేగవంతంతో సాగడంతో ఇంకా ఈ ఉచ్చు ఎవరి పైన చుట్టుకుంటుందోనని పోలీసు వర్గాలు భయాందోళనకు గురవుతున్నారు. ముఠా సభ్యులతో పోలీసులు అధికారులు మాట్లాడిన కాల్ రికార్డులు, ఫోన్ సంభాషణతో అధికారులు కూపి లాగి దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగినట్లు అవగతమవుతోంది. అలాగే ఇప్పటిదాకా ధైర్యం చేసి 20 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో ఇప్పటిదాకా ఒక కోటి నాలుగు లక్షల రూపాయల మేరకు ముఠా సభ్యులు బాధితుల నుండి బలవంతంగా గుంజేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. డబ్బులు లేని పక్షాన వారి వద్ద నుండి బలవంతంగా రాయించుకున్న ప్రాంసరీ నోట్లను అధికారులు చించేసినట్లు తెలుస్తోంది. మరోవైపు బిజెపి, టిడిపి వైసిపి పార్టీలకు చెందిన కొం దరు నిందితులతో మూలాఖత్ అయి పెద్దఎత్తున అక్రమాలకు, దందాలకు, పాల్పడిన ఆయా పార్టీల అధిష్టానం ఉద్వాసన పలకడం జోరుగా చర్చలు సాగుతున్నాయి.

వారం - వర్జ్యం

28-04-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, భరణి కార్తె
ద్వాదశి సా.6.55
ఉత్తరఫల్గుణి రా.10.38
వర్జ్యం : లేదు
దు.ఉ.8.16–ఉ.9.07,
2)రా.11.31–రా.12.22
రాహుకాలం - మ.3.00–4.30

వార్తాఫలం

మేషం: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్యక్రమాలను పూర్తిచేయగలుగుతారు. సమావేశాలలో పాల్గొంటారు.

వృషభం: ఉద్యోగాలలో మిశ్రమ ఫలితాలు ఉంటాయి. బంధువులనుండి ఆసక్తికరమైన సమాచారం అందుకుంటారు.

మిథునం: ముఖ్యమైన వ్యవహారాలలో సొంతనిర్ణయాలు తీసుకోవడం మంచిది. సంతానపరంగా పురోగతి ఉంటుంది.

కర్కాటకం : జీవితభాగస్వామి సలహాతో నూతనకార్యక్రమాలుకు శ్రీకారంచుడతారు. వాహనాల విషయంలో జాగ్రత్త.

సింహం: సంగీత, సాహిత్య, కళా రంగములలోని వారికి అనుకుల కాలము. విందు, వినోదాలలో పాల్గొంటారు.

కన్య : ప్రతి చిన్నవిషయానికి భావోద్రేకాన్ని కలిగిఉంటారు. సహచరవర్గానికి సహాయం అందిస్తారు.నూతన విద్యావకాశాలు కలవు.

తుల : బాధ్యతలు అధికమవుతాయి. అండగా నిలిచేవారు, సహాయసహకారాలు అందించేవారు కరువవుతారు.

వృశ్చికం: మానసికంగా కృంగిపోరు. ఆత్మస్థైర్యంతో సమస్యలతో సమరం సాగిస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

ధనుస్సు: ఆర్థికంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు. కొత్త పెట్టుబడులకు అనుకూలమైన కాలం కాదు.

మకరం: మాటమీద నిలబడే వ్యక్తిగా మంచి పేరును సంపాదించగలుగుతారు. ఉద్యోగులకు స్థానచలనం కలదు.

కుంభం: ఫైనాన్స్ రంగంలోని వారికి అనుకూలకాలం కాదు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం. బంధువుల కలయిక.

మీనం : ఆలోచనలు పరిపరి విధాలుగా సాగుతాయి. సంతానం యొక్క పురోభివృది పైన శ్రద్దవహించవలసి ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

28-4Pg3exHMNWJQE.qxd:28-4Pg3exHMNWJQE.qxd 1/1/02 6:46 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

విశాఖపట్నం

fb.com/vaartha Digital

Published from Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-4-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 87 పేజీలు: 16 వెల: 6.50

బెంగాల్‌లో ముగిసిన ఎన్నికల ప్రచారం

హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తాం: ఇరాన్

5లో

ఆంధ్రా విశ్వవిద్యాలయం ఒక ఎమోషన్..

ఫిజిక్స్ నుంచి పాలిటిక్స్ దాకా వర్సిటీకి ఒక ప్రత్యేకమార్క్

ఇలాంటి ప్రాచీన వర్సిటీ అపూర్వం

ఎయు శతాబ్ది వేడుకల్లో మంత్రి లోకేష్

విశాఖపట్నం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్ స్టిట్యూషన్ మాత్రమే కాదని, తనలాంటి వారికి ఒక ఎమోషన్ అని, ఏయూ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ వేడుకలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ ఈ రోజు ఒక గర్వ కారణమైన, చరిత్రాత్మక సందర్భం. శతాబ్ద కాలంగా వెలుగొందుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం గొప్పదనాన్ని జరుపుకునేందుకు మనం అందరం ఇక్కడకు వచ్చాం. ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్ స్టిట్యూషన్ మాత్రమే కాదు నాలాంటి వారికి ఒక ఎమోషన్. తరతరాలుగా మన మనస్సుల్లో మెదులుతోంది. భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కి హృదయపూర్వక స్వాగతం పలకడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ సేవాగుణం, నిష్ఠ,ప్రజాసేవ పట్ల మీ అంకితభావం తరతరాలకు ప్రేరణగా నిలుస్తోంది. అదేవిధంగా ఏపీ గవర్నర్, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఛాన్స్‌లర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కి కూడా హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తున్నాం. మీ మార్గదర్శకత్వం, నాయకత్వం ఈ గొప్ప సంస్థను మరింత బలపరుస్తోంది. అదేవిధంగా లక్షలాది హృదయాలను గెలుచుకున్న మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌ని స్వాగతించడం గౌరవంగా భావిస్తున్నా. క్రమశిక్షణ, అంకితభావానికి, ప్రతిభకు ఆయన నిదర్శనంగా నిలుస్తారు. దార్శనిక నేత, గౌరవనీయ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి స్వాగతం. విద్యే అభివృద్ధికి పునాది అని ఆయన విశ్వసిస్తారు. వేదికపై ఉన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ హరిబాబుకి, ఇక్కడకు విచ్చేసిన ఇతర >>2

వర్సిటీలకు దిక్సూచి ఎయు

సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకల్లో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్లు అబ్దుల్ నజీర్, హరిబాబు, కేంద్రమంత్రులు పెమ్మసాని, రామ్మోహన్‌నాయుడు, సిఎం చంద్రబాబు తదితరులు

యువత జాబ్ సీకర్స్‌కాదు.. క్రియేటర్లు కావాలి

గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖకు కొత్తచరిత్ర

ఎయు అభివృద్ధికి రూ.500కోట్లు

వర్సిటీ శతాబ్దివేడుకల్లో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: యూనివర్సిటీలు డిగ్రీలు ఇచ్చే విద్యా కేంద్రాలు మాత్రమే కాదని సమాజాన్ని ప్రభావితం చేసే ఆవిష్కరణలకు వేదిక కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. యూనివర్సిటీలు జాతీయ ఆస్తులని, వాటిని కాపాడుకోవాలని అన్నారు. విశాఖలో జరిగిన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పాల్గొన్నారు. యూనివర్సిటీలో రూ.64 కోట్లతో చేపట్టిన ఏయూ ఐ ఫ్యాక్టరీ, నెట్వర్క్ సెంటర్‌ను ప్రారంభించారు. మరో రూ.112 కోట్లతో 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్, కాన్వకేషన్ హాలుతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలివిద్యార్థులు, పూర్వ విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా రోజులు మారాయి.. సాధారణ మనుషులు అసాధారణ శక్తిగా మారే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "నాలెడ్జ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లపై యువత దృష్టి పెట్టాలి. పారిశ్రామిక రంగానికి >>2

గొప్ప పరిశోధనా కేంద్రంగా ఎయు

ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్

విశాఖపట్నం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని భారత ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన శతాబ్ది వేడుకల ముగింపు ఉత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ గురువులందరికీ నా వందనాలని, వారి మార్గదర్శకత్వం వల్లనే నేను ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం తనకు బలమైన పునాదిని అందించిందని తెలిపారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పడిన మహానుభావులను స్మరించుకున్నారు. సి. ఆర్.రెడ్డి దార్శనికత, సర్వేపల్లి రాధాకృష్ణన్ మార్గదర్శకత్వం, >>2

ఇన్ఫోసిస్‌కు విశాఖలో 20 ఎకరాలు

విజయవాడ,ఏప్రిల్ 27, ప్రభాతవార్తప్రతినిధి: ప్రముఖ ఐటీ సంస్ద ఇన్ఫోసిస్‌కు విశాఖపట్నంలో 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు రూ. 750 కోట్ల భారీ పెట్టుబడితో ఇన్ఫోసిస్ తన కేంపస్‌ను ఇక్కడ విస్తరించనుంది. ఈ కొత్త కేంపస్ ద్వారా ప్రారంభ దశలోనే సుమారు 7 వేల మంది సాఫ్ట్‌వేర్ నిపుణులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ, ఐటీ ఈఎస్ కేంపస్ ద్వారా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, బిజినెస్ ప్రాసెస్ రంగాల్లో విశాఖ గ్లోబల్ సెంటర్‌గా మారనుంది. ఇన్ఫోసిస్ వంటి గ్లోబల్ బ్రాండ్ రాకతో స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడటమే కాకుండా, మరిన్ని అనుబంధ సంస్థలు విశాఖ వైపు చూసే అవకాశం ఉంది.

పెట్రోలు కొరత రానివ్వొద్దు

కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు

ఆయిల్ కంపెనీలు తమ పాలసీలు మార్చుకోవాలి

పరిస్థితిపై ప్రతి 3గంటలకు నివేదిక ఇవ్వండి

ఇంధన సంక్షోభంపై సిఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

విజయవాడ,ఏప్రిల్ 27,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సమస్యకు సంబంధించి అత్యవసరంగా సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. డిమాండ్‌కు తగిన సప్లయ్ ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. సమస్యను చక్కదిద్దేందుకు టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయిల్ కంపెనీలు అప్పటికప్పుడు పాలసీలు మార్చి ఇబ్బంది పెడితే ఎలా అంటూ ఆవేశపడ్డారు. వరికోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దని సీఎం సూచించారు. సమస్య పరిష్కారానికి నిన్న రాత్రి నుంచి ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపై వివరణ కోరిన సీఎం చంద్రబాబు.సోమవారం సాయంత్రానికి మెజారిటీ ప్రాంతాల్లో సాధారణ స్థితి ఏర్పడుతుందని అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పెట్రోల్, డీజిల్ ముఖ్యమంత్రికి వివరించారు.సరఫరాలో సాధారణ పరిస్థితిని తెచ్చేందుకు అధికారులు, ఆయిల్ కంపెనీల యాజమాన్యాలు సమన్వయంతో పని చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఉదయం డిస్పాచ్ సెంటర్ల నుంచి వెళ్లిన ఆయిల్ ట్యాంకర్లు ఈ రోజు సాయంత్రం వరకూ రిటైల్ బంకులకు చేరుకుంటాయని తెలిపిన ఆయిల్ కంపెనీల ప్రతినిధులు స్వయంగా కలెక్టర్లు, ఎస్పీల పర్యవేక్షణలో ప్రజలు ఇబ్బంది పడకుండా ఆయిల్ సరఫరా జరిగేలా చూడాలని అన్నారు.కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఆయిల్ డిస్పాచ్ సెంటర్లకు వెళ్లి సరఫరాను పర్యవేక్షించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో పరిస్థితులపై ఆర్టీజీ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షించి ప్రతీ 3 గంటలకు ఒకసారి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు, మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశించారు.మీడియా, సోషల్ మీడియాలో వస్తోన్న కథనాలు, క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగా అధికారులు స్పందించాలని ముఖ్యమంత్రి సూచించారు.సంబంధించిన అంశంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు.సమస్య 3 రోజుల క్రితమే గుర్తించామని అధికారులు చెప్పారు. అలాంటప్పుడు గుర్తించినప్పుడు పరిస్థితిని ఎందుకు చక్కదిద్దలేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత తలెత్తడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కంపెనీలు రిటైల్ ఔట్ లెట్లకు ఇంతకు మందులా క్రెడిట్ ఇవ్వట్లేదని అధికారులు తెలిపారు. క్రెడిట్ ఎందుకు ఇవ్వట్లేదని హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ ప్రతినిధులను సీఎం ప్రశ్నించారు. కంపెనీలు, రిటైల్ ఔట్‌లెట్ల మధ్య గ్యాప్ లేకుండా చూసుకోవాలన్నారు.ప్రజల్ని, ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని చూస్తే అనుమతుల విషయంలో పునరాలోచన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అయిల్ కంపెనీల అసంబద్ధ నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందిపడితే సహించేది లేదని తేల్చిచెప్పారు. ప్రజల నిత్యావసరాలకు సమస్య తలెత్తిన తర్వాత ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో తనకు నివేదికలు ఇవ్వడం కాదని ఫలితాలు చూపించాలని స్పష్టం చేశారు. ప్రైవేటు ఆయిల్ డిపోల నుంచి రిటైల్ బంకులకు ఎటువంటి జాప్యం లేకుండా ఆయిల్ ట్యాంకర్లు చేరుకునే విధంగా చూడాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆయిల్ కంపెనీలు నిరంతరం పని చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు రెవెన్యూ,పోలీస్, లీగల్ మెట్రాలజీ విభాగాలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూమ్‌ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సీఎం ఆదేశించారు. అగ్రి, ఆక్వా సాగు అవసరాలు కూడా పెరిగాయని వరికోత యంత్రాలకు డీజిల్ కొరత రానివ్వొద్దని స్పష్టం చేశారు. ప్రతీ బంక్ దగ్గర రెవెన్యూ, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడా బ్లాక్ అమ్మకాలు జరగడానికి వీల్లేదన్నారు. ఇవాళ్టికి ఎక్కడా నో స్టాక్ బోర్డులు కనిపించకూడదని సీఎం చంద్రబాబు నిర్దేశించారు.

ముందుగానే నైరుతి రుతుపవనాలు

రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

ప్రభాతవార్త విశాఖపట్నం: ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందుగానే ప్రవేశించే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. దీని వల్ల మండే ఎండల నుంచి ఉపశమనం లభించడంతో పాటు వ్యవసాయ రంగానికి ఊరటనిచ్చే పరిస్థితులు ఏర్పడనున్నాయి. సాధారణంగా జూన్ 1న కేరళ తీరాన్ని తాకే రుతుపవనాలు, ఈసారి మే 25 నాటికే చేరుకునే అవకాశముందని యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియంరేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ వెల్లడించింది.ఈ పరిస్థితి కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌లో కూడా రుతుపవనాలు ముందుగానే ప్రవేశించే అవకాశముందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గత సంవత్సరం మే 24న కేరళలోకి వచ్చిన రుతుపవనాలు, మే 26 నాటికే రాష్ట్రానికి విస్తరించాయి.ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వడగాలుల తీవ్రత పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 200కు పైగా మండలాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. దీంతో విద్యుత్ అంతరాయాలు, డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రుతుపవనాలు >>2

పట్టాలు తప్పిన వందేభారత్

పుణే స్టేషన్ సమీపంలో దుర్ఘటన

ప్రయాణీకులంతా క్షేమం

పూణె ఏప్రిల్ 27: ముంబయి షోలాపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. పూణె రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలోనే ఈ దుర్ఘటన జరిగింది. అయితే ప్రయాణీకులెవ్వరికీ గాయాలుకూడా కాలేదని అధికారులు తెలిపారు. రాత్రి 7.30 గంటలప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ముంబయి ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్‌నుంచి వాయవ్య మహారాష్ట్రలోని షోలాపూర్‌కు వెళుతోంది.ప్రీమియం ఏసి రైలు కావ >>2

శేషాచలం అగ్నిప్రమాదంపై డి.సిఎం పవన్ ఆరా

విజయవాడ,ఏప్రిల్ 27,ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి సమీపంలో శేషాచలం అడవుల్లో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. మంటలు మరింత విస్తరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తక్షణం అదుపు చేసేందుకు అవసరమయిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అగ్నిప్రమాద ఘటనపై విచారణ జరిపి బాద్యులపై అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిప్రమాద ఘటనపై పీసీసీఎఫ్ నుంచి వివరణ కోరారు. తిరుపతి పట్టణానికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలోని బయోట్రిమ్ వెనుక భాగంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాద ఘటనపై పీసీసీఎఫ్ పి.వి.చలపతి రావు, ఇతర అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.మంటలను సాధ్యమైనంత త్వరగా అదుపులోకి తీసుకువచ్చే విధంగా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంటలు మరింత విస్తరించకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. తిరుపతి ఘటనపై పీసీసీఎఫ్ వివరణ తీసుకోవాలని, పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులను ఆదేశించారు. >>2

సోమవారం విద్యుత్‌శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

విద్యుత్ కొనుగోలు ఛార్జీలు రూ.4.60కి తగ్గింపు!

పునరుత్పాదన ఇంధన ఉత్పత్తి పెంచడమే లక్ష్యం

ఇంధన పరిశోధనకు ప్రత్యేక వర్సిటీ

'ఇవి' వాహనాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి

విద్యుత్‌పై సిఎం చంద్రబాబు సమీక్ష

విజయవాడ, ఏప్రిల్ 27, ప్రభాతవార్తప్రతినిధి: ప్రజా ప్రయోజనాల కోసమే విద్యుత్తు రంగంలో సంస్కరణలు తెస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు .ఆ సంస్కరణల అమలు కోసం టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని . తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసే అంశంపై నిరంతరం అధ్యయనం, జరుగుతూనే ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ పై సీఎం చంద్రబాబు సమీక్షించారు. వేసవిలో విద్యుత్ సరఫరా, 2026-27 ఏడాదిలో పవర్ ప్రొక్యూర్మెంట్ ప్లాన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు. వేసవిలో ప్రతి రోజూ 275 నుంచి 285 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందని అంచనా వేసినట్టు అధికారులు చెప్పారు. ఈ నెలలో ఇప్పటి వరకు 6397 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించు కున్నామని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం మేర విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. విద్యుత్ వినియోగం పెరగడానికి వేసవితో పాటు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగిందని అధికారులు వివరించారు. వచ్చే ఆరు నెలల కాలానికి విద్యుత్ కొనుగోళ్ల ప్రణాళికలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. ఏప్రిల్ 2025లో విద్యుత్ కొనుగోలు ధర రూ. 5.20 ఉండగా.. మార్చి 2026 నాటికి రూ. 4.90కు తగ్గించామని అధికారులు చెప్పారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి మాటాడుతూ విద్యుత్ కొనుగోళ్ల వ్యయం తగ్గాలి. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో అలాంటి >>2

గంజాయి కేసులో 27 మందికి జైలు

గుంటూరు, ఏప్రిల్ 27 ప్రభాత వార్త ప్రతినిధి : గుంటూరు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై మంగళగిరి రూరల్, దుగ్గిరాల పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో మొత్తం 27 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుండి మొత్తం 4.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళగిరి, విజయవాడ ప్రాంతాలకు చెందిన యువకులు, విద్యార్థులను టార్గెట్‌గా చేసుకొని గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్న ముఠాను మంగళగిరి రూరల్ పోలీసులు గుర్తించారు. ఈ. కేసులో ప్రధాన నిందితుడు రావి మహేష్ కుమార్ గతంలోనే అనేక గంజాయి కేసుల్లో వున్నాడు. ఇతని ముఠాలోని కొందరు పాడేరు ప్రాంతానికి వెళ్లి గం జాయి కొనుగోలు చేసి, మంగళగిరి పరిసర >>2

న్యూజిలాండ్‌తో కీలక ఒప్పందం

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్, న్యూజిలాండ్ వాణిజ్య మంత్రులు సంతకాలు

రైతులు, యువత, స్టార్టప్‌లకు ఎంతో మేలు: ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఏ) కుదిరింది. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్ర మంలో ఇరుదేశాల వాణిజ్య మంత్రులు పీయూష్ గోయల్, టాడ్ మెక్‌క్లే సంతకాలు చేశారు. ఈ ఎఫ్‌టిఏ వల్ల భారత్‌కు ఎంతో మేలు చేకూరనుంది. ముఖ్యంగా భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి చేసే 100శాతం ఉత్పత్తులకు కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయింపు లభిస్తుంది. అంటే అన్ని ఉత్పత్తి కేటగిరీలకు, అన్ని టారిఫ్ లైన్లకు ప్రవేశ పన్నుల నుంచి మినహా యింపు దొరుకుతుంది. దీనివల్ల వస్త్రాలు (టెక్స్‌టైల్స్), దుస్తులు (అపెరల్స్), (తోలు) లెదర్, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ప్రాసెస్డ్ ఫుడ్స్‌లాంటి రంగాల్లో పోటీతత్వం పెరుగుతుంది. తద్వారా చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఇ)కు, ఉపాధి కల్పనకు మంచి ఊతం లభిస్తుంది. ఈ ఒప్పందంపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, 'భారతదేశపు మొట్ట మొదటి మహిళా నేతృత్వ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అని, ఇది ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక ప్రయాణంలో ఒక కీలకమైన మైలురాయి' అని అన్నారు. ప్రధాన సంధాన కర్త, ఉప సంధానకర్త, పారిశ్రామిక రంగాల అధిపతు లతో సహా, సంప్రదింపుల బృందంలో అధిక శాతం మహిళలే ఉన్నారనే విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రోత్సహించిన ఈ చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం, వాణిజ్య సంప్రదింపులలో లింగ సమానత్వానికి ఒక మైలురాయిగా, అలాగే దేశీయ పరిశ్రమలకు, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలకు ఒక ప్రోత్సాహంగా పరిగణించ బడుతోందని పేర్కొన్నారు.ఈ చరిత్రాత్మక ఒప్పందం గాఢమైన పరస్పర విశ్వాసాన్ని, ఉమ్మడి ఆశయాన్ని, శ్రేయస్సు పట్ల ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తుందని >>2

సోమవారం న్యూఢిల్లీలో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న మంత్రులు

28-4Pg7exHMNWJQEBPGOLC.qxd:28-4Pg7exHMNWJQEBPGOLC.qxd 1/1/02 6:31 AM Page 1

తిరుమల సమాచారం

గరుడవాహనంపై వరుడుగా వెంకన్న

- కన్నులపండువగా ముగిసిన పద్మావతి పరిణయం

తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల నారాయణగిరి ఉద్యానవనాల్లో మూడురోజులపాటు జరిగిన పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు సోమవారం సాయంత్రం కన్నులపండువగా ముగిశాయి. చివరిరోజు సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకున్న మలయప్పస్వామి గరుడవాహనం అధిరోహించగా, శ్రీదేవిభూదేవి పల్లకీపై మరోవైపు నారాయణగిరి ఉద్యానవనంలోని కళ్యాణవేదికపైకి మంగళవాయిద్యాలనడుమ వేంచేపుచేశారు. కళ్యాణవేదిక వద్ద ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేకంగా ఫల, పుష్పాలతో తీర్చిదిద్దిన కళ్యాణమండపం వేదికపై స్వామి అమ్మవార్లను కొలువుదీర్చారు. ఆగమోక్తంగా కళ్యాణఘట్టాన్ని జరిపించారు. కొలువు, ఎదురుకోలు, పూలబంతులాట, నూతన వస్త్రాలు ధరింపజేయడం వంటివి అర్చకులు జరిపించడంతో భక్తులు కన్నులపండువగా వీక్షించి తన్మయత్వం చెందారు. అన్నమాచార్య కళాకారులు ఆలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అక్కడ నుండి మంగళవాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్లు తిరిగి ఆలయానికి చేరుకోవడంతో పరిణయోత్సవాలు ముగిశాయి. పరిణయోత్సవ మండపాన్ని వివిధ రకాల ఫలాలు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో అలంకరించి, శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అందరికీ శుభాలు కలగాలి

- తెలంగాణ బిజెపి చీఫ్ రామచంద్రరావు

తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆశిస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు తెలిపారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం రామచంద్రరావు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లారు. అక్కడ తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు బిజెపి నాయకులు ఆలయం ముందు స్వాగతం పలికారు. ఆలయ అధికారులు అమ్మవారి దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం ఆలయం వెలుపల ఆయనను బిజెపి నాయకులు రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బిజెపి నాయకులు అజయ్ కుమార్, లోక్ ప్రభాకర్ నాయుడు, డాక్టర్ శ్రీధర్ రావు, శివ రాయల్, డాక్టర్ బండ్ల సోమేష్, మిట్టపల్లి బ్రహ్మానందరెడ్డి, అశోక్ శ్రీవారి చిత్రపటం బహూకరించారు.

ఎస్వీ అన్నప్రసాదంకు రూ.20 లక్షలు విరాళం

తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు కుటుంబం రూ.20లక్షలు విరాళమిచ్చారు. ఆయన కుమార్తె ఆముక్త, కుమారుడు అవనీష్ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఒక్కొక్కరు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. దాతలు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ఉన్నారు.

తిరుమలేశునికి రెండు బ్రహ్మోత్సవాలు

- సెప్టెంబర్ 15నుండి సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- అక్టోబర్ 12నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రంపై కొలువైన ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు టిటిడి నిర్వహించనుంది. నిత్యం ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు దేవదేవునికి జరుగుతుంటాయి. సంవత్సరానికోసారి జరిగే తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత వుంది. ఈ ఏడాది అధికమాసం రావడంతో శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడవ సంవత్సరం అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భంలో కన్యామాసం(భాద్రపదంలో) సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవం, ఆశ్వయుజంలో దసరా నవరాత్రుల్లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు టిటిడి నిర్వహిస్తుంది. సెప్టెంబర్ 15వ తేదీ మంగళవారం నుండి 23వ తేదీ బుధవారం వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, తిరిగి అక్టోబర్ 12వ తేదీ సోమవారం నుండి 20వ తేదీ మంగళవారం వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించేలా తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమసలహా మండలి, అర్చకులు నిర్ణయించారు. ఆలయ మాఢవీధుల్లో వాహనసేవలను, నిత్యకైంకర్యాలను అర్చకస్వాములు వేద మంత్రోచ్ఛరణల నడుమ వైఖానస ఆగమోక్తంగా జరిపించేందుకు ముహూర్తం ఖరారుచేశారు. ప్రతి ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాలకు లక్షలమంది భక్తులు దేశవిదేశాల నుంచి ఏడుకొండలకు చేరుకుని వివిధ అలంకారాలలో పలు వాహనాలపై వేంచేసి భక్తకోటికి దర్శనమిచ్చే ఆపద మొక్కులవాడిని కన్నులారా వీక్షించి ముగ్ధులవుతారు. బ్రహ్మోత్సవాలు జరిగే అన్ని రోజుల్లో సర్వదర్శనం మినహాయించి మిగిలిన అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దుచేస్తారు. సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 14 సోమవారం సాయంత్రం అంకురార్పణం, 15న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8గంటలకు ప్రారంభమవుతుంది. రాత్రి వాహనసేవ 7గంటలకు జరిపిస్తారు. తొలి వాహనసేవగా 15వ తేదీ రాత్రి పెద్దశేషవాహన సేవ మొదలవుతుంది. 19 శనివారం గరుడవాహనసేవ, 22న రథోత్సవం, 23న చక్రస్నాన మహోత్సవం ముఖ్య ఘట్టాలు. అలాగే నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. అక్టోబర్ 11వ తేదీ రాత్రికి అంకురార్పణ, 12వ తేదీ బంగారుతిరుచ్చితో బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతాయి. తొలివాహనంగా పెద్దశేష వాహనసేవ ఊరేగనుంది. అక్టోబర్ 16వ తేదీ శుక్రవారం గరుడసేవ జరగనుంది. 17న పుష్పకవిమానం, 19న స్వర్ణరథం, 20న చక్రస్నానంతో ముగుస్తాయి. టిటిడి బోర్డు, టిటిడి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసేలా ప్రణాళికలు రూపొందించుకుంటారు.

అభివృద్ధికి విద్యుత్తే ప్రధాన ఆధారం

- పిన్నాపురం గ్రీన్కో ప్రాజెక్టుపై ప్రశంసలు
- ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు
- త్వరలో కర్ణాటకలో 3000 మెగావాట్ల ప్రాజెక్టు

కర్నూలు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: ఒక దేశం లేదా ప్రాంతం అభివృద్ధి పూర్తిగా విద్యుత్‌పై ఆధారపడి ఉంటుందని కర్ణాటక రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కేలచంద్ర జోసెఫ్ జార్జ్ పేర్కొన్నారు. సోమవారం ఓర్వకల్లు మండలం పిన్నాపురంలో గ్రీన్కో సంస్థ ఏర్పాటు చేసిన ఇంటెగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. పిన్నాపురం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుగా నిలుస్తుందని, కర్నూలు జిల్లాకు ఇది ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని తెలిపారు. దేశ అభివృద్ధికి విద్యుత్తు అత్యవసరమని, ఒక విద్యుత్ ప్రాజెక్టు స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అటవీ శాఖ వంటి అనేక అనుమతులు అవసరమవుతాయని చెప్పారు. ఈ అన్ని అడ్డంకులను అధిగమించి ప్రాజెక్టును నిర్మించిన గ్రీన్కో సంస్థను అభినందించారు. పిన్నాపురం పంప్డ్ స్టోరేజ్ స్టేషన్‌ను పరిశీలించిన తర్వాత ఇది అత్యుత్తమ ప్రాజెక్టుగా అభివర్ణించారు. కర్ణాటకలో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి, ఇతర రాష్ట్రాల సరఫరా ద్వారా ఎటువంటి సమస్యలు లేకుండా అవసరాలు తీర్చుతున్నామని తెలిపారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కర్ణాటకలో శరావతిలో 125 ఎకరాల్లో 3000 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని, ఇది త్వరలో అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ వనరులైన పవన, సోలార్ విద్యుత్ వాతావరణ పరిస్థితులపై ఆధారపడటంతో నిలిచిపోయే అవకాశముందని, అందుకే పంప్డ్ స్టోరేజ్ విధానం అత్యంత కీలకమని వివరించారు. బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తిని 30 శాతానికి మించి పెంచకూడదనే విధానాన్ని ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని, ఈ నేపథ్యంలో పంప్డ్ స్టోరేజ్ ద్వారా అధిక లోడ్ సమయంలో కూడా విద్యుత్ సమస్యలు ఉండవని తెలిపారు. గ్రీన్కో సంస్థ ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలలో విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసి దేశ అభివృద్ధికి సహకరిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో కర్ణాటకకు చెందిన రాజె గౌడ, గౌరవ్ గుప్తా, గ్రీన్కో ఎండీ చలమలశెట్టి అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్ళి కొడుకుగా ముస్తాబై కోనకు పల్లకీలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుడు

- స్వామి వెంట కాలినడకన కోనకు వేలాదిమంది భక్తులు
- ఆలయ ముఖద్వారం వద్ద స్వాగతం పలికిన అర్చకులు

రాపూరు (నెల్లూరు), ఏప్రిల్ 27 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహా స్వామివారు బ్రహ్మోత్సవాలకు పెళ్ళి కొడుకుగా ముస్తాబై ఉభయ నాంచారులతో కలిసి సోమవారం గోనుపల్లి గ్రామం నుండి పెంచలకోనకు పల్లకీలో బయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా గోనుపల్లి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బ్రహ్మోత్సవాలకు ఉభయ దేవేరులతో పల్లకిలో కోనకు బయలుదేరిన స్వామి వారికి గోనుపల్లి గ్రామస్తులు వారి నివాసాల ముందుబాగాన చలువ పందిళ్ళు ఏర్పాటు చేసి స్వాగతం పలికి మొక్కులు చెల్లించారు. స్వామి వారు గ్రామ గిరిజన కాలనీ వద్దకు చేరుకోగానే గిరిజనులు వారి సాంప్రదాయం ప్రకారం ఇంటి అల్లుడైన పెంచల స్వామికి గిరిజన సాంప్రదాయం ప్రకారం పుట్టతేనే, ఇంజేటి గడ్డలు, ఇతర దుంపలు, అరినార మొలతాడు వంటి వాటిని నైవేద్యంగా సమర్పించారు. అక్కడి నుండి బయలు దేరిన స్వామి వారు గొల్లబోయిన స్వామి వారి ఆలయం వద్దకు చేరుకోగానే గొల్లబోయిన స్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తోలి దర్శనం గొల్లబోయిన స్వామి వారికి ఇచ్చారు. అక్కడి నుండి సుమారు 6 కిలోమీటర్ల మేర స్వామి వారిని బోయిలు గోవింద నామస్మరణలతో పల్లకీలో మోసుకుంటూ కోనకు చేరుకున్నారు. కోనలోని స్వామి వారి ముఖద్వారం వద్దకు స్వామి వారు చెరుకున్నంతనే అర్చక స్వాములు అక్కడికి చేరుకోని స్వామి వారికి పూజలు నిర్వహించి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ సతీమణి కురుగొండ్ల సిందు, సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్‌రెడ్డి, ఆలయ ఇన్‌చార్జ్ డిప్యూటీ కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, పీర్ల సోమయ్య, బొట్ట పూజిత, శ్రీశైలం భార్గవ రామ్, తోట ఉమా, మోదేపల్లి ఇందిర, చీర్ల వెంకటేశ్వర్లు, కిన్నెర నరసింహా రావు, పెమ్మసాని సుగుణమ్మ, మొమిడి దేవిక, ఈతముక్కల సుగుణమ్మ, బోగోలు బాస్కర రెడ్డి, బోంతల పుష్పలత, తురిమెర్ల పెంచలయ్య, ఏకసిరి అంకమ్మ, పెద్ద ఎత్తున భక్తులు వున్నారు.

స్వామి వెంట కాలినడకన వేలాదిమంది భక్తులు కోనకు: బ్రహ్మోత్సవాలకు కాలినడకన పల్లకీలో కోనకు బయలుదేరిన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహా స్వామి వారి వెంట ఈ పర్యాయం గతంలో ఎన్నడూ లేని విధంగా వేలాధి మంది భక్తులు గోవింద నామస్మరణలు చేసుకుంటూ కాలినడకన కోనకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం, చెక్క భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పన్ను ఎగ్గొట్టిన బస్సులు స్వాధీనం

రూ.2.69 లక్షల జరిమానా

తిరుపతి(రవాణ), ఏప్రిల్ 27 ప్రభాతవార్త: ప్రయాణికుల భద్రత, మోటార్ వాహన నిబంధనల అమలు దృష్ట్యా తిరుపతి జిల్లాలో రవాణాశాఖ అధికారులు కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై తనిఖీలు కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో చెన్నై నుంచి జమ్మలమడుగు వైపు వెళ్తున్న ఒక బస్సును తనిఖీ చేయగా, ఆల్ ఇండియా పర్మిట్ పన్ను చెల్లించకుండా నడుపుతున్నట్లు గుర్తించారు. మోటార్ వాహన తనిఖీ అధికారి అతికా నాజ్ వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని, పన్ను మరియు పెనాల్టీగా రూ.2.69 లక్షలు విధించారు. అలాగే భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న మరో బస్సులో స్పీడ్ గవర్నర్‌ను తారుమారు చేసినట్లు గుర్తించి అధికారి ఆంజనేయ ప్రసాద్ సీజ్ చేశారు. ఈ నెలలో చెన్నై, బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్ నుంచి తిరుపతి మీదుగా వచ్చిన సుమారు 1750 బస్సులను తనిఖీ చేయగా, 95 వాహనాలపై నిబంధనల ఉల్లంఘనల కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ చర్యల ద్వారా రూ.10 లక్షలకుపైగా పన్నులు, జరిమానాలు వసూలయ్యాయి. నిబంధనలు పాటించని వాహనాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. వాహన యజమానులు పత్రాలు, పన్నులు సక్రమంగా ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని సూచించారు.

ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

యడ్లపాడు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: చిన్నారులకు సెలవులు కావటం వల్ల చెరువుకు వెళ్లి మృత్యువాత పడిన ఘటన యడ్లపాడులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బోయపాలానికి చెందిన షేక్ ఇమాంసా, అమినాబి దంపతులకు కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. వీరు యడ్లపాడుకి వచ్చి నివాసం ఉంటున్నారు. షేక్ మొహమ్మద్ అహమ్మద్(17) గుంటూరు లోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. వీరి నివాసానికి సమీపానే ఉన్న యడ్లపాడుకు చెందిన ప్రైవేటుగా విద్యుత్ పనులు చేసుకుని జీవనం సాగించే షేక్ మస్తానవలి, మునీరాబేగం దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్దవాడైన షేక్ అమానుల్లా(13) స్థానిక జెడ్పీ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరు ఆదివారం సాయంత్రం సైకిల్‌పై జగ్గాపురం రోడ్డులో ఉన్న చవిటిచెరువు వద్దకు వెళ్లారు. నీటిలోకి దిగిన కొద్దిసేపటికే ఆ ఊబి వారిని మృత్యువు వైపు లాగేసింది. చీకటి పడుతున్నా బిడ్డలు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెతుకులాట ప్రారంభించారు. చెరువు ఒడ్డున ఉన్న సైకిల్, చెప్పులు వారి గుండెల్లో రాయి వేశాయి. సమాచారం అందుకున్న ఎస్ఐఐ టి శివరామకృష్ణ తన సిబ్బందితో ఘటనా స్థలం చెరువు వద్దకు చేరుకొని, గాలింపు చేపట్టగా, ఆ ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. విగతజీవులుగా పడి ఉన్న వారిని చూశాక గుండెలు బాదుకుంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు.

జొన్నవాడ ఆర్చ్ వద్ద రోడ్డు ప్రమాదం... యువకుడి దుర్మరణం

నెల్లూరు క్రైం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: నెల్లూరు రూరల్ మండలం జొన్నవాడ ఆర్చి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండ్లపూడి గ్రామానికి చెందిన పుట్టా సునీల్ (30) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం సునీల్ తన మోటార్ సైకిల్ (ఏపి 39 ఎంవై 9886) పై కొండ్లపూడి నుండి బుచ్చి వైపు వెళ్తుండగా, దేవరపాళెం నుండి నెల్లూరు వైపు వస్తున్న బోలేరో ట్రక్కు (ఏపి 37 టిడి 3132) అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి జొన్నవాడ అర్చ్ వద్ద బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సునీల్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని శోకసంద్రంలో మునిగిపోయారు. తండ్రి పుట్టా వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ సిఫార్సు లేఖతో దర్శనం మోసం

తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: అమాయక భక్తులకు తిరుమలేశుని దర్శనం చేయిస్తానని నమ్మించి మోసం చేసిన ఓ వ్యక్తిని తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాధిత భక్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన తిరుమల పోలీసులు చివరకు మోసగాడ్ని కటకటాల్లోకి పంపారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన బాధితురాలు అనిత తన కుటుంబ సభ్యులు 12 మందికి దర్శనం టిక్కెట్లు ఏర్పాటు చేయమని చాగంటి నవీన్ కుమార్‌ని సంప్రదించారు. అతను టిటిడి బోర్డు సభ్యుడి వద్ద పిఆర్‌ఒగా ఉంటున్నానని, ఆయన లేఖపై దర్శనాలు చేయిస్తానని నమ్మించాడు. ఒక్కొక్కరికి మూడువేల రూపాయలు లెక్కన మొత్తం రూ.36 వేలు వసూలు చేశాడు. గూగుల్ ద్వారా టిటిడి బోర్డు సభ్యుడి సిఫార్సులేఖను డౌన్‌లోడ్ చేసి, నకిలీ లెటర్లు తయారు చేసి వాట్సాప్ ద్వారా పంపించాడు. బాధితురాలు గత ఏడాది తిరుమలకు వచ్చి దర్శనానికి కోసం లేఖను టిటిడి అధికారులకు చూపారు. అవి నకిలీవని గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుమల 2టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తిరుపతి జిల్లా ఎసీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు దర్శనాల పేరుతో మోసం చేసిన చాగంటి నవీన్ కుమార్‌ని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుండి ఒక మొబైల్ ఫోన్, రూ.36 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. శ్రీవారి దర్శనం, సేవలు భక్తులు అధికారిక మార్గాల ద్వారానే పొందాలని, వ్యక్తుల ద్వారా వచ్చే హామీలను నమ్మి డబ్బులు చెల్లించకూడదని విజ్ఞప్తి చేశారు.

మొక్కజొన్న పంట కొనుగోలు చేయండి

- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సిఎం చంద్రబాబు లేఖ

విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్తప్రతినిధి: రబీలో పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలంటూ కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సిఎం చంద్రబాబు లేఖ రాశారు. రైతులకు ధరల వ్యత్యాస చెల్లింపు పథకం వర్తింపజేయాలని సిఎం కోరారు. ఎపిలోని మొక్కజొన్న రైతులు ఆందోళనగా ఉన్నారని లేఖలో సిఎం పేర్కొన్నారు. మార్కెట్‌లో మొక్కజొన్న ధరలు రోజురోజుకూ తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ రూ.1,600 నుంచి రూ.1,700 మాత్రమే ఉందని సిఎం వివరించారు. ప్రస్తుత మార్కెట్ ధర కనీస మద్దతు ధర రూ.2,400 కంటే చాలా తక్కువని తెలియజేశారు. ఎపిలో 42.06 లక్షల టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చే అవకాశముందని చంద్రబాబు విన్నవించారు. ఇంకా 14.26 లక్షల టన్నుల పంట కోత దశలో ఉందని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం సకాలంలో జోక్యం చేసుకోకుంటే రైతులు నష్టపోతారని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. మొక్కజొన్న కొనుగోలుకు కేంద్ర మద్దతు లేకుంటే రాష్ట్రంపై అధిక భారం పడుతుందని సిఎం గుర్తు చేశారు. పిఎంఆశా కింద నేరుగా రైతులకు ధరల వ్యత్యాసం చెల్లించాలన్నారు. ఎపిని ప్రత్యేకంగా చూసి, వ్యత్యాసంలో వందశాతం నిధులు కేంద్రమే భరించాలని అభ్యర్థించారు. ఈ పథకాన్ని జూన్ 2026 వరకు పొడిగించాలన్నారు. నాఫెడ్, ఎపి మార్క్‌ఫెడ్ సమన్వయంతో అమలుకు అనుమతి ఇవ్వాలని ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు కోరారు.

రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడికి సిఎం చంద్రబాబు నివాళి

విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి ప్రభువు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడికి సిఎం చంద్రబాబు ఆయన జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. తన కార్యాలయంలోని వెంకట్రాది నాయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళిని అర్పించారు. వెంకట్రాది నాయుడు పాలన, దాన వితరణ, ఆధ్యాత్మికత్వాన్ని ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు శ్లాఘించారు. వెంకటాద్రి నాయుడి జయంతిని తమ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి నాయుడు చేసిన కృషి మరువలేదన్నారు. పండితులను ప్రోత్సహించారని వ్యాఖ్యానించారు. వెంకటాద్రినాయుడు వందల సంఖ్యలో శివాలయాలు నిర్మించారన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు అనుబంధ ప్రైవేట్ ఆస్పత్రులకు బకాయిల చెల్లింపు

విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు అనుబంధ ప్రైవేట్ ఆస్పత్రులకు బకాయిల చెల్లింపులను బిల్ డిస్కౌంటింగ్ అగ్రిమెంట్‌లో రూ.వెయ్యి కోట్లు జమ చేసేలా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేక పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 323 ఆస్పత్రుల యాజమాన్యాల దరఖాస్తు చేసుకోగా, ఒప్పందాల మేరకు 25 ఆస్పత్రులకు రూ.62 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. దీనికి సంబంధించిన వివరాను ఈ సందర్భంగా వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు అధికారులు పరిస్థితిని వివరించారు.

డీజల్, పెట్రోల్ నో స్టాక్...

అవస్థల్లో వాహనదారులు

కోట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: కోట మండలంలో పెట్రోల్, డీజల్ సరఫరాలో కోతలతో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయిల్ కంపెనీలో సరఫరాలో కోటా విధానం అమలుతో పెట్రోల్ బంకుల యాజమాన్యాలు వాహనదారులకు సమస్యలు ఎదురవుతున్నాయి. పెట్రోల్ సరఫరాలో కొత్త నిబంధనలతో పలుచోట్ల బంకులు మూతపడుతున్నాయి. సోమవారం విద్యానగర్‌లోని ఓ పెట్రోల్ బంకులో డీజల్, పెట్రోల్ అయిపోవడంతో నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. ఆయిల్ కంపెనీల నుంచి సరఫరాలో కొత్త నిబంధనలతో సమస్యలు ఎదురవుతున్నాయి. డిమాండ్ మేరకు ఆయిల్ కంపెనీలు సరఫరా చేయలేకపోతున్నాయి. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే మరో వైపు మంత్రి నాదెండ్ల మనోహర్ ఎక్కడా పెట్రోల్, డీజల్ కొరత లేదని ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ సమస్యలకు అధికారులే జవాలు చెప్పాల్సి ఉందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

బిసిలకు వైసిపి నేతలు క్షమాపణ చెప్పాలి

- టిడిపి బిసి ప్రజా ప్రతినిధులు డిమాండ్

అనంతపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త బ్యూరో: వైకాపా ఐదేళ్ల పాలనలో బిసి నేతలను అత్యంత దారుణంగా అవమానించి, రాజకీయంగా అణచివేసి, అక్రమ కేసులు, నిర్బంధాలతో చిత్రహింసలకు గురిచేసిన నీచ చరిత్ర వైకాపాదేనని తెలుగుదేశం పార్టీ బిసి ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనంతపురంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, అనంతపురం, హిందూపురం ఎంపిలు కాలవ శ్రీనివాసులు, అంబికా లక్ష్మినారాయణ, బికె పార్థసారథిలు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, తెలుగుదేశం పార్టీని నిందించడమే లక్ష్యంగా ఆదివారం అనంతపురంలో వైకాపా ఆధ్వర్యంలో రాయలసీమ బిసి గళం పేరుతో ఆదివారం అనంతపురంలో సభ నిర్వహించారని మండిపడ్డారు. దశాబ్దాలుగా బలహీన వర్గాలకు అడుగడుగునా అన్యాయం చేస్తున్నవారు, వారి వారసులు సభలో కనిపించారని వారు ఆగ్రహం వ్యక్త పరిచారు. సీమ గడ్డపై బలహీన వర్గాల స్వాతంత్ర్యాన్ని అణిచివేసిన రెడ్లు ముఖ్య అతిథులా? అంటూ ప్రశ్నించారు. బిసి సభలో గళం వినిపించిన నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటి వాళ్ళు బిసిలను అణచివేసిన దుష్టశక్తులని ఆరోపించారు. ఇలాంటి వాళ్ళ గళం బిసిల గళం ఎలా అవుతుందని మండిపడ్డారు. సభలో బిఆర్ అంబేద్కర్, జ్యోతీబా పూలే పక్కన జగన్, పెద్దిరెడ్డి ఫోటోలు పెట్టి వారికి వారసులు వీళ్ళు అన్నట్లుగా ఆ పార్టీ భావిస్తోందా? అంటూ నిలదీశారు. అధికారం పోయి ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా ఇంకా వీరి ఆలోచనలో ఏమాత్రం మార్పు రాలేదని, అగ్రవర్ణ దురహంకారం తగ్గలేదని ధ్వజమెత్తారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ఐదేళ్ల వైకాపా పాలనలో అధికారంలో ముగ్గురు రెడ్లకి రాష్ట్రాన్ని అప్పచెప్పారని, అధికారం ఉన్నా.. లేకున్నా ఆ పార్టీలో నిండుకున్నది రెడ్ల సామాజిక వర్గమేనని స్పష్టం చేశారు. వైకాపా పాలనలో నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య సహా 76 మంది బిసిలను హతమార్చారని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి తగ్గించారన్నారు. దాంతో దాదాపు 16,800 మంది బిసిలు పదవులు కోల్పోవాల్సి వచ్చిందని ఆరోపించారు. దళిత బిడ్డలకు విదేశీ ఉన్నత విద్యను అందించాలని గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించిన "అంబేద్కర్ విదేశీ విద్య నిధి" పథకానికి అంబేద్కర్ పేరును తొలగించారని, మహాత్మ జ్యోతిబా పూలే స్మృతి వనం ఏర్పాటుకు పది ఎకరాల స్థలం కేటాయిస్తే... దాన్ని కూడా రద్దు చేసిన చరిత్ర వైకాపా ప్రభుత్వానిదేనని తీవ్రస్థాయిలో నిరుచుకుపడ్డారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు అంతగా బిసిలపై కక్షగట్టిన పార్టీ నేడు అధికారం చేజారాక మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. బిసి సబ్ ప్లాన్‌ను జగన్ రద్దు చేస్తే సిఎం చంద్రబాబు సరిచేసే పనిలో ఉన్నారని తెలియజేశారు. అలాగే స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల కోసం బిసి కమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏ ప్రభుత్వం బిసిలకు అండగా నిలుస్తుందో..? ఏ పార్టీ వారి రాజకీయ ఎదుగుదలకు, స్వేచ్ఛకు, సమానత్వానికి కృషి చేస్తుందో చర్చించేందుకు రావాలని వైకాపా నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కాలవ సవాల్ విసిరారు. బిసిలను దుర్మార్గంగా అణిచివేస్తున్న సామాజిక వర్గం ఆటలు తెలుగుదేశం ప్రభుత్వంలో సాగవని హితవు పలికారు. తెలుగుదేశం ప్రభుత్వంపై, చంద్రబాబునాయుడు పై బురదజల్లేందుకు రాయలసీమ బిసి గర్జన సభను నిర్వహించారని ఎంపీలు బికె పార్థసారథి, అంబికా లక్ష్మినారాయణ ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం బిసిలకు చేసిన ద్రోహానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదినారాయణ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్‌లో ముగిసిన ప్రచారం

రేపే రెండో విడత పోలింగ్

7 జిల్లాల్లోని 142 నియోజకవర్గాలలో ఏర్పాట్లు పూర్తి

కోల్‌కతా, ఏప్రిల్ 27: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండవ, చివరి దశ ప్రచారం సోమవారం ముగిసింది. ఈ ప్రచారంలో ఎస్ఐఆర్, చొరబాటు, అవినీతి, నిరుద్యోగం వంటి అంశాలపై తీవ్ర రాజకీయ వాదోపవాదాలు చోటుచేసు కున్నాయి. 142 నియోజకవర్గాల్లోని ఓటర్లకు బిజెపి, టిఎంసిలు హామీల వర్షం కురిపించాయి. ఈ హోరాహోరీ ప్రచారంలో, పశ్చిమ బెంగాల్‌ను చొరబాటుదారులకు స్వర్గధామంగా మారుస్తోందని అధికార టిఎంసిపై బిజెపి నాయకత్వం ఆరోపించింది. మరోవైపు, కాషాయ పార్టీ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని, రాష్ట్రాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తోందని, చేపలు, గుడ్ల వినియోగాన్ని నిరుత్సాహపరుస్తోందని మమతా బెనర్జీ ఆరోపించారు. ఏప్రిల్ 29న జరగనున్న ఈ దశ ఎన్నికల్లో మొత్తం 3,21,73,837 మంది ఓటర్లు ఓటు వేయడానికి అర్హులు. వీరిలో 1,64,35,627మంది పురుషులు, 1,57,37,418 మంది మహిళలు, 792 మంది తృతీయ లింగ ఓటర్లుఉన్నారు. 41,001 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరగనుంది, అన్ని పోలింగ్ కేంద్రాలను వెబ్‌కాస్టింగ్ ద్వారా కవర్ చేస్తున్నారు. ఏడు జిల్లాల్లో 2,321కంపెనీల కేంద్ర బలగాలను మోహరించి, ఎన్నికల సంఘం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. మొత్తం 142 మంది సాధారణ పరిశీలకులు, 95 మంది పోలీసు పరిశీలకులు, 100మంది వ్యయ పరిశీలకులను నియమించారు. పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి కెమెరాలతో కూడిన డ్రోన్‌లను కూడా ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా 273 కంపెనీల కేంద్ర బలగాలను కోల్‌కతాలో మోహరించారు. ఈ దశలో పోలింగ్ జరుగుతున్న నియోజకవర్గాలలో, భాంగర్‌లో అత్యధికంగా 19 మంది అభ్యర్థులు ఉండగా, గోఘాట్‌లో అత్యల్పంగా ఐదుగురు ఉన్నారు. ఇది జిల్లాలవారీగా వైవిధ్యభరితమైన ఎన్నికల పోటీని ప్రతిబింబిస్తోంది. ఈ దశలోని కీలక అభ్యర్థులలో భవానిపూర్ నుండి తిరిగి ఎన్నిక కోరుకుంటున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఉన్నారు. ఈ దశలోని అత్యంత ప్రముఖమైన పోటీలలో ఒకదానిలో, ఆమె బిజెపి దిగ్గజం సువేందు అధికారితో తలపడుతున్నారు. కోల్‌కతా పోర్ట్‌లో, సీనియర్ టిఎంసి నాయకుడు ఫిర్హాద్ హాకీమ్, బిజెపి అభ్యర్థి రాకేష్ సింగ్‌తో పోటీ పడు తున్నారు. మైనారిటీలు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గం, మధ్య కోల్‌కతాలో అధికార పార్టీకికీలకమైనదిగా పరిగణించబడుతోంది. ఇతర ముఖ్యమైన స్థానాలలో భట్‌పారా, జగత్ దల్, బ్యారక్‌పూర్, బంగావ్, దుమ్‌దుమ్, సందేశ్ ఖాలి, హింగల్‌గంజ్, రాణాఘాట్ ఉత్తర్, దక్షిణ, రాష్‌బెహారి, జాదవ్‌పూర్, బల్లిగంజ్ ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తరాఖండ్, అసోం ముఖ్యమంత్రులతో సహా పలువురు బిజెపి నాయకులు రాష్ట్రంలో ప్రచారం నిర్వహించారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ఆ పార్టీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, అగ్రనేత అభిషేక్ బెనర్జీ విస్తృతంగా ప్రచారం చేశారు. అటు కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీలు సుడిగాలి పర్యటనలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు.

మంటల్లో పశ్చిమాసియా

హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తాం..

ఇరాన్ తాజా ప్రతిపాదన

వాషింగ్టన్, ఏప్రిల్ 27: అమెరికాతో నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించేందుకు ఇరాన్ ఒక కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. యుద్ధాన్ని ముగిస్తే ప్రధానమైన హార్మ్యూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని, అయితే అణు సంబంధిత చర్చలను మాత్రం ప్రస్తుతానికి వాయిదా వేయాలని ఆ ప్రతిపాదనలో కోరినట్టు అమెరికా మీడియా సంస్థ యాక్సియోస్ ప్రస్తావించింది. ఓ అమెరికా అధికారి, చర్చల గురించి తెలిసిన ఇద్దరు వ్యక్తులను ఉటంకిస్తూ ఈ వివరాలను వెల్లడించింది. చర్చల్లో నిలిచిపోయిన పరిస్థితిని అధిగమించడంతో పాటు, అణు రాయితీల పరిధిపై ఇరాన్ నాయకత్వంలో ఉన్న అంతర్గత విభేదాలను పక్కనపెట్టి ముందుకు సాగే వ్యూహంలో భాగంగానే ఇరాన్ ఈ ప్రతిపాదన చేసిందని యాక్సియోస్ తెలిపింది. అయితే, ఈ ప్రతిపాదనకు అమెరికా అంగీకరిస్తే భవిష్యత్తు చర్చల్లో ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చే అవకాశం అధ్యక్షుడు ట్రంప్ కోల్పోతారని నివేదిక విశ్లేషించింది. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తొలగించడం, యురేనియం శుద్ధిని శాశ్వతంగా నిలిపివేయించడమే ట్రంప్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలు. ఈ పరిణామాల నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ తన జాతీయ భద్రతా, విదేశాంగ విధాన బృందంతో సోమవారం సిట్యుయేషన్ రూమ్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ముగ్గురు అధికారులు వెల్లడించారు. చర్చల్లో ప్రతిష్టంభన, తదుపరి చర్యలపై ఈ సమావేశంలో చర్చిస్తారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఇరాన్‌పై నావికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తామనే సంకేతాలు ఇచ్చారు. చమురు ఎగుమతులను అడ్డుకోవడం ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవచ్చని ఆయన భావిస్తున్నట్టు వ్యాఖ్యానించారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు విఫలమవడంతో ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ కొత్త ప్రతిపాదన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

యేడాది కావస్తున్న 'ఆపరేషన్ సిందూర్'

22 నిమిషాల్లోనే టార్గెట్లు ఖతం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఆపరేషన్ సింధూర్‌నిర్వహించి ఏడాదికి చేరువవుతున్న సందర్భంలో భారత్ ఆర్మీ సోషల్‌మీడియాలో కొత్త పోస్టులు పెట్టింది. కేవలం 22 నిమిషాల వ్యవధిలోనే ఉగ్రవాదుల కమాండ్ వ్యవస్థను ఎలా కుప్పకూల్చిందీ వివరిస్తూ తాజాగా ఓ పోస్ట్ చేసింది. నిర్ణయం, స్పష్టత, లక్ష్యంపై దృష్టి న్యాయం జరిగింది, వేగంగా, కచ్చితంగా అంటూ సైన్యం తన పోస్టులో పేర్కొంది. ఆదివారం కూడా ఆర్మీ మరో పోస్ట్ చేస్తూ పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీఓకే) లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి సంస్థలకు చెందిన 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది. భారత్ మర్చిపోదు అనే ట్యాగ్‌లైన్‌తో ఈ వివరాలను పంచుకుంది. ఈ ఆపరేషన్ల తర్వాత భారత సైన్యం తన సన్నద్ధతను మరింత పటిష్ఠం చేసుకుందని, కొత్త సర్దుబాటు, పటిష్ఠం, సన్నద్ధం ఆత్మనిర్బర్ భారత్ సిద్ధంగా ఉందని మరో పోస్టులో స్పష్టం చేసింది. గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు మతం అడిగి తెలుసుకుని 26 మంది పర్యాటకులను దారుణంగా హతమార్చిన ఘటనకు ప్రతిస్పందనగానే భారత సైన్యం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ఈ దాడి జరిగిన వెంటనే భారత సైన్యం 'ఆపరేషన్ మహాదేవ్‌ను ప్రారంభించింది. దాదాపు 93 రోజుల పాటు 300 చదరపు కిలోమీటర్ల కఠినమైన హిమాలయ ప్రాంతంలో గాలించి, దాడికి పాల్పడిన ముగ్గురు ప్రధాన ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఆ తర్వాత వ్యూహాత్మక ప్రతీకార చర్యగా మే 6, 7 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాక్, పీఓకేలోని కీలక ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడిని నిర్వహించింది. ఉగ్రవాదాన్ని భారత్ ఎంతమాత్రం సహించబోదని, దేశానికి వ్యతిరేకంగా ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా ప్రతిస్పందన కచ్చితంగా ఇలాగే ఉంటుందని హెచ్చరించింది. ఈ ఆపరేషన్ అనంతరం 50 కొత్త మిషన్‌రెడీ యూనిట్లు, 4 అదనపు ఫార్మేషన్లు, 5 లక్షలకు పైగా అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకున్నట్లు సైన్యం వెల్లడించింది.

రెండోసారి పాక్‌కు వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి



టెహ్రాన్, ఏప్రిల్ 27: అమెరికా, ఇరాన్ మధ్య జరగాల్సిన శాంతి చర్చలు ఆగిపోయిన క్రమంలో అనేకపరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ కొద్ది గంటల వ్యవధిలోనే రెండోసారి పాకిస్థాన్‌కు చేరు కోవడం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అమెరికాతో చర్చల విషయంలో మధ్య వర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్‌లో ఆయన పర్య టనకు ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌తో సమావేశమై వెళ్లిన అరగ్చీ, ఆ తర్వాత ఒమన్‌కు వెళ్లారు. అక్కడ సుల్తాన్ హైతామ్ బిన్ తారిఖ్ అల్ సైద్‌తో సమావేశమై హోర్ముజ్ జలసంధి భద్రత, ఇరాన్‌పై యుద్ధాన్ని ముగించే అంశాలపై చర్చించారు.

యుద్ధంలో అమెరికా స్థావరాలకు భారీ నష్టమే..

వాషింగ్టన్, ఏప్రిల్ 27: అమెరికాతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ జరిపిన దాడుల వల్ల మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలకు ఊహించిన దానికంటే చాలా ఎక్కువ నష్టం వాటిల్లినట్లు అమెరికా అధికారులే అంగీకరిస్తున్నారు. ఈ నష్టం విలువ బిలియన్ల డాలర్లలో ఉంటుందని, మరమ్మతులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని పలు అంచనాలు తెరపైకి వచ్చాయి. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ దళాలు ఏడు దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడుల్లో కమాండ్ సెంటర్లు, విమాన హ్యాంగర్లు, శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, రన్‌వేలు, రాడార్లతో పాటు కొన్ని విమానాలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికాకు చెందిన అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదించుకుని, ఇరాన్‌కు చెందిన పాతతరం ఎఫ్5 ఫైటర్ జెట్ కూడా దాడి చేయగలగడం అమెరికా సైనిక వర్గాలను ఆశ్చర్యపరిచింది. సౌదీ అరేబియాలోని ఒక ఎయిర్ బేస్ పై దాడిలో అమెరికా నిఘా విమానం (అవాక్స్) ధ్వంసమైన చిత్రాలు కూడా వెలుగులోకి వచ్చాయి. అయితే, జరిగిన నష్టం పై పూర్తి వివరాలు వెల్లడించడానికి అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) నిరాకరిస్తోంది.

ఆప్ ఎంపీల విలీనప్రక్రియకు రాజ్యసభ చైర్మన్ ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఆమ్ ఆద్మీపార్టీకి రాజీనామా చేసి బిజెపిలో విలీనం అవుతామని ప్రకటించి ఆపార్టీ తీర్థంతీసుకున్న ఏడుగురు ఎంపిల విలీన ప్రక్రియను రాజ్యసభ చైర్మన్ ఆమోదించారు. ఆ విలీన ప్రక్రియకు సోమవారం రాజ్యసభ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదించారు. దీంతో రాజ్యసభ వెబ్‌సైట్ ప్రకారం ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇక బీజేపీ సంఖ్య 106 నుంచి 113కు చేరింది. ఇక రాజ్యసభలో ఎన్డీఏ బలంగా ఇప్పుడు 141 నుంచి 148కి పెరిగింది. దీంతో రాజ్యసభలో మెజారిటీ మార్క్ అయిన 123 సంఖ్యకు బీజేపీ చేరువు అవుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీలో చేరినట్లు ఆమ్ ఆద్మీ పార్టీలు సమర్పించిన విలీన లేఖపై రాజ్యసభ చైర్మెన్ రాధాకృష్ణన్ న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏడుగురు ఆప్ ఎంపీలు ఆ లేఖపై సంతకం చేశారు. అయితే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీల సంఖ్యలో 2/3 మెజారిటీ ఉన్నది. దీంతో ఎంపీల విలీన ప్రక్రియకు దాదాపు క్లియరెన్స్ వచ్చేసింది. రాఘవ్ చద్దా, సందీప్ పాతక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, విక్రమ్‌జీత్ సాహ్నే, అశోక్ మిట్టల్, రాజేందర్ గుప్తాలు బీజేపీలో చేరారు. ఆప్ ఎంపీలు రాసిన లేఖ రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కు తగినట్లు ఉందని రాజ్యసభ్య చైర్మెన్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ షెడ్యూల్ ప్రకారం 2/3 మెజారిటీ ఉంటే, విలీనాన్ని ఆమోదించవచ్చు. మరోవైపు ఆ ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ చైర్మెన్‌ను కోరిన విషయం తెలిసిందే. రాఘవ్‌ఛద్దాపై ఆప్ హైకమాండ్ వ్యవహరించిన తీరుపై కలత చెందిన ఇతర ఎంపిలు కూడా ఆయన వెంటే నడిచారు. వెంటనే రాజీనామాలు చేసి బిజెపి అధ్యక్షుడు నితిన‌నబీన్‌ను కలిసి తమ నిర్ణయాన్ని ప్రకటించడం ఆపై వెంటనే వారిని పార్టీలోకి ఆహ్వానించడం వెనువెంటనే జరిగిపోయాయి. ఈలోపు తమ విలీనప్రక్రియను ఆమోదించాలంటూ రాజ్యసభ చైర్మన్‌కు కూడా వివిధ పత్రాలను అందించారు. వాటిని పరిశీలించిన చైర్మన్ రాధాకృష్ణన్ వెంటనే ఆమోదిస్తూ నిర్ణయాన్ని వెల్లడించడంతో ఏడుగురు ఎంపిల విలీన ప్రక్రియ సజావుగా ముగిసింది.

బిజెపికి బీటీమ్‌గా ఆమ్ ఆద్మీపార్టీ: కాంగ్రెస్‌నేత అజయ్‌మాకెన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఆప్‌పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలు బీజేపీలో విలీనం కావటంతో ఆమ్ ఆద్మీ కన్వీనర్ కేజ్రీవాల్ పార్టీ నిజ స్వరూపం బయటప డిందని కాంగ్రెస్ పేర్కొంది. ఆ పార్టీ బిలియనీర్ల పార్టీ అని, డబ్బు ఉన్నవారికే రాజ్యసభ సీట్లు కేటాయించిందని ఆరోపించింది. పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు బీజేపీకి ఆప్ సహాయపడుతోందని ఆ పార్టీ నేత అజయ్ మాకెన్ విమర్శించారు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 6శాతం ఓట్లు సాధించిన బీజేపీ, ఆప్ ఎంపీల చేరికపై ఏం సమాధానం ఇస్తుందని ప్రశ్నించారు. బీజేపీకి ఆమ్ ఆద్మీపార్టీ బీ టీం అని తమ పార్టీ ఎప్పుడూ చెబుతూనే ఉందన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ పేరును అరబ్ ఆద్మీయొంకా పార్టీగా మార్చాలని అజయ్ మాకెన్ అన్నారు. డబ్బు కోసం ప్రశాంత్ భూషణ్, అశుతోష్, యోగేంద్రయాదవ్‌లకు రాజ్యసభ సీట్లు ఇవ్వలేదని ఆరోపించారు. తాను సహ వ్యవస్థాపకుడిగా ఉన్న రాజకీయ పార్టీ ఆప్ నుంచి వైదొలుగుతున్నట్లు బీజేపీ ఎంపీ రాఘవ్ చద్దా ప్రకటించారు. పార్టీలో విషపూరితమైన పని వాతావరణం ఉందని, ఇటీవలి కాలంలో పార్టీ అంతర్గత కార్యకలాపాలు గణనీయంగా క్షీణించాయని ఆరోపించారు.

జీహాదీ మిలిటెంట్ల దాడిలో మాలి రక్షణ మంత్రి దారుణ హత్య

బమాకో, ఏప్రిల్ 27: జిహాదీలు జరిపిన ఆత్మా హుతి దాడిలో మాలి దేశ రక్షణ శాఖ మంత్రి సాదియో కమరా మృతిచెందారు. దేశ రాజధాని బమాకోకు సమీపంలో ఉన్న అతని నివాసంపై అటాక్ జరిగింది. జిహాదీ మిలిటెంట్లు, వేర్పాటు వాదులు కలిసి దేశవ్యాప్తంగా హింసకు పాల్పడు తున్నారు. తీవ్రవాదుల దాడిలో గాయాలపాలైన రక్షణ మంత్రి ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ ఛానల్ కన్ఫర్మ్ చేసింది. మిలిటరీ జుంటా అధినేత జనరల్ అసిమి గోయిటాను ప్రస్తుతం సురక్షిత ప్రాంతానికి తరలించారు. చాన్నాళ్లుగా మాలి దేశంలో అల్‌ఖయిదా, ఇస్లామిక్ స్టేట్‌తో పాటు అజావాద్ లిబరేషన్ ఫ్రంట్‌కు చెందిన గ్రూపుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. కటి ప్రాంతంలో ఉన్న రక్షణ మంత్రి ఇంటిపై అల్‌ఖయిదా అనుబంధ మిలిటెంట్లు దాడి చేశారని, ఆ దాడుల్లో కమరా ఫ్యామిలీకి చెందిన మరో ముగ్గురు కూడా హతమైనట్లు తెలిసింది.



మినిస్టర్ నివాసంపైకి ఆయుధాలతో నిండిన వాహనం దూసుకువచ్చిందని, ఓ ఆత్మాహుతి బాంబర్ ఆ వాహనాన్ని నడిపినట్లు ప్రభుత్వ ప్రతినిధి ఇసా ఔస్‌మనే కౌలిబలీ తెలిపారు. మిలిటెంట్లపై ఎదురు కాల్పులు జరిపామని, కొందర్ని హతమార్చామని, కానీ గాయాల వల్ల రక్షణ మంత్రి ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా సైనిక స్థావరాలపై అల్ ఖైదా అనుబంధ తుయరెగ్ రెబెల్స్ చేసిన దాడుల వల్ల ఆయన మరణించినట్టు అల్ జజీరా చానల్ పేర్కొన్నది. మాలిలో ప్రభావ వంతమైన వ్యక్తుల్లో సడియో ఒకరని అల్‌జజీరా తెలిపింది. కటి పట్టణంలోని తన నివాసంలో ఆత్మాహుతి కారు బాంబు దాడిలో సడియో హత్యకు గురయ్యారని వెల్లడించింది. ఆయన ఇంటి వద్ద అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్నప్పటికీ ఈ దాడి జరిగిందని తెలిపింది. కటిలో పరిస్థితి తమ నియంత్రణలో ఉందని ఆర్మీ చెప్పున్నప్పటికీ సాయుధ గ్రూపులు ఆదివారం కూడా కాల్పులకు తెగబడినట్టు వార్తలు వచ్చాయి. సడియో మృతి ఆ దేశ సైన్యానికి పెద్ద షాక్ తగిలినట్లేనని రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు.

లడఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాలు: ఏడుకు పెరిగిన కేంద్రపాలితప్రాంత జిల్లాలు

లేహ్, ఏప్రిల్ 27: కేంద్రపాలిత ప్రాంతమైన లడక్‌లో పరిపాలనా సంస్కరణల దిశగా మరో ముందడుగు పడింది. ప్రజల దశాబ్దాల కల నెరవేరుస్తూ లడఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాల ఏర్పాటుకు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు లద్దాఖ్‌లో లేహ్, కార్గిల్ అనే రెండు జిల్లాలు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా నుబ్రా, షామ్, చాంగ్‌థాంగ్, జన్‌స్కర్, ద్రాస్ జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో లడఖ్‌లో మొత్తం జిల్లాల సంఖ్య రెండు నుంచి ఏడుకు పెరుగుతోంది. పరిపాలన సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినట్లు వినయ్ కుమార్ సక్సేనా తెలిపారు. ఈ నిర్ణయంతో లడఖ్‌లోని మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు ఏర్పాటుచేయనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, 2024 ఆగస్టులో వెల్లడించారు. త్వరలోనే హోంమంత్రి అమిత్ షా పర్యటించనున్న నేపథ్యంలో తాజాగా ఆ ఐదు జిల్లాలను ఏర్పాటు చేస్తూ లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదముద్ర వేశారు. జమ్ముకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి హోదాను రద్దుచేసి అసెంబ్లీతో కూడినకేంద్రపాలితప్రాంతంగాప్రకటించిన తర్వాత గతంలో జమ్ముకాశ్మీర్‌లో అంతర్భాగంగా ఉన్న లడక్‌నుఅసెంబ్లీలేని కేంద్రపాలితప్రాంతంగా ప్రకటించారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఈ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తుంటారు. అంటేనేరుగా కేంద్ర ప్రభుత్వమే లడక్ పాలనా వ్యవహారాలు చూస్తుంది.

సహజీవన భాగస్వామిపై లైంగిక దాడి ఆరోపణలేమిటి?

సహజీవనానికి, లైంగిక దాడికి ఎంతో తేడా: సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: పెళ్లి చేసుకుంటానని చెప్పి తనపై అత్యాచారం, లైంగిక దాడికి పాల్పడ్డాడని ఒక వ్యక్తిపై ఆరోపణలు చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పరస్పర అంగీకారంతో కూడిన సహజీవనానికి, నేరపూరిత లైంగిక నేరాలకు మధ్య తేడాను కోర్టు నొక్కి చెప్పింది. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తన సహజీవన భాగస్వామిపై సదరు మహిళ లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ పిటిషన్ వేసింది. పరస్పర అంగీకారంతో ఏర్పడిన ఆ బంధం వీగిపోయిన తర్వాత అది లైంగిక దాడి ఎలా అవుతుందని జస్టిస్ బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు సహజీవనానికి సంబంధించినదని, వివాహం కాకుండానే మహిళ బిడ్డకు కూడా జన్మనిచ్చిందని తెలిపారు. కానీ ఇప్పుడు ఆమె దాడి, అత్యాచారం అంటోందని అన్నారు. సమ్మతితో ఏర్పడిన బంధం చివరకు దాడిగా ఎలా మారిందని ప్రశ్నించారు. వివాహ ప్రస్తావన లేకుండా ఏర్పడిన బంధాల్లో ఉన్న సమస్యలు ఇవేనని, కొన్నేళ్లపాటు కలిసి ఉన్న ఆ మహిళ ఇప్పుడు ఫిర్యాదు చేయడమేమిటని ప్రశ్నించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లా డుతూ, నిందితుడు ఆ మహిళను కలిసినప్పుడు ఆమె వయస్సు పద్దెనిమిది అని, అప్పుడు ఆమె ఒక వితంతువు అని కోర్టుకు తెలిపారు. అతడికి కూడా అప్పటికే పెళ్లి అయిపోయిందని, కానీ ఆ విషయాన్ని దాచిపెట్టి అతడు సంబంధాన్ని కొనసాగించాడని పేర్కొన్నారు. ఇతర మహిళలను కూడా అతడు ఇలాగే మోసం చేశాడని అన్నారు. అయితే, ఆమె పెళ్లి చేసుకోవడానికి బదులు కలిసి జీవించడానికి ఎందుకు అంగీకరించిందని ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రశ్నించారు. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం లైంగిక దాడి కాదని స్పష్టం చేశారు. అలాగే మహిళ పరిస్థితిపై న్యాయమూర్తి సానుభూతి వ్యక్తం చేశారు. ఆ బిడ్డ పోషణ కోసం భరణం కోరవచ్చని సూచించారు. ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు.

యుఎఇ చేతికి ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్

టెల్‌అవీవ్, ఏప్రిల్ 27: పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు రగులుతున్న వేళ యుఎఇని అనూ హ్యంగా ఓ మిత్ర దేశం ఆదుకొంది. అదే ఇజ్రా యెల్. యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలలో ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను యుఎసి తన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో అడ్డుకొంది. కానీ, కొన్ని ఇరాన్ ఆయుధాలు కీలక మౌలిక వసతులపై దాడులు చేయడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మిత్రదేశాల సాయం కోరింది. దీంతో ఇజ్రాయెల్ ముందుకొచ్చి దానికి సాయం చేసినట్లు అమెరికా పత్రిక సంచలన కథనం ప్రచురించింది. ఇజ్రా యెల్ తన ఐరన్‌డోమ్ వ్యవస్థను యుఎఇకి పంపించడంతోపాటు దానిని ఆపరేట్ చేసిరాకెట్లు, డ్రోన్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు తమ దళాలను కూడా అక్కడికి తరలించింది. నెతన్యాహుకు ఫోన్ చేసిన యుఎఇ అధ్యక్షుడు ఇరాన్ దాడుల తీవ్రత పెరగడంతో యుఎఇ అధ్య క్షుడు మహమ్మద్ బిన్ జయేద్ నుంచి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్‌కాల్ వెళ్లిందిఆ తర్వాతే ఐరన్ డోమ్ వ్యవస్థను యుఏసి తరలించాలని ఇజ్రాయెల్ ప్రధాని నుంచి ఐడిఎఫ్ దళాలకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో ఇరాన్ దాడులకు ప్రధాన టార్గెట్‌గా మారిన అబుదాబికి ఊరట లభించింది. దీంతో డజన్లకొద్దీ ఇరాన్ క్షిపణులను యుఎఇ ఈ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో అడ్డు కొంది. ఇరాన్ ఈ యుద్ధ సమయంలో మొత్తం ఆ దేశంపై 550 బాలిస్టిక్ క్షిపణులు, 2,200 డ్రోన్ల ప్రయోగించినట్లు అబుదాబి రక్షణ మం త్రిత్వశాఖ వెల్లడించింది.

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వం
క్రీడల విభాగం
(యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ క్రింద ఒక స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ)
(మానవ వనరుల విభాగం)
SAI- ప్రధాన కార్యాలయ భవనం, SAI- ప్రధాన కేంద్రం, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కాంప్లెక్స్ (ఈస్ట్ గేట్ నం. 10), లోధి రోడ్, న్యూఢిల్లీ-110003
ఎఫ్.నెం. 01-04001(01)/13/2024-HO-Personnel Division/256 తేదీ: 21-04-2026
సవరణ
విషయం: శాశ్వత ప్రాతిపదికన 'సహాయ కోచ్' ఉద్యోగానికి దరఖాస్తుల సమర్పణ గడువు పొడిగింపు.
F.No. 01-04001(01)/13/2024-HO - Personnel Division/237 తేదీ 25.03.2026 నాటి గల అనుబంధ ప్రకటనకు పాక్షిక సవరణగా, శాశ్వత ప్రాతిపదికన 'సహాయ కోచ్' ఉద్యోగానికి ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించడానికి గల గడువును 05.05.2026 (సాయంత్రం 05:00 గంటల) వరకు పొడిగించడం జరిగింది. మిగిలిన నిబంధనలన్నీ యథాతథంగా వర్తిస్తాయి.
2. ఈ ఉద్యోగానికి సంబంధించిన పూర్తి వివరాలు మరియు దరఖాస్తు లింక్, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ www.yas.nic.in లోనూ, అలాగే SAI వెబ్‌సైట్ www.sportsauthorityofindia.nic.in లోనూ అందుబాటులో ఉన్నాయి.
సం/- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్,
(మానవ వనరుల విభాగం), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.
CBC 47103/11/0005/2627

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వం
క్రీడల విభాగం
(యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ క్రింద ఒక స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ)
(మానవ వనరుల విభాగం-II)
ప్రధాన కార్యాలయం, గేట్ నెం.10 (ఈస్ట్ గేట్),
జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం, లోధి రోడ్, న్యూఢిల్లీ-110003
ఫైల్.నెం. 01-04001(03)/4/2026-66 తేదీ: 21-04-2026
డిప్యూటీ డైరెక్టర్ (డిప్యూటేషన్‌పై) ప్రాతిపదికన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యొక్క నియామకం
యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి గల సంస్థ అయిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI), తన ప్రధాన కార్యాలయం, న్యూఢిల్లీ మరియు వివిధ ఫీల్డ్ యూనిట్లలో పే మ్యాట్రిక్స్ లెవెల్-11లో 20 డిప్యూటీ డైరెక్టర్ పోస్టుల కోసం 3 సంవత్సరాల కాలానికి డిప్యూటేషన్ పద్ధతిలో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అధికారులు నిర్దేశిత ఫార్మాట్‌లో దరఖాస్తులను, అవసరమైన డాక్యుమెంట్లతో పాటు, డైరెక్టర్ (హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్-II), SAI, జె.ఎన్. స్టేడియం కాంప్లెక్స్, లోధి రోడ్, న్యూఢిల్లీ-110003 చిరునామాకు సమర్పించవచ్చు. దరఖాస్తులను స్వీకరించే చివరి తేదీ 21-05-2026 (సాయంత్రం 5:00 గంటలు). వివరణాత్మక ప్రకటన, అర్హత ప్రమాణాలు, ప్రొఫార్మా మరియు సూచనలు SAI వెబ్‌సైట్‌లో (www.sportsauthority-ofindia.nic.in) అందుబాటులో ఉన్నాయి.
CBC 47103/11/0006/2627

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వం
క్రీడల విభాగం
(యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ క్రింద ఒక స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ)
(మానవ వనరుల విభాగం-II)
ప్రధాన కార్యాలయం, గేట్ నెం.10 (ఈస్ట్ గేట్),
జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం, లోధి రోడ్, న్యూఢిల్లీ-110003
ఫైల్.నెం. 01-04001(03)/4/2026-66 తేదీ: 10-04-2026
డైరెక్టర్ (డిప్యూటేషన్‌పై) ప్రాతిపదికన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యొక్క నియామకం
యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి గల సంస్థ అయిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI), తన ప్రధాన కార్యాలయం, న్యూఢిల్లీ మరియు వివిధ ఫీల్డ్ యూనిట్లలో 3 సంవత్సరాల కాలానికి డిప్యూటేషన్ పద్ధతిలో పే మ్యాట్రిక్స్ లెవెల్-12 లో 16 డైరెక్టర్ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అధికారులు నిర్దేశిత ఫార్మాట్‌లో దరఖాస్తులను, అవసరమైన డాక్యుమెంట్లతో పాటు, డైరెక్టర్ (హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్-II), SAI, జె.ఎన్. స్టేడియం కాంప్లెక్స్, లోధి రోడ్, న్యూఢిల్లీ-110003 చిరునామాకు సమర్పించవచ్చు. దరఖాస్తులను స్వీకరించే చివరి తేదీ 10-05-2026 (సాయంత్రం 5:00 గంటలు). వివరణాత్మక ప్రకటన, అర్హత ప్రమాణాలు, ప్రొఫార్మా మరియు సూచనలు SAI వెబ్‌సైట్‌లో (www.sportsauthorityofindia.nic.in) అందుబాటులో ఉన్నాయి.
CBC 47103/11/0004/2627

28-4Pg6exHMNWJQE.qxd:28-4Pg6exHMNWJQE.qxd 1/1/02 5:54 AM Page 1

తిరుపతి జిల్లాలో రెండోరోజూ పెట్రోల్, డీజిల్ కొరత

• బంకులు ముందు వాహనదారుల బారులు • పరిస్థితి సమీక్షిస్తున్నా చక్కదిద్దలేని అధికార యంత్రాంగం

తిరుపతి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రసిద్ధ యాత్రాస్థలం.. స్మార్ట్‌సిటీ తిరుపతి నగరంతోబాటు జిల్లా వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరతతో పెట్రోల్ బంకులు తెరచుకోలేదు. తిరుపతి నగరంలోనే దాదాపు ఇరవైకిపైగా ప్రధాన ప్రాంతాల్లో ఉన్న పెట్రోల్ బంకుల్లో పూర్తిగా డెడ్‌స్టోరేజీ స్థాయికి చేరుకోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుండే అనేక చోట్ల పెట్రోల్ బంకుల ముందు వాహన దారులు బారలుతీరడం కనిపించింది. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు ఆనుకునే ఉన్న పోలీస్‌శాఖ నడుపుతున్న ఐఓసి పెట్రోల్ బంకులో పూర్తిగా పెట్రోల్, డీజిల్ నిల్వలు లేకపోవడంతో వాహనదారులు ఎండలను కూడా లెక్కచేయకుండా నిరీక్షించారు. ఆదివారం రాత్రి నుండి తిరుపతి జిల్లాలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావులు స్వయంగా పలు పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వ సామర్థ్యం ఎంత, ఏ మేరకు ఉందనేది రికార్డులు తనిఖీ చేశారు. సోమవారం ఉదయానికి పరిస్థితి చక్కబడుతుందని,వాహనదారులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొన్నా మధ్యాహ్నం వరకు పరిస్థితి అదుపులోకి రాలేదు. చాలావరకు బంకుల్లో పెట్రోల్ డీజిల్ నోస్టాక్ బోర్డులు ప్రత్యక్షమయ్యాయి. జిల్లాలో ముఖ్యంగా తిరుపతి ప్రధాన నగరంలోని అనేక పెట్రోల్ బంకుల్లో తగినంత నిల్వలు అందుబాటులో లేకపోవడంతోనే ఈ డిమాండ్ ఏర్పడింది. ఒకవైపు పెట్రోల్ కోసం ఉదయం నుండి బారులుతీరినా మరోవైపు అధికారులు ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాయంత్రానికి సాధారణ పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు. పెట్రోల్, డీజిల్ కొరతపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తిరుపతి జిల్లాలో మొత్తం 189 పెట్రోల్ బంకుల్లో తాత్కాలికంగా 26బంకులు మూతపడ్డాయి. అయితే సోమవారం సాయంత్రానికి సరఫరా కావచ్చని పేర్కొన్నారు. ప్రతి బంకు వద్ద పోలీస్, రెవెన్యూ సిబ్బందిని మోహరించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ చేపట్టారు.

తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్, బిపిసిఎల్, నయారా, రిలయన్స్ సంస్థల జిల్లా ప్రతినిధులతో నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయానికి తిరుమలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నడుస్తున్న రెండు బంకులకు అదనపు సరఫరాలు పంపించారు. ఇక జిల్లాలోని నాయుడుపేట, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో వ్యవసాయ అవసరాలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, డీజిల్ జనరేటర్లకు ప్రాధాన్యత క్రమంలో ఇంధనం అందించేలా ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి జిల్లాలో సాయంత్రానికి అన్ని పెట్రోల్ బంకులు పూర్తిస్థాయిలో పనిచేస్తాయని అధికారులు వెల్లడించారు. ప్రజలు అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించడంతోనే, అలా చేయడం వల్ల కృత్రిమంగా డిమాండ్ పెరిగి కొన్ని చోట్ల క్యూలు ఏర్పడే పరిస్థితి వస్తుందని చెబుతున్నారు. సాయంత్రం ఆరుగంటల వరకు పరిస్థితి ఇలానే ఉంది.

ఓ వైపు డిమాండ్, మరోవైపు ఉచిత పెట్రోల్: తీవ్రమైన పెట్రోల్ కొరతపై ప్రజల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ నిల్వలు నిజంగానే తగ్గిపోయాయా? కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం తిరుపతి తిరుచానూరు మార్గంలోని తిరుపతి రూరల్ తనపల్లి వద్ద ఐఓసీఎల్ పెట్రోల్ బంక్ యజమాని రాజేష్ రెడ్డి మాత్రం ఉదారతతో పెద్ద మనసు చాటుకున్నారు. తిరుపతిలో ఉచితంగా దాదాపు వందమందికి వాహనదారులకు ఉచితంగా పెట్రోల్ పంపిణీ చేశారు. ప్రజల ఇబ్బందులను చూసి చలించిపోయి సాయం చేస్తున్నట్లు వెల్లడించారు. ఎండలో బారులుతీరిన వాహనదారులకు మంచినీరు కూడా అందించడం మరో విశేషం. స్టాక్ ఉన్న కొన్ని చోట్ల వాహనదారులు కిలోమీటర్ల కొద్దీ బారులు తీరుతున్నారు. తిరుమలకు వచ్చే భక్తులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులు మాత్రం సోమవారం కూడా కన్నీళ్ళు తెప్పించేస్థితికి చేరాయి.

తిరుపతిలోని ఓ పెట్రోల్ బంకు వద్ద నోస్టాక్ బోర్డు, నగరంలోని మరో బంకు వద్ద వాహనదారుల బారులు

ముఖ్యమంత్రి చంద్రబాబుతో టెలిరోబోటిక్ సర్జరీ చేసిన నారాయణ జీఎస్ఎల్ ఆస్పత్రుల వైద్యబృందం, టెక్నాలజిస్టులు

టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తే వైద్య సేవలు మరింత సులభతరం: సిఎం

విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తే వైద్య సేవలను ప్రజలకు మరింత సులభతరం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో సిఎం చంద్రబాబును నారాయణ మెడికల్ కాలేజీ ఆస్పత్రులు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ ఆస్పత్రుల యాజమాన్యాలకు చెందిన ప్రతినిధులు కలిశారు. ఇటీవల తమ రెండు ఆస్పత్రులు కలిసి టెలిరోబోటిక్ సర్జరీ నిర్వహించినట్లు సిఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. టెలిరోబోటిక్ సర్జరీ జరిగిన తీరును ఆయా మెడికల్ సంస్థల యాజమాన్యాలకు చెందిన ప్రతినిధులు సింధూర, గన్ని భాస్కరరావు సిఎంకు వివరించారు. నెల్లూరులోని నారాయణ హాస్పటల్లో ఉన్న రోగికి రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆస్పత్రి వైద్యులు రోబో ద్వారా సర్జరీ చేశామన్నారు. అలాగే జీఎస్ఎల్లో ఉన్న రోగికి నారాయణ ఆస్పత్రి వైద్యులు దూరం నుంచే శస్త్రచికిత్స నిర్వహించారని తెలిపారు. దేశంలోనే తొలిసారి ఈ తరహా సర్జరీ నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రెండు ఆస్పత్రుల యాజమాన్యాలను సిఎం చంద్రబాబు అభినందించారు. టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే దూరంగా ఉన్నా సరే నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని ఈ సంస్థలు నిరూపించాయని కొనియాడారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న రోగులకు కూడా ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించిన డాక్టర్లు ఎక్కడి నుంచైనా సర్జరీ చేయగలిగే ఈ సాంకేతిక భవిష్యత్తులో వైద్య సేవల రూపురేఖలను పూర్తిగా మార్చేస్తుందని సిఎం పేర్కొన్నారు.

'నోస్టాక్' బోర్డులు కనిపించకూడదు

• పెట్రోల్, డీజిల్ స్టాక్ తెప్పించుకోవాలి • తిరుపతి జిల్లాలో బంకుల యజమానులతో అత్యవసర సమావేశం

తిరుపతి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: 48గంటలు దాటినా సిఎం చంద్రబాబునాయుడు సొంత తిరుపతి జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత వెంటాడుతోంది. ఉన్నఫళంగా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టి, త్రాళ్ళతో, ప్లాస్టిక్ బారికేడ్లు ఏర్పాటుచేయడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుండి సోమవారం మధ్యాహ్నం వరకు జిల్లా అధికారులు సాహసోపేతంగా పెట్రోల్, డీజిల్ బంకులపై తనిఖీలు చేసినా పరిస్థితి చక్కబడలేదు. దీంతో సాయంత్రానికి పరిస్థితిని చక్కబెట్టే ప్రయత్నంలో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు అఘమేగాలపై ఐఒసిఎల్, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్, నయారా పెట్రోల్ డీలర్ల యజమానులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయా సంస్థల పెట్రోల్ బంకుల సేల్స్ అధికారులతో సమీక్షించారు. డిమాండ్‌కు తగినట్లు పెట్రోల్, డీజిల్ స్టాక్‌ను తెప్పించుకోవాలని స్పష్టంగా ఆదేశించారు. పెట్రోల్ బంక్‌ల వద్ద స్టాక్ లేదని బోర్డులు పెడుతున్నారని, అవసరానికి తగినట్లుగా ముందుగా ఆయిల్ ట్యాంకర్‌లను తెప్పించుకుని పెట్రోల్ బంక్‌ల వద్ద స్టాక్ ఉంచుకోవాలన్నారు. పెట్రోల్ కొరత కారణంగా పెట్రోల్ బంక్‌లు మూతపడే పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రజలందరికీ వారి నిత్యావసరాలకు అవసరమైన మేరకు పెట్రోల్, డీజిల్‌ను ఆయిల్ కార్పొరేషన్‌ల ద్వారా సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించుకుంటూ నిల్వలు ఉంచుకోవాలని తెలిపారు. మరీ మంగళవారం ఉదయానికి పరిస్థితి అంచనావేయాల్సి ఉంది.

మదనపల్లె డిఎస్పీ ఎదుట సజ్జల భార్గవ్‌రెడ్డి

మదనపల్లె క్రైమ్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవ్ రెడ్డి సోమవారం మదనపల్లె డిఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. గతంలో నమోదైన ఒక కేసులో భాగంగా పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేయడంతో, విచారణ నిమిత్తం ఆయన అధికారుల ముందుకు వచ్చారు. బి.కొత్తకోటకు చెందిన ఓ నేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో సజ్జల భార్గవ్ రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా ఆయన తొలుత బి.కొత్తకోటకు చేరుకున్నారు. అనంతరం మదనపల్లె డీఎస్పీ పావని సమక్షంలో విచారణకు హాజరయ్యారు. డిఎస్పీ కార్యాలయంలో సంబంధిత కేసుపై అధికారులు ఆయనను సుదీర్ఘంగా విచారించినట్లు సమాచారం. కోర్టు ఆదేశాలు, పోలీసు నోటీసుల మేరకు విచారణకు సహకరించేందుకు భార్గవ్ రెడ్డి హాజరైనట్లు వైసిపి శ్రేణులు వెల్లడించాయి. సజ్జల భార్గవ్ రెడ్డి రావడంతో డిఎస్పీ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక వైసిపి నాయకులు కూడా డిఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకుని సజ్జల భార్గవ్ రెడ్డిని కలిశారు.

పెళ్లి భోజనం తిన్నారు... 20 మందికి అస్వస్థత

• హానుమనపల్లిని సందర్శించిన డిఎం అండ్ హెచ్ఓ • పాఠశాలలో వైద్య శిబిరం, కొనసాగుతున్న చికిత్స • డాక్టర్లు, తహాశీల్దార్లు, ఎంపిడిఓ అక్కడే మకాం • 108 వాహనం సైతం అక్కడే

అగళి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: శ్రీసత్యసాయి జిల్లా అగళి మండల పరిధిలోని హానుమనపల్లి గ్రామంలో ఓ పెళ్లి భోజనం ఆరగించి 20 మంది వాంతులు, విరేచనాలతో మంచంపట్టారు. ఈ విషాధ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దరంగ కుమార్తె వివాహానికి బంధుమిత్రులను పిలిచి వైభవంగా వివాహం నిర్వహించారు. ఆ పెళ్లిలో విందు భోజనం ఆరగించారు. ఆదివారం ఉదయం చేసిన అనుపకాయల సాంభారుతో భోజనం తిన్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అదే సాంబారుతో భోజనం చేశారు. సాంబారు పాచిపోయింది. ఆ సాంబారును ఆరగించడంతో పెళ్లికి వచ్చిన వారు అదే గ్రామానికి చెందిన 20 మందికి వాంతులు, విరేచనాలు కావడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. మొదట ఒకరు అగళికి వచ్చి ఇలా జరిగింది, చికిత్స అందించండి అని ఆసుపత్రికి వెళ్లగా ఈ విషయం బయటపడింది. వెంటనే ఈ విషయాన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బందికి తెలియజేశారు. ఆ విషయాన్ని జిల్లా డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ మంజువాణి విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన జరిగిన గ్రామంలోని పాఠశాలకు చేరుకుని వారికి అందిస్తున్న చికిత్సను పరిశీలించారు. నియోజకవర్గంలోని డాక్టర్లను, సిబ్బందిని అక్కడికి మోహరించి చికిత్స అందించారు. సెలెన్ బాటిల్స్‌ను అందించడం, ఓఆర్ఎస్ పాకెట్లను అందించడం, మాత్రలు ఇవ్వడంతో కొద్దికొద్దిగా రికవరీ మొదలైందని సిబ్బంది డిఎం అండ్ హెచ్‌ఓకు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ మంజువాణి మాట్లాడుతూ.. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంచినీటిని సేవించాలని తెలపడంతోపాటు ప్రత్యేకంగా ఉదయం, రాత్రి మూడురోజులపాటు చికిత్స అందించడానికి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లతో ఓ టీంను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన టీంలో ఉన్నవారు సదరు అనారోగ్యానికి గురైన వారికి సక్రమంగా వైద్యం అందించాలని, ఒకవేళ గైర్హాజరైతే అప్పటికప్పుడే షోకాజ్‌నోటీసులు ఇస్తామన్నారు. 108వాహనాన్ని సైతం అక్కడే ఉంచారు. గ్రామంలో శానిటేషన్ పనులు కొనసాగిస్తున్నారు. ఈ వైద్య శిభిరంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డా.రవి, తహాశీల్దారు సుబ్బారావు, మరో ఇద్దరు డాక్టర్లు కిరణ్‌నాయక్, సూపర్‌వైజర్ జయమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుందరయ్య, సుబ్బయ్య, మంజుళ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, కార్యదర్శి రాజునాయక్, ఎంపిడిఓ గంగాధర్, డిప్యూటీ ఎంపిడిఓ రెడ్డి ప్రకాష్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో ఇంధన కొరతలేదు: జెసి ఇలక్కియా

విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: ఎన్‌టిఆర్ జిల్లాలో పెట్రోలు, డీజిల్ కొరత లేదని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ప్రజలు ఏవిధమైన భయాందోళనలకు గురికావద్దని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా ప్రజలకు భరోసా ఇచ్చారు. కొన్ని రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల అనంతరం పెట్రోలు, డీజిల్ ధరలు గణనీయంగా పెరుగుతాయని సోషల్ మీడియాలో అసత్యప్రచారం జరుగుతుందని దీనిని నమ్మవద్దని హితవు పలికారు. ఈ అసత్య ప్రచారాన్ని నమ్మిన ప్రజలు అవసరానికి మించి పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేసి నిల్వచేస్తున్నారని, ఇది ప్రమాదకరమని హెచ్చరించారు. జిల్లాలో ఇంధన పరిస్థితిపై ఆమె మీడియా సమావేశం నిర్వహించి జిల్లా వ్యాప్తంగా ఇంధన విక్రయాలు, నిల్వల వివరాలను వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 186 పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్ నిరంతరాయంగా విక్రయిస్తున్నట్లు చెప్పారు. సాధారణ విక్రయాలతో పోల్చితే ప్రస్తుతం 20శాతం అదనంగా ఇంధన సరఫరా జరుగుతుందన్నారు. ఇంధన సరఫరా సంస్థలతో సంప్రదింపులు జరిపి జిల్లాలో అవసరమైన మేరకు ఇంధనాన్ని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

పిజిఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి: పిజిఆర్ఎస్‌కు వస్తున్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జేసి ఇలక్కియా అధికారులను ఆదేశించారు. సోమవారం ఎన్‌టిఆర్ కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ అర్జీలను జేసి స్వీకరించారు. ఈసందర్భంగా జేసి మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సరైన పరిష్కారం చూపించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్య చట్టపరిధిలో పరిష్కరించాలని సూచించారు.

ఆ భూ కేటాయింపులు రద్దు చేయాలి

• కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్

తిరుపతి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: అలిపిరిలో పునర్జన్మ పొందిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలిపిరి దగ్గర వెయ్యి కోట్ల రూపాయలు విలువైన భూములను ముగ్గురు కోటీశ్వరులకు ఒక్కొక్కరికి ముప్పై ఎకరాలు టిటిడి భూములు కట్టబెట్టారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ చింతామోహన్ ఆరోపణలు గుప్పించారు. దేవలోక్, ట్రైడెంట్, ఒబెరాయ్‌కి ఇచ్చిన భూములు నెల రోజుల లోపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతిలో టిటిడి పరిపాలన భవనం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి భారీ ధర్నా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతామోహన్ మాట్లాడుతూ టిటిడిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను బానిసలుగా చూస్తున్నారని మండిపడ్డారు. రూ.12 వేలు ఇచ్చి వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని మండిపడ్డారు. టిటిడి పారిశుద్ధ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ప్రతి నెలా పదివేల రూపాయలు ఇవ్వాలన్నారు. అలాగే నెలకు 20 వేల రూపాయలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులపై కాంట్రాక్టర్ల మేనేజర్లు వేధింపులు మానుకోవాలన్నారు. గత ఎనిమిదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పిఆర్‌సి ప్రకటించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. మే 31వ తేదీ లోపు 30 వేల కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాలని కోరారు. పెట్రోల్, డీజిల్ కొరత మోడీ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తేజోవతి, మునిశోభ, సమీవుల్లా, దాసరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాలు మందు గుండు సామగ్రి వంటివి

• నీలి గులాబీలు పుస్తకావిష్కరణ సభలో మోకా సత్తిబాబు

విజయవాడ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త ప్రతినిధి: అక్షరాలు మందు గుండు సామగ్రి వంటివి అన్నారు పోలీస్ అధికారి మోకా సత్తిబాబు అన్నారు. దళిత సాహిత్యం చైతన్యపూర్వక దృక్పథంతో బలీయంగా రావాలన్నారు. అంబేద్కర్ ఆశించిన కులరహిత సమాజం కోసం బడుగువర్గాలు సంఘటితం కావాలన్నారు. దళిత ప్రేమ వివాహాలు విఫలం కావడం, పరువు హత్యలు పెరగడం దురదృష్టకర పరిణామన్నారు. స్థానిక ఠాగూర్ గ్రంథాలయంలో ఎండ్లూరి మానస, గోగులమండ అరుణ సంకలనం చేసిన నీలి గులాబీలు కథల సంపుటిని ఠాగూర్ గ్రంథాలయంలో ఆయన ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన ఎండ్లూరి మానస మాట్లాడుతూ.. దళిత ప్రేమికుల ప్రేమను విచ్ఛిన్నం చేసే దిశగా కొనసాగుతున్న వివక్షను గట్టిగా ప్రశ్నించేందుకే ఈ సంకలనం తెచ్చామన్నారు. ఐద్వా లీడర్ డి రమాదేవి మాట్లాడుతూ దళిత స్త్రీల పట్ల జరుగుతున్న వివక్ష వెనుక ఉన్న కారణాలను గుర్తించాలన్నారు. సామాజిక వక్త డాక్టర్ వసుంధర కుర్రా మాట్లాడుతూ తరతరాలుగా దళిత ప్రేమికుల వివాహాలు విచ్ఛిన్నమవుతున్న దారుణ పరిస్థితుల్ని మనందరం కలిసికట్టుగా ఎదుర్కోవాలి అన్నారు. మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ మాట్లాడుతూ దళిత స్త్రీల పట్ల జరుగుతున్న వివక్షను, ప్రేమికుల మధ్య పాతుకుపోయిన కుల అంతరాలను ఈ సంకలనం వెలికితీసిందన్నారు. పుస్తక సంపాదకురాలు అరుణ గోగులమండ మాట్లాడుతూ ఒక మంచి సంకల్పంతో తాము వెలువరిచిన ఈ పుస్తకంలో పలువురు రచయితలు వారి వారి కోణాల్లో ప్రేమికుల మధ్య జరుగుతున్న వివక్షను, వేధింపులను అక్షరబద్ధం చేశారన్నారు. కవయిత్రి పోలగాని భాను తేజశ్రీ స్వాగతం పలికిన ఈ సభకు పలువురు సాహితీవేత్తలు హాజరయ్యారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

తిరుపతి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పు నిచ్చారు. 2016 కేసులో తమిళనాడు, విల్లుపురం జిల్లా శంకరాపురం చెందిన మణి తిరుపతి జిల్లా నాగపట్ల ఈస్ట్ ఫారెస్ట్ బీటు, చామల రేంజ్ అటవీ పరిధిలో పట్టుబడ్డాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు.

బికె బేడు వద్ద రోడ్డు ప్రమాదం: ఒకరి మృతి

నాగలాపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా నాగలాపురం మండలం బీకే బేడు గ్రామం సమీపంలో రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పాలమంగళం గ్రామానికి చెందిన టి.నాగరాజు(25) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కృష్ణమరాజుల కండ్రిగ గ్రామం నివాసి మోటారు సైకిల్ నడిపిన వినోద్(34) తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలించగా, పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. కాగా పుత్తూరు వైపు కారు వెళుతుండగా ఎదురుగా వచ్చిన మోటారు సైకిల్ రైడర్ ముందున్న కంటైనర్ లారీని ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించి రోడ్డులో కుడి వైపుకు వెళ్లడంతో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదసమయంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న నాగరాజు, వినోద్ ఇద్దరూ హెల్మెట్ లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. మోటారు సైకిల్‌కి అగ్ని అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మోటారు సైకిల్ రైడర్ నిర్లక్ష్యంగా ఓవర్‌టెక్ చేయడం వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాథీరాంజీ మఠం భూములు కాపాడండి

• సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ

విజయవాడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: హాథీరాంజీ మఠం భూములు కాపాడాలని, అందుకోసం "పర్యవేక్షణ కమిటీ"ని నియమించాలని కోరుతూ సోమవారం సిఎం చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. వేల కోట్ల విలువజేసే హాథీరాంజీ మఠం భూములు హారతి కర్పూరంలా కరిగిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ కనీసం పట్టించుకోవడం లేదని లేఖలో శ్రీనివాసరావు ఆరోపించారు. ఫిర్యాదు చేయాల్సిన హాథీరాంజీ మఠం సిబ్బంది, కస్టోడియన్ ఫిర్యాదు కూడా చేయడం లేదని తెలిపారు. తిరుపతిలో ఆక్రమణకు గురై, నిర్మాణాలు సాగిస్తున్న సర్వే నెం:13 గాంధీపురంలోని మఠం భూములలో కబ్జాదారులు బోర్డును తొలగించినా పోలీసులకు ఫిర్యాదు చేయలేని దుస్థితిలో హాథీరాంజీ మఠం ఉందని చెప్పారు. హాథీరాంజీ మఠం భూముల ఆక్రమణలకు ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నేతలు, రియల్టర్లు, పోలీసులు సంయుక్తంగా పాల్పడుతున్నారని ఆరోపించారు.

టిటిడి విద్యాసంస్థల్లో బధిరుల ప్రవేశాలకు ఆహ్వానం

తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ బధిరోన్నత పాఠశాల, ఎస్వీ బధిరుల జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 1 వరకు స్వీకరిస్తారు. తిరుపతి, భీమవరం, వరంగల్ ప్రాంతాల్లోని ఈ విద్యాసంస్థల్లో చేరదలచిన బధిర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులను సెలక్షన్ కమిటీ ఎంపిక చేస్తుంది. ప్రతి ఏడాది 1వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పించబడతాయి. ఇతర తరగతుల్లో ఖాళీల మేరకు ప్రవేశాలు ఉంటాయి. తిరుపతిలో 1వ తరగతి చేరాలనుకునే అభ్యర్థులు, 2వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీలను బట్టి ప్రవేశాలు కల్పిస్తారు. సదరు తరగతులతో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు తిరుపతి కళాశాల లేదా వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులను డౌన్ లోడ్ చేసు కోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను నేరుగా పొందవచ్చని, "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తిరుమల.ఓఆర్జి" వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను ప్రిన్సిపాల్, ఎస్వీడియస్, అలిపిరి, తిరుపతి-517501 చిరునామాకు పంపాలని తెలిపారు.

మహిళా బిల్లుతో రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

• ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్

తిరుపతి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి: దేశంలో అట్టడుగు వర్గాలు లబ్ధి పొందుతున్న సంక్షేమ పథకాలకు క్రమంగా కేంద్ర ప్రభుత్వం కోత పెడుతోందని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ ఆరోపించారు. సంక్షేమ కార్యక్రమాల అమల నుంచి కేంద్రం తప్పుకోవాలని భావిస్తుందని చెప్పారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాలు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం అమలులో తన వాటాను కేంద్రం తగ్గించుకుంటూ వస్తుందని, భవిష్యత్తులో ఈ పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలివేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎఐటియుసి 18 వ రాష్ట్ర మహాసభలలో భాగంగా సోమవారం ఉదయం ప్రతినిధుల మహాసభల తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో జరిగింది. అమర్ జీత్ కౌర్ మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, రంగు, వేసుకునే దుస్తులు ఆధారంగా ప్రజలను విభజించే నాయకులకు అధికారాన్ని దూరం చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం వెనుక పౌరసత్వం రద్దు కుట్ర ఉందని హెచ్చరించారు.

మహిళా బిల్లు పేరిట నియోజకవర్గాలను పునర్ విభజించి, అత్యధిక సీట్లు పొందడం ద్వారా రాజ్యాంగాన్ని మార్చేందుకు మోడీ చేస్తున్నారని హెచ్చరించారు. ఇరాన్ పై యుద్ధ ప్రభావంతో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిసినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకుండా నిరక్ష్యంగా ఉండిపోయారని విమర్శించారు. రాష్ట్రంలో నాలుగు రోజులగా పెట్రోల్, డీజిల్ లేక ప్రజలు అల్లాడుతుంటే ఇప్పుడు చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇతరులపై నెట్టివేస్తున్నారని చెప్పారు. గత 12 ఏళ్లుగా కనీస వేతనాలను పెంచని కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్లుగా ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాలతో సాధించుకున్న హక్కులను హరించివేసి తాజాగా నాలుగు లేబర్ కోడ్‌లు రూపంలో చట్టాలను తెచ్చిందని వివరించారు. అన్ని కార్మిక సంఘాలను, కలిసి వచ్చే రాజకీయ పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని తీవ్రస్థాయికి తీసుకువెళ్లాలని కోరారు. సంఘటిత పోరాటాలతో కార్పొరేట్ వర్గాల కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలను గద్దెదింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య, ఎఐటియుసి జాతీయ కార్యదర్శి జి ఓబులేసు, ఉపాధ్యక్షులు ఆదినారాయణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు, అమరావతి జెఎసి నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ రామానాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
మంగళవారం 28, ఏప్రిల్ 2026

8లో

భారత ఉప రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం



ఐఎన్ఎస్ డేగాలో ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

నూతన ఆవిష్కరణలకు వేదికగా వర్సిటీలు

8లో
8లో

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఏయూ దిక్సూచి -యువత జాబ్ సీకర్స్ కాదు... జాబ్ క్రియేటర్స్ అవ్వాలి -గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖకు కొత్త చరిత్ర -26 ఏళ్ల యువకుడిలా ఆలోచనలు -ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు -ఏయూ అభివృద్ధికి రూ.500 కోట్లు ప్రకటించిన సీఎం

ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

శతాబ్ది వేడుకల్లో ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్

విశాఖపట్నం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

వందేళ్లు చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని భారత ఉప రాష్ట్ర పతి సి.పి.రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన శతాబ్ది వేడుకల ముగింపు ఉత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ గురువులందరికీ నా వందనా లని, వారి మార్గదర్శకత్వం వల్లనే నేను ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం తనకు బలమైన పునాదిని అందించిందని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పడిన మహానుభావులను 8వ పేజీలో

ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో ప్రత్యేక పోస్టల్ స్టాంప్ ఆవిష్కరణ

8లో

విశాఖలో ఈ రోజు.. నాకెంతో ప్రత్యేకం

భారత్ క్రికెట్ దిగ్గజం సచిన్

8లో

ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్స్టిట్యూషన్ మాత్రమే కాదు.. ఒక ఎమోషన్

ఏయూ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణం -దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి -ఆంధ్ర యూనివర్సిటీ అభివృద్ధికి ఎంతోమంది కృషిచేశారు.. దేశంలోనే ఓవర్ ఎఐ ర్యాంకింగ్స్‌లో ఏయూ 3వ స్థానం సాధించడమే లక్ష్యం - ఫిజిక్స్ నుంచి పాలిటిక్స్ వరకు ఆంధ్ర యూనివర్సిటీ మార్క్ శాశ్వతంగా ఉంది -పరిశ్రమలతో అనుసంధానం అనేది చాలా ముఖ్యం -రీసెర్చ్ కోసం ఏయూకు రూ.250 కోట్లు కేటాయించాలి : విశాఖలో ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో మంత్రి నారా లోకేష్

8లో

నేడు గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ డేటా సెంటర్ శంకుస్థాపన



విశాఖపట్నం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

తర్లువాడలో శంకుస్థాపన జరగనున్న గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ డేటా సెంటర్ ప్రాంగణాన్ని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ పరిశీలించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు కూడా పాల్గొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఎంపీ శ్రీభరత్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, “ఒక సంవత్సరం క్రితం ఇంత పెద్ద ఎఫ్‌డీఐ మన రాష్ట్రానికి వస్తుందంటే ఎవరూ నమ్మలేదు. కానీ నేడు లక్ష 40 వేల కోట్ల రూపాయలతో ఒకే కంపెనీ నుంచి విశాఖపట్నానికి వస్తున్న ఈ పెట్టుబడి భారత చరిత్రలోనే అతి పెద్ద ఇన్వెస్ట్మెంట్‌గా నిలుస్తుంది” అని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ సాధ్యంకావడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ మంత్రి అశ్విని వైష్ణవ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. డేటా సెంటర్ నిర్మాణ దశలో విస్తృత స్థాయిలో నిర్మాణ రంగ ఉద్యోగాలు లభిస్తాయని, ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత ప్రత్యక్ష ఉద్యోగాలు తక్కువగా ఉన్నప్పటికీ, దాని చుట్టూ ఐటీ, ఏఐ ఆధారిత ఎకోసిస్టమ్ వేగంగా అభివృద్ధి చెందుతుందని ఎంపీ వివరించారు. డేటా సెంటర్ సమీపంలో వేగవంతమైన ఇంటర్నెట్ సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల బ్యాంకులు, ఫిన్‌టెక్, ఐటీ కంపెనీలు 8వ పేజీలో..

నాగాలాండ్ రాష్ట్రం ముఖ్యమంత్రి నేయిఫియు రియూ విశాఖ నగర పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం తోట్లకొండ బౌద్ధారామం సందర్శించారు. బౌద్ధారామం చరిత్ర ను అధికారులు వివరించారు. వ్యూ పాయింట్ నుండి సముద్రం తీరాన్ని తిలకించి, విశాఖ తీర అందాలకు ముగ్దులయ్యారు. (విశాఖపట్నం-ప్రభాతవార్త)

సైబర్ సిటీగా విశాఖ..

గూగుల్ డేటా సెంటర్ రాకతో రూపాంతరం : ఏపీ బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

విశాఖపట్నం - ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోగల విశాఖపట్నంలో అత్యాధునిక గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశను చూపుతుందని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కు కూటమి ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టాలని తీసుకుంటోందన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ స్థాపన రాష్ట్ర అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ భారీ పెట్టుబడులు సాధ్యమవడానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న “స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్” 8వ పేజీలో..

విశాఖ తీరాన జనసంద్రం : మంత్రి నారా లోకేష్‌కు ఘనస్వాగతం

విశాఖపట్నం-ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విశాఖ పర్యటన సందర్భంగా నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా విశాఖకు చేరుకోవడంతో విమానాశ్రయ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. మంత్రికి స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఎయిర్‌పోర్ట్ ప్రధాన రహదారి మొత్తం పసుపుమయమైంది. నర్సీపట్నం 8వ పేజీలో..

భారత ఉప రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం

విశాఖపట్నం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు విశాఖపట్నం విచ్చేసిన భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కు ఘన స్వాగతం లభించింది. ముందుగా ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న ఉప రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, అసెంబ్లీ స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఏయూ వైస్ ఛాన్సలర్ రాజశేఖర్, శాసనసభ్యులు, నేవీ అధికారులు తదితరులు స్వాగతం పలికారు.

రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం

విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ కు చేరుకున్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు అధికారులు ఘన స్వాగతం పలికారు. సోమవారం విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు శాసనసభాపతి సీహెచ్.అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, నౌకాదళ, నేవీ అధికారులు తదితరులు స్వాగతం పలికారు.

సైబర్ సిటీగా విశాఖ..

7వ పేజీ తరువాయి ..

విధానం ప్రధాన కారణమని పేర్కొన్నారు. విశాఖపట్నం త్వరలోనే ఆసియా ఖండానికి కీలకమైన ఏఐ గేట్‌వేగా ఎదగబోతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తీర ప్రాంతంలో సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటు ద్వారా విశాఖను ప్రపంచ దేశాలతో నేరుగా అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. తర్లువాడ, అడవివరం, రాంబిల్లి ప్రాంతాల్లో సుమారు 600 ఎకరాల్లో రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో 1000 మెగా వాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు మాధవ్ తెలిపారు. అదనంగా, మెటా (ఫేస్‌బుక్) సంస్థ సిఫీతో కలిసి 550 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం కుదిరిందన్నారు. మరిన్ని డేటా సెంటర్లు కూడా విశాఖ తీర ప్రాంతానికి ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. సబ్‌సీ కేబుల్ ద్వారా దేశంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్ సదుపాయం విశాఖ కేంద్రంగా అందుబాటులోకి రానుందని, దీనివల్ల ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో అదానీ కనెక్స్, ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రా వంటి సంస్థలు భాగస్వామ్యంగా ఉన్నాయని చెప్పారు. డేటా సెంటర్ల స్థాపన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని మాధవ్ పేర్కొన్నారు.

విశాఖ తీరాన జనసంద్రం..

7వ పేజీ తరువాయి ..

నియోజకవర్గం నుండి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, పట్టణ పార్టీ అధ్యక్షులు చింతకాయల రాజేష్ నేతృత్వంలో వేలాది మంది కార్యకర్తలు తరలివచ్చారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున పాల్గొని, ప్రపంచ స్థాయి ఐటీ దిగ్గజం గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖపట్నం తీసుకువచ్చినందుకు మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. "వెల్కమ్ గూగుల్ – థాంక్యూ లోకేష్" అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. "జై లోకేష్" నినాదాలతో విమానాశ్రయ ప్రాంగణం దద్దరిల్లింది. లోకేష్ పర్యటనతో ఉత్తరాంధ్ర తెలుగుదేశం శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

నూతన ఆవిష్కరణలకు వేదికగా వర్సిటీలు

విశాఖపట్నం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

యూనివర్సిటీలు డిగ్రీలు ఇచ్చే విద్యా కేంద్రాలు మాత్రమే కాదని, సమాజాన్ని ప్రభావితం చేసే ఆవిష్కరణలకు వేదిక కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. యూనివర్సిటీలు జాతీయ ఆస్తులని, వాటిని కాపాడుకోవాలని అన్నారు. విశాఖలో జరిగిన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పాల్గొన్నారు. యూనివర్సిటీకి రూ.64 కోట్లతో చేపట్టిన ఏయూ ఐ ఫ్యాక్టరీ, నెట్జర్స్ సెంటర్‌ను ప్రారంభించారు. మరో రూ.112 కోట్లతో 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్, కన్వెన్షన్ హాలుతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలి

విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా... రోజులు మారాయి.. సాధారణ మనుషులు అసాధారణ శక్తిగా మారే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "నాలెడ్జ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లపై యువత దృష్టి పెట్టాలి. పారిశ్రామిక రంగానికి యూనివర్సిటీ అనుసంధానం కావాలి. మీరు ఉద్యోగం చేయడం కాదు, పది మందికి ఉద్యోగం ఇచ్చే శక్తి మీకు రావాలి దీనికి సహకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నేను ఎన్నో కార్యక్రమాలకు వెళ్లాను కానీ యూనివర్సిటీలో మీ ఉత్సాహం చూస్తుంటే ఆనందం ఆకాశాన్ని తాకుతోంది. విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్నాను. రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నేను విశాఖ వచ్చాను. 100 ఏళ్ల ఏయూ పండుగ ఒక చరిత్ర. రేపు ప్రపంచంలో నెంబర్ 1 టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన మరో చరిత్ర. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నారంటే అది విశాఖ గొప్పతనం. గూగుల్ కంటే ముందుగానే ఏయూ ప్రపంచాన్ని విశాఖతో కనెక్ట్ చేసింది. 58 దేశాల విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారంటే రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం. విశాఖ విశ్వనగరం... గ్లోబల్ సిటీ. ఇది అన్ స్టాపబుల్. ఎవరూ ఆపలేరు. ఏయూ 100 ఏళ్ల చరిత్ర ఒక బ్రాండ్. రాష్ట్ర విభజన తర్వాత కేబినెట్ సమావేశం ఏయూలో నిర్వహించాం... అదీ ఏయూ ప్రత్యేకత. 53 యూనివర్సిటీలు రాష్ట్రంలో ఉన్నాయి... అన్నింటికీ ఏయూ దిక్సూచి, లీడర్. స్వాతంత్ర్య పోరాటం కంటే ముందే ఈ యూనివర్సిటీ వచ్చింది. జైపూర్ రాజ్ విక్రమ్ దేవ్, గజపతి, పిఠాపురం, బొబ్బిలి రాజులు ఈ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేశారు. వారిని మనం స్మరించుకోవడం ధర్మం, బాధ్యత. కట్టమంచి రామలింగారెడ్డి ఏయూకు మొదటి వీసీగా పనిచేసి బలమైన పునాది వేశారు. ఆయన కూడా చిత్తూరు జిల్లా వాసే... నేనూ చిత్తూరు జిల్లా నుంచి వచ్చి వందేళ్ల ఉత్సవంలో పాల్గొన్నాను. 2వ వీసీ సర్వేపల్లి రాధాకృష్ణ... దేశ రాష్ట్రపతి అయ్యారు. ఈ రోజు మన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తండ్రి సర్వేపల్లి రాధాకృష్ణ అభిమాని. ఆ అభిమానంతో ఆయనకు రాధాకృష్ణన్ అని పేరు పెట్టారు. కేవలం చదువు చెప్పటమే కాదు... తెలుగు వైభవానికి ఏయూ కృషి చేస్తోంది. విద్య, సాహిత్య, కళా రంగాల్లో ప్రముఖులను కళా ప్రపూర్ణ అవార్డుతో గౌరవిస్తున్నారు' అని సీఎం చంద్రబాబు అన్నారు.

26 ఏళ్ల యువకుడిలా నా ఆలోచనలు

రాష్ట్రంలో ఎంతోమంది నాయకులను తయారు చేసిన గడ్డ ఆంధ్ర యూనివర్సిటీ అని, ఎందరో రాజకీయ ఉద్దండులు ఇక్కడ నుంచే వచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఏయూ నుంచే వచ్చారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా ఇక్కడి నుంచే వచ్చారు. ప్రపంచంలోని చాలా యూనివర్సిటీల్లో ఇక్కడ చదువుకున్న వెళ్లిన వారు ప్రొఫెసర్లుగా చేస్తున్నారు. నాక్ ఏ ప్లస్ ప్లస్‌ను ఏయూ సాధిస్తోంది. ఎన్ఐఆర్ఎఫ్‌లో 41వ ర్యాంక్, పబ్లిక్ సెక్టార్‌లో 5వ ర్యాంక్‌లో ఉంది. అన్ని యూనివర్సిటీల్లో విద్యాశాఖామంత్రి, గవర్నర్ ప్రతిభ ఉన్నవారిని వీసీలుగా ఎంపిక చేస్తున్నారు... ముఖ్యమంత్రిగా వారిని అభినందిస్తున్నాను. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెట్రాలజీతో ఎంఓయూలు కుదుర్చుకున్నాం. నాకు 76 ఏళ్లున్నా.. నేను 26 ఏళ్ల యువకుడిలానే ఆలోచిస్తాను. ఒకప్పుడు మనం ఐటీ ప్రారంభించాం హైటెక్ సిటీ కట్టాం. నాలెడ్జ్ ఎకానమీకి దోహదం చేశాం. నేడు డేటా సెంటర్, ఏఐ, క్వాంటం తీసుకొచ్చాం. వీటిని కోరుతున్నా... ఏయూకు బ్రాండ్ ఉంది. మీరు అదేగితే ప్రపంచంలోని చాలా యూనివర్సిటీలు మీతో ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉంటాయి. వంద దేశాల విద్యార్థులు మన యూనివర్సిటీల్లో చదివేలా సిద్ధం చేయాలి. ఏయూ చాలా సుందరమైన ప్రాంతం. ఒకప్రక్క ఉన్నట్టుండి సముద్ర తీరంలో కొండ నడిస్తే సేదతీరుతారు' అని సీఎం అన్నారు.

ఏయూ అభివృద్ధికి రూ.500 కోట్లు

'ఏయూలో చదువుకునేవారంతా అదృష్టవంతులు. ఇక్కడ చదువుకుంటే ఎంత బావుంటుందో అనే ఆలోచన మళ్లీ నాకూ వస్తోంది. ఈ యూనివర్సిటీ భావితరాల నాయకులను తయారు చేయాల్సి ఉంటుంది. ఉపకుల పతికి లక్ష్యం నిర్దేశిస్తున్నా. ఏయూ దేశంలో యూనివర్సిటీల్లో టాప్-5 జాబితాలో ఉండాలనేది నా ఆకాంక్ష. ప్రపంచంలో 100 అత్యుత్తమ యూనివర్సిటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఉండాలి. ఈ స్థాయిలో అభివృద్ధి చేయాలంటే నిధులు కావాలి. అందుకే రూ.500 కోట్లను ఆంధ్ర యూనివర్సిటీకి ఇస్తాం. రూ.500 కోట్ల కార్పస్ ఫండ్ ఇస్తాం. ఒక్కో విద్యార్థి ఒక్కో రూపాయి చొప్పున వేసినా ఎంతో అభివృద్ధి చెందవచ్చు. పూర్వ విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధ్యమే అవుతుంది. ఏయూ వందేళ్ల చరిత్ర రోజున పాల్గొనడం అదృష్టం... రాబోయే వందేళ్లలో ఏయూ మరో చరిత్ర సృష్టిస్తుంది. బెస్ట్ బ్రాండ్ క్రియేట్ చేస్తుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు.

ఏయూ నుంచే జైత్ర యాత్ర ప్రారంభం

'ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం నా అదృష్టం. ఇక్కడ బంగారం లాంటి విద్యార్థులు ఉన్నారు... మంచి ప్రొఫెసర్లు ఉన్నారు. ప్రపంచంలోని నాలెడ్జ్‌ను ఇక్కడికి తీసుకొస్తాం. నా మిత్రుడు పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రాన్ని పునర్ నిర్మించేందుకు ముందుకొచ్చారు. తెలుగుజాతి పునర్వైభవానికి ప్రధాని మోదీ మనకు సహకరిస్తున్నారు. వారి సంకల్పం వికసిత్ భారత్ 2047. మన లక్ష్యం స్వర్ణాంధ్ర 2047. 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ 1 జాతిగా తెలుగు జాతి ఉండాలనేది మా సంకల్పం. మా సంకల్ప జైత్ర యాత్ర ఏయూ నుంచే ప్రారంభం కావాలి. పని చేసే బాధ్యత మాది, సహకరించే బాధ్యత మీది... దాన్ని నిరూపించుకునే బాధ్యత మీదే' అని విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఒడిశా గవర్నర్ హరిబాబు, కేంద్రమంత్రులు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్, మాజీ క్రికెటర్ సచిన్, దర్శకుడు త్రివిక్రమ్, మంత్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ విద్యార్థినైతే ఏయూలోనే చదువుతాను"

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

"మళ్లీ విద్యార్థిగా మారే అవకాశం వస్తే ఆంధ్రా యూనివర్సిటీలోనే చదువుతాను" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏయూ దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యాసంస్థలలో ఒకటిగా నిలిచిందని, విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తోందని తెలిపారు. విశాఖపట్నం నగరం విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని సీఎం తెలిపారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయ అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్స్టిట్యూషన్ మాత్రమే కాదు..

విశాఖపట్నం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్ స్టిట్యూషన్ మాత్రమే కాదని, తనలాంటి వారికి ఒక ఎమోషన్ అని, ఏయూ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ వేడుకలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ ఈ రోజు ఒక గర్వకారణమైన, చరిత్రాత్మక సందర్భం. శతాబ్ద కాలంగా వెలుగొందుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం గొప్పదనాన్ని జరుపుకునేందుకు మనం అందరం ఇక్కడకు వచ్చాం. ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్ స్టిట్యూషన్ మాత్రమే కాదు.. నాలాంటి వారికి ఒక ఎమోషన్. తరతరాలుగా మన మనస్సుల్లో మెదులుతోంది. భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కి హృదయపూర్వక స్వాగతం పలకడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ సేవాగుణం, నిష్ట, ప్రజాసేవ పట్ల మీ అంకితభావం తరతరాలకు ప్రేరణగా నిలుస్తోంది. అదేవిధంగా ఏపీ గవర్నర్, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్ గారికి కూడా హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తున్నాం. మీ మార్గదర్శకత్వం, నాయకత్వం ఈ గొప్ప సంస్థను మరింత బలపరుస్తోంది. అదేవిధంగా లక్షలాది హృదయాలను గెలుచుకున్న మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌ని స్వాగతించడం గౌరవంగా భావిస్తున్నా. క్రమశిక్షణ, అంకితభావానికి, ప్రతిభకు ఆయన నిదర్శనంగా నిలుస్తారు. దార్శనిక నేత,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి స్వాగతం. విద్యే అభివృద్ధికి పునాది అని ఆయన విశ్వసిస్తారు. వేదికపై ఉన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ హరిబాబుకి, ఇక్కడకు విచ్చేసిన ఇతర ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది, విద్యార్థులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఆంధ్ర యూనివర్సిటీ ఒక పేరు మాత్రమే కాదు.. వందేళ్ల చరిత్ర

2014లో రాష్ట్రం విడిపోయింది. కట్టుబట్టలతో మెడపట్టి మనల్ని బయటకు గెంటేశారు. రాజధాని లేదు, సచివాలయం లేదు, అసెంబ్లీ లేదు, ముఖ్యమంత్రి గారు కూర్చోవడానికి కుర్చీ లేదు. ఆ రోజు ఆంధ్రప్రదేశ్ కు ఉన్నవి రెండే. ఒకటి ఆంధ్ర యూనివర్సిటీ, రెండు మన బ్రాండ్ సీబీఎన్. రాష్ట్ర విభజన తర్వాత కేబినెట్ మీటింగ్ పెట్టుకోవడానికి ఒక హాల్ కూడా లేదు. ఆ రోజు మొదటి కేబినెట్ మీటింగ్ ఆంధ్ర యూనివర్సిటీలో పెట్టుకున్నాం. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు మొదటి అసెంబ్లీ సమావేశాలు కూడా ఏయూలోనే నిర్వహించారు. ఆంధ్ర యూనివర్సిటీ ఒక పేరు మాత్రమే కాదు.. వందేళ్ల చరిత్ర ఉందన్నారు.

దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి

స్వతంత్రం రాకముందు తెలుగు ప్రజలు పోరాడి ఆంధ్ర యూనివర్సిటీ సాధించుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీకి ఎన్నో రికార్డ్స్ ఉన్నాయి. దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి. భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో మొదటిది ఆంధ్ర రాష్ట్రం. తెలుగు ప్రజల కోసం మనం యూనివర్సిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. నేను కార్నెగీ మెలన్ యూనివర్సిటీ, స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఈ రోజు ఇక్కడ మిమ్మల్ని చూసి అసూయ పడుతున్నాను. ఆంధ్ర యూనివర్సిటీలో చదివి ఉంటే ఎంతో బాగుండేదని పక్కనే వైజాగ్ బీచ్ రోడ్.. అద్భుతమైన సిబ్బంది, ఏయూ స్టూడెంట్స్ జోషే ఈ రోజు అదిరిపోతోంది. మీ జోష్ చూసిన తర్వాత మీకోసం ఇంకా కష్టపడాలి, పనిచేయాలి. వచ్చే వందేళ్ల చరిత్ర కలిసికట్టుగా సృష్టించాలని కోరుతున్నానన్నారు.

ఆంధ్ర యూనివర్సిటీ చరిత్ర వెనుక ఎంతో మంది త్యాగం ఉంది

మానసిక వికాసం మానవ జీవితానికి అత్యున్నత లక్ష్యంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ చరిత్ర వెనుక ఎంతో మంది త్యాగం ఉంది. ఎంతోమంది పోరాటం ఉంది, కష్టం ఉంది. సీఆర్ రెడ్డి మొదటి వైస్ ఛాన్సలర్‌గా ఒక క్లియర్ డైరెక్షన్ మనకు అందించారు. తర్వాత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. ఆయన విజన్, స్పీడ్, కమిట్ మెంట్ ఆంధ్ర యూనివర్సిటీకి బలమైన పునాది వేసింది. ఎంతోమంది దాతలు ఏయూ అభివృద్ధికి సహకరించారు. ఎంతోమంది వైస్ ఛాన్స లర్లు ఆంధ్ర యూనివర్సిటీ అభివృద్ధి కోసం కృషిచేశారు. వైస్ ఛాన్సలర్లకి విజన్ ఉంటే ఆంధ్ర యూనివర్సిటీ లాంటి గొప్ప యూనివర్సిటీలు తయారవుతాయి.

ఆంధ్ర యూనివర్సిటీ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణం

యూనివర్సిటీని సాధారణంగా విశ్వవిద్యాలయం అంటారు. కానీ మన ఆంధ్ర యూనివర్సిటీని ఆంధ్ర విశ్వకళా పరిషత్ అంటారు. ఇది అకడమిక్ విద్య, లిబరల్ ఆర్ట్స్ సమ్మిళితం. దీనికి మంచి ఉదాహరణ త్రివిక్రమ్ శ్రీనివాస్. మన ఏయూ నుంచి ఎమ్మెస్సీ న్యూక్లియర్ ఫిజిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు ప్రఖ్యాత సినీ దర్శకులుగా ఆయన ఎదిగారు. ఆంధ్ర యూనివర్సిటీ చిహ్నం దగ్గర నుంచి కోర్సుల వరకు అన్నీ స్పెషల్. ఉన్నత విద్యలో భిన్నమైన ప్రోగ్రామ్స్ ను అందిస్తోంది ఆంధ్ర యూనివర్సిటీ. ఏయూలో 7 అనుబంధ కళాశాలలతో కలిపి 68 అకడమిక్ విభాగాలు ఉన్నాయి. మొత్తం 121 అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు వివిధ పరిశోధనా కార్యక్రమాలు అందిస్తున్నారు. అదేవిధంగా ఏయూకి 304 అనుబంధ కళాశాలలు ఉన్నాయి. సుమారు 85,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 56 దేశాల నుండి వచ్చిన సుమారు 1050 మంది విదేశీ విద్యార్థులు కూడా ఉన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికి గర్వకారణం అన్నారు.

దేశంలోనే ఓవర్ ఆల్ ర్యాంకింగ్స్‌లో ఏయూ 3వ స్థానం సాధించడమే లక్ష్యం

ఆంధ్ర యూనివర్సిటీ ర్యాంక్స్ సాధించడంలో కూడా ముందు ఉంటుంది. ఐఎస్ఓ సర్టిఫికెట్, నాకు ఎ ప్లస్ ప్లస్ గ్రేడ్, 2025 ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 4వ స్థానంలో నిలిచింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం దేశంలోనే ఓవర్ ఆల్ ర్యాంకింగ్స్ లో 3వ స్థానం, ప్రపంచ ర్యాంకింగ్స్ లో టాప్ 100లో స్థానం సంపాదించినప్పుడే విద్యా శాఖ మంత్రి నాకు సంతృప్తి. ప్రస్తుత వైస్ ఛాన్స లర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ గారు దీనిని ఒక లక్ష్యంగా తీసుకుని ఏయూని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని కోరుతున్నాన్నారు.

ఫిజిక్స్ నుంచి పాలిటిక్స్ వరకు ఆంధ్ర యూనివర్సిటీ మార్క్ శాశ్వతంగా ఉంది

ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకున్న వారు గొప్ప స్థాయికి వెళ్లారు. ఫిజిక్స్ నుంచి పాలిటిక్స్ వరకు ఆంధ్ర యూనివర్సిటీ మార్క్ శాశ్వతంగా ఉంది. లోక్ సభ తొలి దళిత స్పీకర్ గా పనిచేసిన జీఎంసీ బాలయోగి గారు ఏయూ విద్యార్థి. ఉప రాష్ట్రపతిగా పనిచేసిన వెంకయ్యనాయుడు గారు, కే.హరిబాబు, దువ్వూరి సుబ్బారావు, బీవీఆర్ మోహన్ రెడ్డి, పూర్ణ ఆర్.సగ్గుర్తి, గ్రంధి మల్లికార్జున రావు, చావా సత్యనారాయణ ఏయూ విద్యార్థులే. రాజకీయాల్లో కూడా ఏయూ స్టూడెంట్స్ నెం.1. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఏయూ ప్రొడక్టే. వారి ఎదుగుదల యాధృచ్ఛికం కాదు. నిరంతర పోరాటం, త్యాగం, సంకల్పబలం వల్లే వారు అత్యుతన్నత స్థాయికి ఎదిగారు. సమాజంలో మనం కోరుకున్న మార్పు రావాలంటే రాజకీయాల్లోకి మరింతమంది రావాల్సిన అవసరం ఉంది.

ప్రజలకు సేవ చేయాలని ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చా

ఇక్కడ ఉన్న స్టూడెంట్స్ కి నా జీవిత ప్రయాణం గురించి కూడా చెప్పాలని అనుకుంటున్నా. నేను కార్నెగీ మెలన్ యూనివర్సిటీ, స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నాను. వరల్డ్ బ్యాంక్ లో పనిచేశా. హెరిటేజ్ లో కూడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా ఉన్నా. ప్రజలకు సేవ చేయాలని 2013లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చా. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశా. 2019లో మంగళగిరి నుంచి పోటీ చేసి 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. మొదటిరోజు బాధపడ్డాను. ఆ తర్వాత ఆ బాధ నాలో కసి, పట్టుదల పెంచింది. 2024లో మళ్లీ అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజార్టీ 91వేల ఓట్లతో గెలిచాను. ఇది మీకు ఎందుకు చెబుతున్నానంటే నో రిస్క్, నో స్టోరీ అని గుర్తుపెట్టుకోవాలి. ఇక్కడున్న వారు జీవితంలో ఎన్నో సాధించారు. ఎంతో త్యాగం చేశారు. సవాళ్లను ఎదుర్కొన్నారు. అపజయాలే విజయానికి సోపానాలు.

పరిశ్రమలతో అనుసంధానం అనేది చాలా ముఖ్యం

ఏయూ వందేళ్ల ప్రయాణం పూర్తిచేసుకుంది. కాలం మారుతోంది. సాంకేతికత మారుతోంది. అందుకే వీసీ ఆధ్వర్యంలో మన కరిక్యులమ్‌లో కూడా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది. పరిశ్రమలతో అనుసంధానం అనేది చాలా ముఖ్యం. గౌరవ సీఎం చాలా స్పష్టంగా చెప్పారు. ఇండస్ట్రీ, అకడమీయా కనెక్ట్ అవసరం ఉందని. కేవలం తరగతి గదుల్లో చదువుకోవ డం మాత్రమే కాదు.. కనీసం ఒక ఏడాదన్నా ఫీల్డ్ కు వెళ్లాలి, వాస్తవాలు తెలుసుకోవాల్సిన అవసరం విద్యార్థులపై ఉందన్నారు. సీఎం ఆదేశాలను నేను స్వీకరిస్తున్నా. ఆ మార్పు కూడా మేం తీసుకువస్తామని తెలియజేస్తున్నా. నాలుగేళ్ల ఇంజనీరింగ్ చేస్తే జాబ్ రాదు.. అదే అమీర్ పేటలో నాలుగు నెలల కోర్సు చేసి జాబ్ కొడతారు. అదే స్కిల్ గ్యాప్. దీనికి ఫుల్ స్టాప్ పెట్టాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. దానికి మేం అహర్నిశలు కష్టపడతామని తెలియజేస్తున్నా.

ఏడాదిలోగా పెండింగ్ పోస్టులు భర్తీ చేస్తాం

అతి చిన్న వయసులో విద్యాశాఖ మంత్రిగా నన్ను సీఎం చంద్రబాబు గారు నియమించారు. నేను విద్యాశాఖ తీసుకుంటానంటే కష్టమని, వద్దని చాలామంది వారించారు. దేశ చరిత్ర తిరిగి రాయాలంటే మా పిల్లలే రాయాలని నేను ఛాలెంజ్ ను స్వీకరించడం జరిగింది. ఇంకా మార్పులు తీసుకురావాలి. నిధులు కేటాయించాలి. మౌలిక వసతులే కాదు.. శాశ్వత సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. పెండింగ్ పోస్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సీఎం చెప్పారు. వచ్చే ఏడాదిలోగా పెండింగ్ పోస్టులు భర్తీ చేస్తాం. హయ్యర్ ఎడ్యుకేషన్ పైన ఎక్కువ దృష్టిపెట్టాలని ప్రధాని చెబుతున్నారు. రీసెర్చ్ ను ఎక్కువగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

రీసెర్చ్ కోసం ఏయూకు రూ.250 కోట్లు కేటాయించాలని సీఎంను కోరుతున్నా

ఉత్తరాంధ్ర రాష్ట్రానికి ఒక ఎకనామిక్ జోన్‌గా మారబోతోంది. రేపు గూగుల్ డేటా సెంటర్ కు శంకుస్థాపన చేయబోతున్నాం. గడిచిన ఆరు నెలల్లో ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్ట్ ప్రారంభించాం. సీఎం చేతులమీదుగా ఇంగోట్ సోలార్ వేఫర్ యూనిట్‌కు శంకుస్థాపన చేయడం జరిగింది. వారికి కావాల్సిన కరిక్యులమ్ తయారుచేసే బాధ్యత ఏయూ తీసుకోవాలని కోరుతున్నా. ఆంధ్ర యూనివర్సిటీకి కనీసం రూ.250 కోట్లు నిధులు కేటాయించి రీసెర్చ్ ను పెద్దఎత్తున ప్రోత్సహించాలని సీఎం గారిని కోరుతున్నా. వచ్చే వందేళ్ల విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని సిబ్బంది, వీసీని ఆదేశించాం. ప్రతి ఐదేళ్లలో యూనివర్సిటీ ఏం సాధించాలనేది అందులో స్పష్టంగా ఉండాలని, స్టూడెంట్స్ ఫీడ్ బ్యాక్ కూడా తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు కే.రామ్మోహన్ నాయుడు, భారతరత్న, ప్రముఖ ఇండియన్ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ఒడిశా గవర్నర్ కే.హరిబాబు, కేంద్రమంత్రులు భూపతిరాజు శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, సైయెంట్ గ్రూప్ వ్యవస్థాపకులు బీవీఆర్ మోహన్ రెడ్డి, ఏయూ వైస్ ఛాన్స లర్ జీపీ రాజశేఖర్, ప్రముఖ సినీ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో ఈ రోజు.. నాకెంతో ప్రత్యేకం

విశాఖపట్నం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

ఆంధ్రా యూనివర్సిటీ వేదికలో జరిగిన కార్యక్రమంలో మాజీ భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, విశాఖపట్నం తనకు ఎంతో ప్రత్యేకమైన నగరమని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజల ప్రేమ, అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపారు.తాను క్రికెట్ ద్వారా ఎన్నో అనుభవాలు సొంతం చేసుకున్నానని, వాటిని యువతతో పంచుకోవడం తనకు ఆనందంగా ఉంటుందని చెప్పారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి కష్టపడితే విజయం సాధించగలరని సూచించారు.సామాజిక బాధ్యతలను గుర్తించి ముందుకు సాగాలని, ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని సచిన్ పిలుపునిచ్చారు. క్రీడలతో పాటు చదువులోనూ ప్రతిభ కనబరచాలని యువతకు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సచిన్ ప్రసంగం వారికి ప్రేరణనిచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

నేడు గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ డేటా సెంటర్ శంకుస్థాపన

7వ పేజీ తరువాయి ..

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఈ సంస్థల నుంచి వచ్చే పెట్టుబడులను దశలవారీగా పరిశీలించి ఆమోదిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయని, హై ఎండ్ ఉద్యోగాలు, ఐటీ, ఫైనాన్స్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఏర్పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "ఒక ప్రజాప్రతినిధిగా ఈ సమయంలో విశాఖపట్నం ఎంపీగా ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నాను. గూగుల్ టీమ్ విశాఖను ఎంపిక చేసుకోవడం ఎంతో ఆనందదాయకం. ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తై ప్రాంత అభివృద్ధికి దోహదం చేయాలని కోరుకుంటున్నాను" అని ఎంపీ శ్రీ భరత్ తెలిపారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

7వ పేజీ తరువాయి ..

స్మరించుకున్నారు. సి.ఆర్. రెడ్డి దార్శనికత, సర్వేపల్లి రాధాకృష్ణన్ మార్గదర్శకత్వం, నాయకత్వం విశ్వవిద్యాలయాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయని కొనియాడారు. అలాగే జైపూర్ మహారాజు విక్రమ్ దేవ్ వర్మ, విజయనగరం మహారాజులు, బొబ్బిలి ఇతర సంస్థానాల సహకారాన్ని గుర్తుచేశారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ, కేవలం డిగ్రీలు సాధించడం సరిపోదని, కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం బోధనా కేంద్రంతో పాటు పరిశోధనా కేంద్రంగా మారాలని, పరిశోధనలు క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా ఉండాలని ఆకాంక్షించారు. పేటెంట్లపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్యూర్ సైన్సెస్‌పై ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగుతోందని అన్నారు. 2025-26 నాటికి దేశంలోనే అత్యధిక పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రంగా ఏపీ నిలిచిందని, ఈ అభివృద్ధిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం వంటి విద్యాసంస్థల కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. విశాఖపట్నం నగరం ఐటీ, డేటా సెంటర్లు, టూరిజం మరియు గ్లోబల్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ప్రధాన కేంద్రంగా మారుతోందన్నారు. గూగుల్ ఏఐ,అదానీ డేటా సెంటర్లు వంటి భారీ పెట్టుబడులతో విశాఖ ఒక శక్తివంతమైన ఎకనామిక్ హబ్‌గా అవతరిస్తోందని తెలిపారు. వైఫల్యాలకు కుంగిపోకుండా, క్రమశిక్షణతో లక్ష్యం వైపు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సచిన్ టెండూల్కర్ తన 100వ సెంచరీ కోసం ఎదురుచూసిన పద్ధతిని ఉదాహరణగా చూపుతూ, ఓపిక ఆత్మవిశ్వాసం విజయానికి మూలసూత్రాలని వివరించారు. సమయపాలన అనేది కేవలం పాఠశాల విద్యార్థులకే కాకుండా, జీవితంలో ప్రతి ఒక్కరికీ అవసరమని, సమయాన్ని సరిగ్గా నిర్వహించే వారే విజేతలుగా నిలుస్తారని ఉద్ఘాటించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇప్పటికే పలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు కుదుర్చుకుందని, రానున్న రోజుల్లో ఇది కేవలం జాతీయ స్థాయిలోనే కాకుండా, ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో చేరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో కలిసి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, జిఎంఆర్ సంస్థ ఫౌండర్, చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, బి.వి.ఆర్.మోహన్ రెడ్డి, సత్యనారాయణ, ప్రొఫెసర్ ఎం.ఆర్.మాధవ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ లకు ఎక్స్ లెన్సీ అవార్డుతో పాటు శతాబ్ది వేడుకల జ్ఞాపికలను అందజేశారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో ప్రత్యేక పోస్టల్ స్టాంప్ ఆవిష్కరణ

విశాఖపట్నం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రగతిక హాస్టల్ స్టెప్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వసతుల మెరుగుదల కోసం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కేంద్ర భూ శాస్త్రాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై హాస్టల్ స్టెప్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి నారా లోకేష్, ఇతర ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన కిరణ్ రిజిజు, విద్యా రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి ప్రతిభను వెలికితీయాలని ఉద్దేశ్యమన్నారు. నారా లోకేష్ మాట్లాడుతూ, ఆంధ్రా యూనివర్సిటీ దేశంలో ప్రముఖ విద్యాసంస్థగా నిలుస్తోందని, శతాబ్ది ఉత్సవాలు యూనివర్సిటీకి మరింత ప్రతిష్టను తీసుకువస్తాయని అన్నారు. విద్యార్థులకు మెరుగైన నివాస వసతులు కల్పించడం, పరిశోధనలకు అనుకూల వాతావరణం సృష్టించడం ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముందుగానే నైరుతి రుతుపవనాలు..రైతుల్లో ఆశలు చిగురింపు

(ప్రభాతవార్త -విశాఖపట్నం)

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందుగానే ప్రవేశించే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. దీని వల్ల మండే ఎండల నుంచి ఉపశమనం లభించడంతో పాటు వ్యవసాయ రంగానికి ఊరటనిచ్చే పరిస్థితులు ఏర్పడనున్నాయి. సాధారణంగా జూన్ 1న కేరళ తీరాన్ని తాకే రుతుపవనాలు, ఈసారి మే 25 నాటికే చేరుకునే అవకాశముందని యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం-రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ వెల్లడించింది. ఈ పరిస్థితి కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌లో కూడా రుతుపవనాలు ముందుగానే ప్రవేశించే అవకాశముందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గత సంవత్సరం మే 24న కేరళలోకి వచ్చిన రుతుపవనాలు, మే 26 నాటికే రాష్ట్రానికి విస్తరించాయి. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వడగాలుల తీవ్రత పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 200కు పైగా మండలాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. దీంతో విద్యుత్ అంతరాయాలు, డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రుతుపవనాలు ముందుగానే రావడం వల్ల వేడిమి నుంచి ఉపశమనం లభించడమే కాకుండా, నేలలో తేమ పెరిగి విత్తనాల విత్తకానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. నీటి వనరులపై ఒత్తిడి తగ్గి, వ్యవసాయ కార్యకలాపాలు వేగవంతం కావచ్చు. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఇది ఊరటనివ్వనుంది. అయితే, నైరుతి రుతుపవనాల రాకపై భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డీ) ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. మే మధ్యలో తమ అంచనాలను వెల్లడించనున్నట్లు ఐఎమ్‌డీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు.

LIC HFL
LIC HOUSING FINANCE LTD

LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాక్ ఆఫీస్, 4వ అంతస్తు, ఉత్తర విభాగం, జీవన్ సమృద్ధి, న్యూ ఇన్వెస్ట్‌మెంట్ భవనం, ఎల్ఐసి ఎనెక్స్ భవనం, తిక్కన్న రోడ్డు, విశాఖపట్నం-530004. ఫోన్ : 0891-2746480.

(రూల్ 8(1)) **స్వాధీనత ప్రకటన** సెక్షన్ 13(4) క్రింద సర్ఫేసి యాక్ట్, 2002 (స్థిరాస్తుల కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీత/లుకు దిగువ పేర్కొనబడిన బకాయి సొమ్ములు, తదుపరి వడ్డీ / వ్యయాలు మొ॥నవి సదరు నోటీస్ తేది నుండి 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరుతూ డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

1. ఋణగ్రహీత పేరు : శ్రీ అనసూరి బాబ్జీ మరియు శ్రీమతి అనసూరి జ్యోతి, లోన్ అకౌంట్ నెంలు : 711700009856 & 711700009957, ఏరియా ఆఫీస్ : గాజువాక, డిమాండ్ నోటీసు తేది : 12.05.2025 (డిమాండ్ నోటీసును తేది.23.08.2025 న ఆంధ్రప్రభ మరియు టైమ్స్ ఆఫ్ ఇండియా దినపత్రికలలో ప్రచురించడమైనది.) బకాయి మొత్తం : రూ.43,00,904.66/- (అక్షరాల నలభై మూడు లక్షల తొమ్మిది వందల నాలుగు రూపాయల అరవై ఆరు పైసలు మాత్రమే) + తేది.13.05.2026 నాటి నుండి వర్తించు తదుపరి వడ్డీతో కలిపి. లాంఛనాత్మక స్వాధీనత తేది: 23.04.2026.
   షెడ్యూల్ ఆస్తి వివరములు : విశాఖపట్నం జిల్లా, నక్కపల్లి SRO, పాయకరావుపేట మండలం, పాల్తేరు గ్రామం మరియు గ్రామ పంచాయతీ యొక్క జిరాయితీ మెట్ట భూమి సర్వే నెం.138/6 సందు మొత్తం విస్తీర్ణం ఎ. 0.06 సెంట్లులోని తూర్పు వైపున డోర్ నెం. 1-1 దగ్గర విస్తీర్ణం ఎ. 0.03 సెంట్లు లేదా 151.19 చ॥గ॥లు లేదా 126.41 చ॥మీ॥లు స్థలంతో అందులోని RCC రూఫ్ రెసిడెన్షియల్ ఇల్లు కలదు. హద్దులు: తూర్పు: తెలుగుంట సుబ్బారావు గారి మిగిలిన భూమి, దక్షిణం: తెలుగుంట సూర్యనారాయణ గారికి చెందిన భూమి, పడమర: హక్కుదారుని యొక్క మిగిలిన స్థలం, ఉత్తరం: 10 అ॥ల వెడల్పు గల రోడ్డు.
2. ఋణగ్రహీత పేరు : శ్రీ సతీష్ యల్లపు, నివాస డి నెం.18-7-14/1, విల్లూరి అక్కయ్యగారి వీధి, చిన రామాయలం దగ్గర, నిదానందొడ్డి, గవరపాలెం, అనకాపల్లి. లోన్ అకౌంట్ నెం : 7003170000320, ఏరియా ఆఫీస్ : గాజువాక, డిమాండ్ నోటీసు తేది : 14.01.2026, బకాయి మొత్తం : రూ.24,98,768.89/- (అక్షరాల ఇరవై నాలుగు లక్షల తొంభై ఎనిమిది వేల ఏడు వందల అరవై ఎనిమిది రూపాయల ఎనభై తొమ్మిది పైసలు మాత్రమే) + తేది.15.01.2026 నాటి నుండి వర్తించు తదుపరి వడ్డీతో కలిపి. లాంఛనాత్మక స్వాధీనత తేది: 24.04.2026.
   షెడ్యూల్ ఆస్తి వివరములు : విశాఖపట్నం జిల్లా మరియు యలమంచిలి రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా, అచ్యుతాపురం మండలం, భోగాపురం గ్రామ పంచాయతీ పరిధి, భోగాపురం గ్రామం, సర్వే నెం.113, 114/1,2,3, 115, ప్లాట్ నెం.32, 33, 34, 41, 42 మరియు ప్లాట్ నెం.43 యొక్క ఉత్తర భాగం, హైదరాబాద్ DTCP వారి ఆమోదం పొందిన లేఅవుట్ , DTCP నెం.9146/2008, తేది.25-11-2008, L.P. నెం.19/2009N ప్రకారం విస్తీర్ణం ఎ. 13-57 సెంట్లు ఖాళీ స్థలంలోని విస్తీర్ణం 1195.7 చ॥గ॥లు లేదా 999.60 చ॥మీ॥ల మొత్తం ఖాళీ స్థలం కలదు. మొత్తం స్థలం ఒకే కాంపాక్ట్ బిట్‌గా హద్దులు: తూర్పు: 33 అ॥ల వెడల్పు గల రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.43 లోని దక్షిణం భాగం, ప్లాట్ నెం.31 మరియు ప్లాట్ నెం.43 యొక్క ఉత్తరం భాగంలోని సయ్యద్ మీర్ గారికి చెందిన మిగిలిన భాగం, పడమర: 33 అ॥ల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.40 & 35లోని ఆస్తి.
   షెడ్యూల్-బి: పైన పేర్కొన్న స్థలంలోని అవిభాజ్యమైన మరియు నిర్ధిష్టపరచని వాటా విస్తీర్ణం 29.8925 చ॥గ॥లు లేదా 24.994 చ॥మీ॥లుతో పవన్ రెసిడెన్సీ రెండవ అంతస్తులోని సూపర్ బిల్టప్ ఏరియా 850 చ॥అ॥లుతో (కామన్ ఏరియాలు మరియు బాల్కనీలతో కలిపి) ఫ్లాట్ నెం.306 మరియు స్టిల్ట్/సెల్లార్ ఫ్లోర్ నందు 80 చ॥అ॥ల కార్ పార్కింగ్‌తో కలదు. హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: కామన్ కారిడార్, పడమర: బహిరంగ ప్రదేశం, ఉత్తరం: ఓపెన్ సెట్‌బ్యాక్ స్పేస్.

ఇప్పటి నుండి "సెక్యూర్డ్ ఆస్తులు" అని పిలువబడును.

పైన పేర్కొన్న ఋణగ్రహీతలు, సదరు బకాయి సొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002లోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్ 8 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ పైన తెలిపిన ఆస్తిని పైన పేర్కొన్న తేదీలో లాంఛనాత్మకంగా స్వాధీనపరచుకున్నారని తెలియచేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి చెల్లించవలసిన పైన పేర్కొనబడిన బకాయి మరియు వడ్డీ కలిపి మొత్తమునకు లోబడి వుంటాయి. సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీతలు తమ యొక్క తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

తేది.23.04.2026 & 24.04.2026 న నా స్వహస్తములతో కంపెనీ ముద్రతో జారీచేయబడినది.

తేది.23.04.2026 & 24.04.2026, ప్రదేశం : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

లలితశ్రీ కృషి ఆదర్శనీయం: ఎమ్మెల్యే పల్లా

గాజువాక,ఏప్రిల్ 27,ప్రభాతవార్త

పట్టుదలతో చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ధర్మాల లలితశ్రీ ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. సోమ వారం గాజువాకలో ఆమె ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్లా ఆమెను ఘనంగా సత్కరించి అభినందించారు. పెదగంట్యాడ మండలం వెంకన్నపాలెంకు చెందిన లలితశ్రీ.. ఎన్.బి.ఎం. లా కళాశాలలో గోల్డ్ మెడల్ సాధించి, ఇప్పుడు జడ్జిగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సెలవులలో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు

ఆనందపురం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

వేసవి సెలవులలో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారులు జోగేంద్రనాథ్, గంగరాజు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిందని తెలిపారు. మండలంలో ఏ పాఠశాల అయినా ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి తెరిచినా, తరగతులను నిర్వహించినా వాటిపై చట్టపరమైన చర్యలను తీసుకుంటామని వారు హెచ్చరించారు. తల్లిదండ్రులు వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా పిల్లలు ఇంటిలోనే ఉండేటట్లుగా జాగ్రత్తలు తీసుకొని సాయంత్ర సమయంలో దగ్గరలో ఉన్న గ్రంధాలయాలలో పుస్తక పఠనం చేసే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని కోరారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు

గాజువాక,ఏప్రిల్ 27,ప్రభాతవార్త

ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని వైకాపా 87వ వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్ అన్నారు. సోమవారం జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని కణితి కళింగవీధి, గాంధీబొమ్మ కూడలి వద్ద వడ్లపూడి ఏక సత్యసాయి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారుల సౌకర్యార్థం స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సత్యసాయి కమిటీ సభ్యులు జల్లు రమణమ్మ, రాంబాబు, శ్రీరాములు, పూడి రమేష్, పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల గమ్యస్థానం విశాఖ : భీమిలి ఎమ్మెల్యే గంటా

ఆనందపురం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:

పెట్టుబడులకు విశాఖ గమ్యస్థానంగా మారుతోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు అన్నారు. ఆనందపురం మండలంలోని తర్లువాడలో మంగళవారం జరగనున్న గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన ఏర్పాట్లను అయన సోమవారం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి అనేది స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకూ అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా పేర్కొన్నారు. హైదరాబాద్ కు మైక్రోసాఫ్ట్ లా విశాఖకు గూగుల్ గేమ్ చేంజర్ కాబోతుందన్నారు. చంద్రబాబు నాయుడు విజన్ కి లోకేష్ యాక్షన్ తోడైతే గూగుల్ డేటా సెంటర్ లాంటి అద్భుతాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. 21 నెలల్లో విశాఖకు తరలివచ్చిన ఐటీ కంపెనీలు ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతున్నాయన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్, రహేజా, బ్రూక్ ఫీల్డ్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థల రాకతో విశాఖ అభివృద్ధి ముఖచిత్రమే మారిపోతుందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణాలలో మెజారిటీ పెట్టుబడులు ఒకప్పటి మాట అని.. పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు మొదటి వరసలో ఉందని వెల్లడించారు. భోగాపురం ఎయిర్ పోర్టు కూడా అందుబాటులోకి రానున్న నేపథ్యంలో విశాఖ అభివృద్ధి ఎవరూ ఊహించలేరన్నారు. ఇంతటి చారిత్రక ఘట్టంలో భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. పరిశ్రమ స్థాపించిన వారితో పాటు భూములిచ్చిన రైతు సంతోషంగా ఉండాలన్న సీఎం చంద్రబాబు దిశానిర్దేశం మేరకు రైతులంతా సంతృప్తి చెందేలా అందరికీ పరిహారం చెల్లించామని తెలియజేశారు. శంకుస్థాపన అనంతరం రైతులతో సమావేశమై ఇతర అంశాలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఏయూ 100 సంవత్సరాల చరిత్రకు నాంది సర్ అన్నెపు పరుశురాం పాత్రో

మాధవధార, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాపించి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా యూనివర్సిటీ స్థాపించడానికి మూల కారణం అయినటువంటి అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం శాసనసభలో మొదటిగా బిల్లు ప్రవేశపెట్టినటువంటి సర్ అన్నెపు పరశురాం పాత్రో విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసీపీ విశాఖ జిల్లా బీసీ అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ సోమవారం ఏయూలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాపించడానికి మూల కారణమైన సర్ అన్నెపు పరశురాం పాత్రో ను ప్రతి ఒక్కరు ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవడం ఎంతో అవసరమన్నారు.

గౌరీనగర్‌లో రహదారి పనుల ప్రారంభం

గాజువాక,ఏప్రిల్ 27,ప్రభాతవార్త

గౌరీనగర్ కాలనీలో రహదారి నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. వార్డు ఇంచార్జ్ నల్లారు సూర్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ వేగుంట శ్రీనివాసరావు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో పనులు వేగవంతం కావడం సంతోషకరమన్నారు. వర్షం వస్తే కనీసం నడవలేని స్థితిలో ఉన్న కాలనీ వాసుల కష్టాలను గుర్తించి, ఎమ్మెల్యే పనులకు ఆదేశించారని స్థానిక నాయకులు చదరం తులసిరామ్ తెలిపారు. త్వరలోనే వీధి దీపాల సమస్యను కూడా పరిష్కరిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కొత్త ట్రాక్టర్ మోడళ్లను విడుదల చేసిన ఎస్కార్ట్స్ కుబోటా

ఆరిలోవ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

గత ఏడాది ఫిబ్రవరి నుండి ఎస్కార్ట్స్ కుబోటా తన 3 బ్రాండ్ల అంతటా చేపట్టిన నాలుగో ప్రధాన ట్రాక్టర్ ప్రారంభోత్సవం ఇది పరిశ్రమలోనే అత్యుత్తమ వేగాన్ని అందించే యంత్రాలలో డిజిట్రాక్ ఒకటి. ఇందులో డిజిట్రాక్ పీపీ 43ఐ ప్లస్ గంటకు 39.9 కిలోమీటర్ల గరిష్ట వేగాన్ని అందిస్తుంది. వ్యవసాయ యంత్రాలు, నిర్మాణ పరికరాల రంగంలో అగ్రగామిగా ఉన్న ఎస్కార్ట్స్ కుబోటా లిమిటెడ్ తన పవర్‌ట్రాక్ బ్రాండ్ కింద సరికొత్త డిజిట్రాక్ సిరీస్ ట్రాక్టర్లను మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా ఈ కొత్త ట్రాక్టర్లు 45 నుండి 55 హెచ్ పి సామర్థ్యంతో అందుబాటులోకి వచ్చాయి. వీటిని ఆధునిక వ్యవసాయ పనులతో పాటు భారీ లోడ్లను తరలించే పనుల కోసం ప్రత్యేకంగా రూపొందించారు. ఈ సిరీస్ ట్రాక్టర్లను దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ కొత్త డిజిట్రాక్ సిరీస్ రాకతో రైతులకు మరిన్ని ఆధునాతన ఆప్షన్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ కొత్త ట్రాక్టర్ల విడుదల గురించి ఎస్కార్ట్స్ కుబోటా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నిఖిల్ నందా మాట్లాడుతూ... గత ఏడాది ఫిబ్రవరి నుండి ఇప్పటి వరకు మా మూడు బ్రాండ్ల తరుపున విడుదల చేసిన నాలుగో కొత్త ట్రాక్టర్ ఇదని, ఇలా వరుసగా కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకురావడం అనేది, ఒక సంస్థగా మేం ఎంత వేగంతో ఎదుగుతున్నామో తెలియజేస్తుందని, భారత దేశ మార్కెట్లో అత్యంత బలమైన స్థానాన్ని సంపాదించాలనే మా లక్ష్యానికి ఇది మమ్మల్ని మరింత దగ్గర చేస్తుంది" అని పేర్కొన్నారు.

దేశ్ కా కిసాన్, దేశ్ కా అస్లీ హీరో ప్రచారం ప్రారంభం

ఆరిలోవ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

భారతదేశంలోని పరిశోధన ఆధారిత వ్యవసాయ ఉత్పాదక సంస్థలలో ఒకటైన క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ అక్షయ్ కుమార్‌ను తమ బ్రాండ్ అంబాసిడర్ గా నియమించినట్లు ప్రకటించింది. ఈ భాగస్వామ్యం తర్వాత, క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ అక్షయ్ కుమార్‌తో కలిసి తన తొలి జాతీయ బ్రాండ్ ప్రచార కార్యక్రమం "దేశ్ కా కిసాన్, దేశ్ కా అస్లీ హీరో"ను ప్రారంభించింది. ఈ భాగస్వామ్యం ద్వారా క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ దేశ రైతులతో తన అనుసంధానాన్ని మరింత బలపరచి, వారు ఆధునిక పరిష్కారాలను వినియోగించి వ్యవసాయ లాభదాయకతను పెంచుకునేలా చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఎగ్జిక్యూటివ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అంకుర్ అగర్వాల్ మాట్లాడుతూ "అక్షయ్ కుమార్ దృఢసంకల్పం, క్రమశిక్షణ, లక్ష్యం పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండే వ్యక్తి, ఈ లక్షణాలు క్రిస్టల్ లో మేము అనుసరించే విలువలకు అనుగుణంగా ఉంటాయి. దేశానికి ఆహారాన్ని అందించే నిజమైన హీరోలైన మన రైతులతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన వ్యక్తిని మేము ఈ భాగస్వామ్యం ద్వారా అనుసంధానిస్తున్నాం. రైతు అంటే కేవలం ఒక వాటాదారుడు కాదు, మన ఉనికికి అసలైన కారణమని భావిస్తున్నాం, అక్షయ్ కుమార్ "క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్‌తో ఈ అనుబంధం నిజంగా చెప్పాలంటే సహజమైన భాగస్వామని, కేవలం మాటలతో కాకుండా చేతలతో కూడా భారతీయ రైతులకు అండగా నిలిచే బ్రాండ్‌తో భాగస్వామి కావడం గర్వంగా ఉందన్నారు.

వేర్వేరు ప్రాంతాలలో ఇద్దరు యువకులు ఆత్మహత్య

అప్పులు బాధలకు తాళలేక ఒకరు...అనారోగ్య సమస్యలతో మారొకరు

ఆనందపురం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

ఆనందపురం మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాలలో ఇద్దరు యువకులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అప్పులు బాధలకు తాళలేక తర్లువాడలో దినసరి కూలీగా పనిచేస్తున్న ఓ యువకుడు.. అనారోగ్య బాధలతో ఎగువ పాలవలస గ్రామానికి చెందిన మరో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారని స్థానిక పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. విజయనగర జిల్లా, జామి మండలం గోడికొమ్ము గ్రామానికి చెందిన సారిపల్లి వినోద్ (25) రెండు రోజులు క్రితం పవన్ అనే యువకుడితో కలిసి తర్లువాడ వచ్చారు. అక్కడ వారు దినసరి కూలీలగా పనిచేస్తున్నారు. ఈ నెల 25న ఇంటివద్ద నుంచి పని కోసం తర్లువాడ వచ్చిన వినోద్ సాయంత్రం ఇంటికి వెళ్ళలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేసి అడగగా రాత్రి పని కూడా ఉందని అందుకే ఇంటికి రాలేదని చెప్పాడు. 26న కూడా వినోద్ పనిలోకి వెళ్ళాడు. అదే రోజు రాత్రి తమ్ముడైన విజయ్ కు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని తన భార్య పిల్లలను సక్రమంగా చూసుకోవాలని చెప్పి ఫోన్ పెట్టేసాడు. దీంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు మరలా వినోద్ కు ఎన్ని మార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో వినోద్ తో పాటు పనికి వచ్చిన పవన్ కు కుటుంభ సభ్యులు ఫోన్ చేసి విషయం చెప్పి వినోద్ ఎక్కడ ఉన్నాడో చూడమన్నారు. దీతో పరిసర ప్రాంతాలు వెతకగా అక్కడకు సమీపంలోని మామిడితోటలో చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందిఉన్నాడు. ఈ మేరకు కుటుంభం సభ్యులకు సమాచారం అందించాడు. ఈ మేరకు కుటుంభం సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని పోలీస్ లకు సమాచారం అందించారు. సీఐ వాసునాయుడు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. అప్పులు బాధలు తాళలేకే వినోద్ ఆత్మహత్యకు పాల్పడిన ఉండొచ్చని కుటుంబ సభ్యులు తెలిపినట్టు పోలీస్ లు చెప్పారు. కేసుని సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ గౌరమ్మ దర్యాప్తు చేస్తున్నారు.

ఎగువ పాలవలసలో......

అలాగే ఆనందపురం మండలం ఎగువ పాలవలసకు చెందిన కోరాడ శ్రీను మండలంలోని దుక్కవానిపాలెం వద్ద చికెన్ షాప్ లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా శ్రీనుకు కిడ్నీలు పాడై గత కొంతకాలంగా అనారోగ్యం సమస్యలను ఎదుర్కుంటున్నాడు ఆదివారం రాత్రి భార్య సంతోష్ ఇద్దరు పిల్లలు మేడ మీద పడుకోగా శ్రీను కింద గదిలో పడుకున్నాడు. సోమవారం తెల్లవారు జామున శ్రీను భార్య సంతోష్ మేడ మీద నుంచి కిందకు దిగి తలుపుతీయమని శ్రీనును పిలిచింది. ఎంతకూ లోపల నుంచి సమాధానం రాకపోవడంతో బంధువులకు తెలపడంతో వారు బలవంతంగా తలుపులు తెరిచి చూసారు. దీంతో ఇంట్లో ఫ్యాన్ కు ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు పోలీస్ లకు ఫిర్యాదు చేయగా శవాన్ని పోస్ట్ మార్టానికి తరలించి ఆనందపురం పోలీస్ లు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్‌కి ఘన సత్కారం

విశాఖపట్నం ఏప్రిల్ 27 ప్రభాతవార్త

మధురవాడ జాతరలో వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా నాట్య రవళి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యంశాలు అందర్నీ అలరించాయి. మహానగర విశాఖలో గత 36 సంవత్సరాలు పైగా సామాజిక సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతుగా నిస్వార్థమైన సేవలందిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్‌ని సంస్థ తరపున ఘన సత్కరించి వారి సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సేవలను కొనియాడారు. సంస్థ అధ్యక్షులు ఉమ్మడి మహేష్ బాబు, సన్ మూర్తి, నాట్యాచార్యులు బాబు మాస్టారు, నాట్యాచారిణి రజినిరెడ్డి, కళాకారులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోండి

అపుస్మా రీజనల్ డైరెక్టర్ ఎంవి రావు

ఆరిలోవ, ఏప్రిల్27, ప్రభాతవార్త

విజయనగరంలోని రామనారాయణం ఆజాత్మిక కేంద్రంపై ఆంధ్రప్రదేశ్ అన్ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్(అపుస్మా) ఆధ్వర్యంలో ఈ నెల 28న జరగనున్న ఉపాధ్యాయుల అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆరిలోవ భారతి స్కూల్ అధినేత, అపుస్మా రీజనల్ డైరెక్టర్ ఎం.వి.రావు పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీ ఐఐఏఎంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ సదస్సు జరుగు తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపా ధ్యాయులు హాజరుకావాలని ఆయన కోరారు.పదో తరగతి (స్టేట్, సీబీఎస్ఈ) పాఠ్యాంశాల్లో వాల్మీకి రామాయణాన్ని చేర్చిన నేపథ్యంలో,ఉపాధ్యా యులు విద్యార్థులకు సులభంగా బోధించేలా వారికి తగిన అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఆకట్టుకున్న సైకత శిల్పం

విశాఖపట్నం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో గూగుల్ డేటా సెంటర్‌తో పాటు పలు ఐటీ కంపెనీలను తీసుకువచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న తరుణంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి ధన్యవాదాలు తెలియజేస్తూ సైకిత శిల్పం రూపొందించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, విఎంఆర్డిఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్ ఎంజీఎం ఆవరణలోని సముద్ర తీరంలో ఏర్పాటుచేసిన ఈ సైకత శిల్పం సందర్శకులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన పురస్కరించుకొని, గూగుల్ డేటా సెంటర్ విశాఖకి తీసుకురావటంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి విశాఖ నిరుద్యోగుల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తూ, జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్ లోకేష్ అన్న, థ్యాంక్ క్యూ లోకేశ్ అన్న ఇట్లు వైజాగ్ అంటూ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటంతో కూడిన ఈ సైకత శిల్పాన్ని రూపొందించిన సైకిత శిల్ప కళాకారుడు బాలాజీ వర ప్రసాద్ ను విఎంఆర్డిఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ అభినందించారు. ఈ సందర్భంగా వుడా చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విశాఖ ఏఐ హబ్‌గా మారబోతోందని పేర్కొన్నారు. వెనుక బడిన ఉత్తరాంధ్ర ఉపాధితో ఉత్తమ ప్రాంతంగా మారుతుందన్నారు. గూగుల్ డేటా సెంటర్ రాకతో లక్షలాది మందికి ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఉత్తరాంధ్ర ముఖ చిత్రం మార్చేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర యువత తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

శ్రీ సంపత్ వినాయక ఆలయంలో హుండీ లెక్కింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

సంపత్ వినాయక ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. దేవాలయంలో ఉన్న 4 ధర్మ హుండీలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల కుటుంబ సభ్యులు టి.ఆర్. చోళన్ డి జె పి. ప్రభావతి, సీనియర్ సహాయకులు, సహాయ కమిషనర్ వారి కార్యాలయం,దేవదాయ ధర్మదాయ శాఖ, వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో శివ జ్యోతి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బందిచే లెక్కింపు జరిగినది. ఈ హుండీల ద్వారా మార్చి 27 నుండి సోమవారం వరకు రూ.21,59,621 ఆదాయం వచ్చినది ఆలయ అధికారులు తెలిపారు. వెండి 62.500 మిల్లు గ్రాములు, బ్యాంకర్ చెక్ రూ 111, 18 అమెరికన్ డాలర్స్,సౌదీ 1 రియల్స్, అష్ట్రేలియా 20 డాలర్స్, సింగపూర్ -2 డాలర్లు వచ్చాయని తెలియజేశారు.

జీవీఎంసీలో ఘనంగా రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి వేడుకలు

విశాఖపట్నం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) లో శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య మాట్లాడుతూ, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన మహానుభావులలో ఒకరని తెలిపారు. అమరావతిని రాజధానిగా చేసుకుని కృష్ణా, గుంటూరు ప్రాంతాలను పరిపాలించిన ఆయన, వాసిరెడ్డి నాయక వంశంలో విశిష్ట స్థానాన్ని సంపాదించారని చెప్పారు. కవి, పండితులను ప్రోత్సహించిన ఆయన మంచి పరిపాలనాదక్షుడిగా పేరుపొందారని పేర్కొన్నారు. అలాగే, వందకు పైగా దేవాలయాల నిర్మాణానికి ఆయన కృషి చేశారని గుర్తుచేశారు. ఇటువంటి మహనీయుల సేవలను స్మరించుకోవడం ద్వారా యువతలో స్ఫూర్తి పెంపొందుతుందని, సమాజానికి సేవ చేయాలనే భావన బలపడుతుందని నల్లనయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పీవీవి సత్యనారాయణ రాజు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవరెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ ఏ. ప్రభాకర్ రావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. పద్మజతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ చేరుకున్న ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం

గాజువాక,ఏప్రిల్ 27,ప్రభాతవార్త

ఉత్తరాంధ్ర పర్యటన నిమిత్తం విశాఖ చేరుకున్న భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, సీపీ శంఖబ్రత బాక్చీ, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు ఆయనకు సాదర స్వాగతం పలికారు. భాజపా నేతలు పరశురామరాజు, కరణంరెడ్డి నరసింగరావు, ఉమ్మిడి సుజాత తదితరులు ఉపరాష్ట్రపతిని కలిసిన వారిలో ఉన్నారు. విమానాశ్రయం నుంచి ఉపరాష్ట్రపతి శ్రీకాకుళం వెళ్లి అరసవిల్లి స్వామిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నివాసంలో భోజనం అనంతరం, సాయంత్రం ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొని రాత్రికి దిల్లీ పయనమవుతారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

జిల్లాలో సరిపడా ఇంధన నిల్వలు - విడి విక్రయాలపై కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ నిషాంతి.టి

పాడేరు,ఏప్రిల్27,ప్రభాతవార్త

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, ఇంధన నిల్వల లభ్యతపై జిల్లా కలెక్టర్ నిషాంతి.టి మీడియా సమావేశ నిర్వహించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దని, వివిధ శాఖల ద్వారా అందుతున్న సేవలపై ప్రజల నుండి నిరంతరం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు సమర్పించే ఫిర్యాదులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రజా ఫిర్యాదులపై పరిష్కారం లభించిన తర్వాత ఆ వివరాలను సంబంధిత ఫిర్యాదుదారునికి ఖచ్చితంగా తెలియజేయాలని, అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటం మనందరి బాధ్యత అనిఆమె గుర్తుచేశారు. జిల్లాలో నిల్వ ఉన్న పెట్రోల్, డీజిల్ వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసే విధంగా పెట్రోల్ బంక్ అభిమానులకు సూచించమన్నారు. ప్రస్తుతం జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తలను కలెక్టర్ ఖండించారు. జిల్లాలో ఇంధన నిల్వలు నిరంతర సరఫరాకు సరిపడా ఉన్నాయని తెలిపారు. ఒకవేళ నిలువ తగ్గినట్లుగా తెలిసిన వెంటనే సాయంత్రం లోపల నిల్వలు బంకులో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో రోజువారీ సగటున 50 కిలోలీటర్ల డీజిల్, 34 కిలోలీటర్ల పెట్రోల్ విక్రయాలు జరుగుతున్నాయని, వీటికి తగినంత స్టాక్ అందుబాటులో ఉందని వివరించారు. కొన్ని చోట్ల స్టాక్ లేదని వచ్చిన వార్తలు కేవలం ఇండెంట్ పెట్టడంలో జరిగిన జాప్యము,సాంకేతిక ఆలస్యం మాత్రమేనని, నేటి రాత్రి కల్లా అన్ని బంకులకు పూర్తిస్థాయిలో సరఫరా చేరుతుందని స్పష్టం చేశారు. విడి విక్రయాలపై నిషేధం క్రిమినల్ కేసుల ముందస్తు జాగ్రత్త చర్యగా జిల్లాలో బాటిళ్లు, క్యాన్లు లేదా డ్రమ్ములలో విడి (రాశీశీంవ)గా పెట్రోల్, డీజిల్ విక్రయించడాన్ని కఠినంగా నిషేధించామని తెలిపారు . నిబంధనలు ఉల్లంఘించే బంక్ యజమానులపై, కొనుగోలు చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా పోలీస్, రెవెన్యూ అధికారులతో కూడిన జాయింట్ టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతరం పెట్రోల్ బంకులను తనిఖీ చేస్తాయని తెలిపారు. ప్రజలు భయాందోళనతో అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని కలెక్టర్ కోరారు. జిల్లా అధికార యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, నిరంతర సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్దార్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని బంకుల్లో తగినంత స్టాక్ ఉందని ఒకవేళ అలా లేని బంకులు ఏమైనా ఉన్నాయంటే వారి ఇండెంట్ పెట్టడంలో జాబితా మాత్రమేనని రెవెన్యూ పోలీస్ శాఖల సమన్వయంతో టాస్క్ ఫోర్స్ నియమించమని వారు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. ఎందుకు ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

నక్కపల్లి జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం..

ఉపాధి కూలీలపై దూసుకొచ్చిన పార్సిల్ వ్యాన్ ..ఒకరు మృతి- ఇరువురికి తీవ్ర గాయాలు..

(నక్కపల్లి/ అడ్డు రోడ్డు , ప్రభాతవార్త)

తెల్లవారింది.. జీవనోపాధి కోసం మట్టి పని చేసుకునేందుకు కాలినడకన నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై వెళుతున్న ఉపాధి హామీ మహిళా కూలీలపై పార్సిల్ వ్యాను అదుపుతప్పి దూసుకొచ్చిన సంఘటన కలచివేసింది.. ఈ సంఘటన సిసి ఫుటేజీల ద్వారా పరిశీలిస్తే కేవలం డ్రైవర్ నిర్లక్ష్యం తోనే వారిపైకి వ్యాను దూసుకు వెళ్లినట్లు కనిపిస్తుంది. అదుపుతప్పిన వ్యాన్ కూలీలను ఢీ కొట్టి ఎదురుగా ఉన్న లారీలు తప్పించాడు. ఈ సంఘటనను చూసిన స్థానికులు కన్నీరు మున్నీరై విలపించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... నక్కపల్లి పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన బద్ద సత్యవతి (45), ఏనుగుపల్లి సత్యవతి యాదగిరి చిననూకమ్మ తదితరులులు సోమవారం ఉదయం ఇంటి దగ్గర నుంచి అడ్డురోడ్డు వైపు వెళ్లే రహదారిలో ఉపాధి పనులు కోసం కాలినడకన వెళ్తున్నారు. అదే రహదారిలో వెనుక నుంచి అదుపుతప్పిన పార్సిల్ వ్యాను రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న వారిపై దూసుకు వెళ్ళింది ఆ దూసుకు వెళ్ళిన సంఘటనలో ముగ్గురు ఎగిరిపడ్డారు . ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బద్ద సత్యవతి(50), తో పాటు యాదగిరి చిన నూకమ్మ, ఏనుగుపల్లి సత్యవతి లను అక్కడే ఉన్న సాటి కూలీలు గ్రామస్తులు దగ్గర్లో ఉన్న 50 పడకల ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ,రాజు, మేడేటి శంకర్ , పలువురు దళిత సంఘం నాయకులు చేరుకొని కుటుంబ సభ్యులు ఓదార్చి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీ కు తరలించారు. బద్ద సత్యవతి మార్గమధ్యలోకి వెళ్లేటప్పటికీ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ జూరెడ్డి మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరాన్‌పై అమెరికా దాడుల ప్రభావం..

విశాఖలో పెట్రోల్ కొరత, -బంకుల వద్ద భారీ క్యూలు

(ప్రభాతవార్త -విశాఖపట్నం)

అంతర్జాతీయ పరిణామాల ప్రభావం నగర జీవనంపై స్పష్టంగా కనిపిస్తోంది. ఇరాన్‌పై అమెరికా దాడుల నేపథ్యంలో చమురు సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండటంతో విశాఖపట్నంలో పెట్రోల్ కొరత నెలకొంది. దీంతో నగరంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరుతున్నారు. ఉదయం వేళల నుంచే బంకుల వద్దకు చేరుకున్న వాహనదారులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని బంకుల్లో నిల్వలు పూర్తిగా ఖాళీ కావడంతో 'స్టాక్ లేదు' బోర్డులు ఏర్పాటు చేయగా, మరికొన్ని చోట్ల పరిమిత పరిమాణంలో మాత్రమే ఇంధనం అందిస్తున్నారు. దీంతో వాహనదారులు ఒక బంకు నుంచి మరో బంకుకు తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లాల్సిన ప్రజలు ఈ పరిస్థితితో ఆందోళన చెందుతున్నారు. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, సరకు రవాణాపై ఆధారపడే వ్యాపార వర్గాలు కూడా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ పెరిగి రాకపోకలు మందగించినట్లు సమాచారం. అంతర్జాతీయ స్థాయిలో చమురు సరఫరా వ్యవస్థలో వచ్చిన మార్పులు, రవాణా అంతరాయాలు ఈ పరిస్థితికి కారణమని నిపుణులు భావిస్తున్నారు. అయితే పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు, సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వాహనదారులు అవసరమైన మేరకే ఇంధనం వినియోగించాలని, ఆందోళనకు గురికాకుండా సహకరించాలని అధికారులు సూచించారు. త్వరలోనే పరిస్థితి సద్దుమణుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏయూ శతాబ్ధి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు

ong-10_ong-10.qxd 4/27/2026 11:40 PM Page 1

పెట్రోల్ బంకులపై జిల్లా కలెక్టర్, ఎస్పి ఆకస్మిక తనిఖీ

- జిల్లాలో ఏ బంకు లోనూ పెట్రోల్, డీజిల్ ఆయిల్ కొరత తలెత్తకూడదు
జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

అనకాపల్లి, ఏప్రిల్ 27 (ప్రభాతవార్త):
జిల్లాలోని బంక్ లలో పెట్రోల్, డీజిల్ ఆయిల్ కొరత పరిస్థితి తలెత్తకుండా ట్యాంకర్లు బంకులకు పంపేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న పెట్రోల్ బంకులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం అనకాపల్లి బైపాస్ రోడ్ లో గల ఇండియన్ ఆయిల్ బంక్ శ్రీ శివరామ ఏజెన్సీస్ , డైట్ కాలేజ్ దగ్గర గల భారత్ పెట్రోలియం బంక్ లను, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ లతో కలసి జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయిని స్పష్టం చేశారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని వాహనదారులు ఆందోళనకు గురి కావద్దని తెలిపారు. జిల్లాలోని ఉన్న పెట్రోల్ బంకులను తనిఖీ చేయడానికి టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పెట్రోల్ బంకులలో పెట్రోల్, డీజిల్ తగినంత నిల్వలు ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిం

చాలన్నారు. జిల్లాలో ప్రతి బంక్ లోను పెట్రోల్, డీజిల్ నిల్వలు పూర్తిగా అయిపోకుండా, ఆయిల్ నిల్వలను ముందుగానే గుర్తించి వెంటనే ట్యాంకర్లు ఇండెంట్ చేసి బంకులకు చేరుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బంకుల యాజమాన్యం కృత్రిమ కొరత సృష్టించినా, బ్లాక్ మార్కెటింగ్ పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ విషయంలో జిల్లాలో ఉన్న

పెట్రోల్ బంకుల యాజమాన్యం సహకరించాలని తెలిపారు. అదే విధంగా పెట్రోల్ వినియోగదారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి బంకు లలో పెట్రోల్ లభ్యతపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కె వి ఎల్ ఎన్ మూర్తి, అనకాపల్లి తాసిల్దార్ ఆనంద్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి జాతర

(ఎస్ రాయవరం ఏప్రిల్ 27 ప్రభాతవార్త)

మండలంలో లింగరాజు పాలెం గ్రామం సమీపంలో బసపాడు గ్రామంలో సోమవారం గంగమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు ఆలయం నకు చేరుకొని అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదం స్వీకరించారు.సాయంత్రం అమ్మవారి ఉత్స వ మూర్తిలను గరగాలతో పురవీధుల్లో డబ్బులు పలు సాంస్కృతి కార్యక్రమాలతో శక్తి వేషాలుల తో అమ్మవారిని ఊరేగించారు. ఈ.కార్యక్రమానికి పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ముత్యాల రాము, కశింకోట ఆనందరావు,వై.శివ,అప్పారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

అనకాపల్లి, ఏప్రిల్ 27 (ప్రభాతవార్త):

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేసారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పెట్రోల్, డీజిల్ సరఫరా పరిస్థితులపై డీలర్లు , అసోసియేషన్ ప్రతినిధులు, బంక్ యజమానులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిలాల్లోని అన్ని పెట్రోల్ బంకుల్లో తగినంత నిల్వలు ఉన్నాయని, సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు అనవసరంగా భయపడకుండా, అపోహలు నమ్మకుండా సాధారణంగా ఇంధనం వినియోగించాలని సూచించారు. ఆయిల్ డిపోల నుంచి రిటైల్ బంకులకు ఎలాంటి జాప్యం లేకుండా ఆయిల్ ట్యాంకర్లు చేరుకునే విధంగా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సుబ్బలక్ష్మీ, జిల్లా పౌర సరఫరాల అధికారి మూర్తి, ఆర్డిఓ రమణ, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

ఆ.. కాలనీకి మంచినీటిని అందించేందుకు ముందుకు వచ్చిన మిట్టల్ స్టీల్‌ప్లాంట్, హెట్టిరో యాజమాన్యం..

- దగ్గరుండి సరఫరా చేస్తున్న కార్యదర్శి "రాజశేఖర్"!

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని చందనాడ గ్రామపంచాయతీ శివారు గ్రామమైన జగనన్న కాలనీ నందు త్రాగునీటి సమస్య లేకుండా పూర్తిస్థాయిలో మంచినీటిని అందించేందుకు మిట్టల్ స్టీల్ ప్లాంట్ ,హెట్టిరో యాజమాన్యాలు ముందుకు వచ్చాయి. గత కొద్దిరోజులు జగనన్న కాలనీకి తాగడానికి మంచినీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ గ్రామస్తులు ఆందోళనకు దిగిన విషయం పాఠకులకు తెలిసినదే.! ఈ విషయంపై స్పందించిన ఎంపీడీవో కే. చలపతిరావు, గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపిడిఓ గిరిజ జ్యోతి, గ్రామీణ నీటిపారుదల శాఖ జేఈ శివ నాగప్రసాద్‌లు ముందుకొచ్చి పరిశ్రమల యజమానులతో మాట్లాడారు. స్పందించిన యాజమాన్యాలు పది రోజులు పాటు మినరల్ వాటర్ అందించేందుకు ముందుకు వచ్చారు. ఆ విధంగా కాలనీవాసులకు ట్యాంకర్ ద్వారా మంచి నీటిని సరఫరా చేసేందుకు ముందుకు రావడంతో కార్యదర్శి పివిపి రాజశేఖర్ దగ్గరుండి సరఫరా చేశారు. ఐదువేల లీటర్లతో నీటి సరఫరా ప్రత్యేకమైన వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నామని అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని రాజశేఖర్ తెలిపారు. స్టీల్ ప్లాంట్,హెటిరో కంపెనీలు ఆర్వో మినరల్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నారని ఈ మేరకు తెలిపారు.

పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం జనసేన కార్యకర్తలు ప్రత్యేక పూజలు

(ఎస్. రాయవరం ,ప్రభాతవార్త)

మండల కేంద్రమైన ఎస్. రాయవరం గ్రామంలో శ్రీ బుర్రేశ్వర స్వామి శివాలయం లో సోమవారం జనసేనపార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని జనసేన పార్టీ ఎస్ .రాయవరం మండలం యూత్ అధ్యక్షుడు లింగంపల్లి జ్యోతి కుమార్ ఆధ్వర్యంలో శివాలయం అభిషేకములు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు,జనసేన పార్టీ అధినేత శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టాలని శివాలయంలో 108 కొబ్బరికాయలు స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వీసం సాయి, ఉప్పరాపల్లి జనసేన అధ్యక్షులు తేటకాలి అరవింద్,జంగులూరు జనసేన అధ్యక్షులు గొర్లి సతీష్, పెదగుమ్ములూరు జనసేన అధ్యక్షులు బొడ్డా నవీన్, వేమగిరి జనసేన నాయకులు అల్లం నరసింగరావు(బాబు) జనసేన నాయకులు కర్రీ నాని,కొంకుపూడి స్వామి,వీర్ల శేఖర్,కర్రీ శేఖర్,జాగు భాను,అంగినా కోటి, జనసైనికులుతదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేత ఆడారి జగన్నాధరావు అకాల మృతి

అనకాపల్లి రూరల్ ఏప్రిల్ 27 (ప్రభాతవార్త)

తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త ఆడారి జగన్నాధరావు (68) అకాల మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటూ సోమవారం మధ్యాహ్నం స్వర్గస్తులయ్యారు. భార్య, ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. ఆయన అంతిమయాత్ర 28వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు మా స్వగృహము నుండి బయలుదేరుతుందని వారు పెద్ద కుమారుడు ఆడారి రాజేంద్ర తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి.!

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని వేంపాడు జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు ఎలమంచిలి పట్నంలోని రామ్‌నగర్‌కి చెందిన పూడి వెంకటశేఖర్(40) కాకినాడ జిల్లా తుని మండలం తలుపు లమ్మ లోవ నుంచి బైక్ పై ఎలమంచిలి వైపు వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై సన్నీ బాబు సంఘటన స్థలానికి చేరుకొని మృతుడి వివరాలు సేకరించారు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో జాబ్ మేళా క్యాలెండర్ విడుదల

- యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు
- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

అనకాపల్లి ఏప్రిల్ 27 (ప్రభాతవార్త)

జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా క్యాలెండర్‌ను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గతంలో నిర్వహించిన జాబ్ మేళాల్లో రాష్ట్రంలోనే మన జిల్లాలో అత్యధిక సంఖ్యలో నియామకాలు జరిగినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ విజయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ సంవత్సరం మరింత విస్తృత స్థాయిలో జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ మండల కేంద్రాల్లో నిర్దిష్ట తేదీల ప్రకారం మేళాలు నిర్వహించబడతాయన్నారు. ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఖాళీ ఉన్న ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయన్నారు. అర్హత గల అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తదితర పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఈ మేళాల ద్వారా యువతకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలి: సీఐ ప్రేమకుమార్

అనకాపల్లి రూరల్ ఏప్రిల్ 27 :(ప్రభాతవార్త)

పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారి తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహిస్తే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పట్టణ సీఐ ప్రేమ కుమార్ ఆకాంక్షించారు. అనకాపల్లిలో వీల్స్ ఆఫ్ ఫైర్స్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 5వ ఛాంపియన్‌షిప్ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 200 మందికి పైగా స్కేటర్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పట్టణ సీఐ ప్రేమ కుమార్ పిన్న వయస్సు క్రీడాకారులు అందరూ ఉత్సాహంగా ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందించి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ టి సి చైర్మన్ కరణం గంగాధర్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పలక రవి క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జల్సా ఖర్చుల కోసం దొంగతనాలు..

- పోలీసులకు చిక్కిన ప్రేమ జంట

అనకాపల్లి రూరల్ ఏప్రిల్ 27 (ప్రభాతవార్త)

జల్సా ఖర్చులకు అలవాటు పడిన ఒక ప్రేమ జంట పలు ఇండ్లలో దొంగతనాలు చేస్తూ అందిన కాడికి దోచుకుంటూ వాటితో జల్సాగా తిరుగుతూ సోమవారం పట్టణ పోలీసులకు చిక్కారు. ఇందు సంబంధించి వివరాలు డిఎస్పి ఎం శ్రావణి విలేకరులకు తెలియజేశారు. గాజువాక కనితి వడ్లపూడి ప్రాంతానికి చెందిన కాండ్రేగుల లోకనాథ వీరసాయి శ్రీనివాస్ (23), చోడవరం మండలం ముద్దుర్తి గ్రామానికి చెందిన గెద్దాడ మేరీ (23) వీరిద్దరూ ప్రేమజంటగా మెలుగుతూ వారి జల్సా ఖర్చులు కోసం దొంగతనాలకు పాల్పడ్డారు. అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో స్థానిక గాంధీ నగరంలో ఈనెల 22న రాత్రి ఒక ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. అదే రోజు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పిసినిగాడ గ్రామంలో చోరీకి పాల్పడ్డారు. అంతకుముందు చోడవరం లో చోరీకి పాల్పడ్డారు. ఈ మూడు ప్రాంతాల్లో వరస చోరీలు జరగడంతో ఆయా పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసు విషయంలో పోలీసులు తమదైన శైలిలో దర్యాప్తులో భాగంగా సోమవారం తుమ్మపాల ఏలేరు కాలువ సమీపంలో ప్రేమ జంట పోలీసులకు చిక్కారు. వారి వద్ద నుండి 106.340 మిల్లీగ్రాములు బంగారం వస్తువులు, 148.30 మిల్లీ గ్రాములు వెండి, 3500/ నగదు, రెండు సెల్ ఫోన్లు, ఒక స్కూటీ నీ స్వాధీనం చేసుకున్నట్లు డి.ఎస్.పి శ్రావణి తెలిపారు. లోకనాథం వీర సాయి శ్రీనివాస్ పై ఇప్పటికే దువ్వాడ పోలీస్ స్టేషన్లో రెండు గంజాయి కేసులు కొట్లాట కేసు, రౌడీ షీటర్ గా కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో పోలీసులు చూపిన చొరవ పై పట్టణ సీఐ జి ప్రేమ్ కుమార్, ఆయనకు సహకరించిన పోలీస్ సిబ్బందిని డీఎస్పీ శ్రావణి అభినందించారు.

అనకాపల్లిలో ఎస్సీ, ఎస్టీ సోలారైజేషన్ పనులు ప్రారంభం

- నాలుగు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించిన ఎస్ఈ ప్రసాదరావు

అనకాపల్లి రూరల్ ఏప్రిల్ 27 (ప్రభాతవార్త):

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్సీ, ఎస్టీ సోలారైజేషన్ పథకంలో భాగంగా అనకాపల్లి జిల్లాలో మరో కీలక అడుగు పడింది. కసింకోట డివిజన్, కొత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని తుమ్మపాల సెక్షన్ గ్రామాల కోసం నూతనంగా మంజూరైన నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అనకాపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ జి. ప్రసాదరావు సోమవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీలకు మెరుగైన విద్యుత్ సౌకర్యాలు కల్పించడంతో పాటు, సోలారైజేషన్ ప్రక్రియ ద్వారా వారికి గరిష్ట లబ్ధి చేకూర్చడమే ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశమని వివరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల ఆయా గ్రామాల్లో విద్యుత్ లోవోల్టేజీ సమస్యలు తొలగి, వినియోగదారులకు నాణ్యమైన , అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో డి.ఇ (టెక్నికల్) జైనుల్ల, డి.ఇ (కన్స్ట్రక్షన్) యు.కె.జి. ప్రసాద్, కసింకోట డివిజన్ డి.ఇ ఎ. మురళీకృష్ణ, ఏ.డి.ఇ కాశీ బాబు, ఏ.ఈ శ్రీమతి మనోజ ఉన్నారు. వీరితో పాటు కొత్తూరు ఏ.డి.ఇ నిరీక్షణ్, ఏ.ఈ బి. వీరేంద్ర, జె.ఈ కె.డి.వి. కోటేశ్వరరావు, తుమ్మపాల సెక్షన్ విద్యుత్ శాఖ సిబ్బంది ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

మహిళల భద్రతపై అవగాహన

- బ్రాండిక్స్ యూనిట్1లో కార్యక్రమం

(అచ్చుతాపురం ఏప్రిల్ 27 ప్రభాతవార్త)

అచ్చుతాపురం మహిళలపై నేరాల నివారణ, భద్రతపై అవగాహన పెంపొందించేం దుకు అచ్చుతాపురం పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బ్రాండిక్స్ అప్పారెల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ – యూనిట్ 1లో పనిచేస్తున్న 1,229 మంది మహిళా ఉద్యోగుల కోసం ఈ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్ రావు, ఎస్ఐ కె. సుధాకర్ రావు, జిల్లా వన్ స్టాప్ సెంటర్ కోఆర్డినేటర్ మంజులవాణి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ బృందం పాల్గొన్నారు. మహిళల భద్రత, చట్టపరమైన హక్కులు, నేరాల నివారణ చర్యలపై వారు విపులంగా వివరించారు. ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించడం, అత్యవసర సమయాల్లో సహాయం ఎలా పొందాలి, హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగం, స్వీయ రక్షణ పద్ధతులపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యాలయాల్లో సురక్షిత వాతావరణం ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలను కూడా వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళా ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు, తమ హక్కులపై స్పష్టమైన అవగాహన కలిగించడమే లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి పనులు నిలిపివేతపై కూలీల ఆందోళన

(అచ్చుతాపురం ఏప్రిల్ 27 ప్రభాతవార్త)

అచ్యుతాపురం ఉప్పవరం గ్రామంలో ఉపాధి హామీ పనులు నిలిపివేయడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిబ్రవరిలో ఒక వారం, ఏప్రిల్‌లో రెండు వారాలు మాత్రమే పనులు కల్పించి, ఆపై అకస్మాత్తుగా నిలిపివేయడం వల్ల కూలీలు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను నిరసిస్తూ కూలీలు సోమవారం అచ్యుతాపురం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి, ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ చిన్ని శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్. రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించిన గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం పనిని కల్పించాలి లేదా నిరుద్యోగ భృతి ఇవ్వాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 150 రోజుల ఉపాధి హామీ ఇస్తామని చెబుతున్నప్పటికీ, అమలులో 50 రోజులకే పరిమితం అవుతోందని విమర్శించారు. వెంటనే ఉప్పవరం గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించి కూలీలను ఆదుకోవాలని, సంవత్సరానికి 200 రోజుల పని, రోజుకు రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో మరియు ఉపాధి పథకం అధికారులు రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో చిన్ని సోమేశ్వరరావు, కాయల సూర్యమణి, సుధా తాతబ్బాయి, సునీత, గండేపల్లి అప్పారావు తదితర ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత: 54 ఫిర్యాదుల స్వీకరణ

అనకాపల్లి, ఏప్రిల్ 27 (ప్రభాతవార్త)

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, వారికి భరోసా కల్పించడమే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీసులు పని చేస్తున్నారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో బాధితుల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 54 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో చీటింగ్ , ఆర్థిక నేరాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, అధిక వడ్డీ ఆశచూపి నగదు కాజేయడం, ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించినట్లుగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఆదేశాలు జారీ చేస్తూ ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా చీటింగ్ కేసుల్లో నిందితులను త్వరగా గుర్తించి, ప్రతి ఫిర్యాదుపై 7 రోజుల్లోపు సమగ్ర విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా, కేవలం వాస్తవాల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.బాధితులకు తమ ఫిర్యాదుపై చేపట్టిన చర్యల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారికి భరోసా కల్పించాలన్నారు. విచారణ అనంతరం తీసుకున్న చర్యల నివేదికను తప్పనిసరిగా జిల్లా కార్యాలయానికి సమర్పించాలి. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన న్యాయం అందించడమే పోలీసు యంత్రాంగం ప్రధాన బాధ్యత. ముఖ్యంగా అమాయక ప్రజలను ఆర్థికంగా మోసం చేసే చీటింగ్ రాయుళ్లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అనకాపల్లి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి డీఎస్పీ జీ.ఆర్.ఆర్.మోహన్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

నూకాంబికని దర్శించుకున్న రమ్యానంద భారతి

అనకాపల్లి ఏప్రిల్ 27 (ప్రభాతవార్త)

ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు రాష్ట్ర పండుగ గుర్తింపు పొందిన అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో సోమవారం తిరుపతి శ్రీ శక్తి పీఠం ధర్మ ప్రచార యాత్రలో భాగంగా మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాధిశ్వరి, మాతాజీ రమ్యానంద భారతి స్వామి నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమెను ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారికి దర్శించుకొని మాతాజీ ప్రత్యేక పూజల నిర్వహించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పర్యటనకు వస్తే ముందుగా శ్రీ నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటానని సంకల్పం చేశానని దానిలో భాగంగా

అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందని ఆమె తెలియజేశారు. ఆలయ పునర్నిర్మాణం బాగా నిర్మించారని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళ శ్రీధర్, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

అరకులోయలో ఘనంగా శ్రీ వెంకన్న పెండ్లి మాటలు

మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలు

అరకులోయ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

అరకలోయ లో ఘనంగా శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. పుట్ట మన్ను సేకరణ కార్యక్రమంతో అంగరంగ వైభవంగా ప్రారంభమైన స్వామివారి కల్యాణ మహోత్సవాలు, ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఘనంగా జరగనున్నాయి. దీనిలో భాగంగా సోమవారం శ్రీ వెంకన్న పెండ్లి మాటలు స్థానిక సర్వసిద్ధి వెంకటరావు (నాని) నాగమణి దంపతుల ఇంటి వద్ద వేద పండితులు బాల గణేష్ మంత్రార్చన ల మధ్య కన్నుల పండగగా జరిగింది. స్వామివారి దేవాలయం నుండి శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి, అలివేలుమంగా, పద్మావతి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆడపెళ్ళి వారి ఇంటి వద్దకు తీసుకువెళ్లి పెండ్లి మాటలు జరిపి, అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి, అలివేలు మంగ పద్మావతి అమ్మవారుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ నాయకులు చైర్మన్ సివేరి బాలకృష్ణ, అప్పు, కామేష్, రామారావు, చందు పాడి, పైడిరాజు, అర్జున్, సంజు, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ లు కాపుగంటి కృష్ణారావు, అప్పల రాం, నాయకులు రంగా, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి

బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు : జిల్లా కలెక్టర్ టి. నిశాంతి

పాడేరు,ఏప్రిల్27,ప్రభాతవార్త

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న అన్ని పెట్రోల్ బంకులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టడం జరుగుతుందని అందులో బాగంగా సోమ వారం పాడేరు అంబేద్కర్ జంక్షన్ వద్ద ఉన్న భారత పెట్రోలియం బంకను జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తో కలిసి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లడుతూ జిల్లా లో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయిని స్పష్టం చేశారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని వాహనదారులు ఆందోళనకు గురి కావద్దని తెలిపారు జిల్లాలోని ఉన్న (22) పెట్రోల్ బంకులను తనిఖీ చేయడానికి రెవెన్యూ, పోలీస్, పౌరసరఫరాలు, తూనికలు కొలతలు విభాగాలతో కూడిన టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. బాంకుల యాజమాన్యం కృత్రిమ కొరత సృష్టించినా, బ్లాక్ మార్కెటింగ్ పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ విషయంలో జిల్లాలో ఉన్న పెట్రోల్ బంకుల యాజమాన్యం సహకరించాలని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో రెవిన్యూ, పోలీసు, పౌర సరఫరాల శాఖా సిబ్బందితో కూడిన ఒక నియంత్రణ గది కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని పెట్రోల్, డీజిల్ సరఫరా విషయంలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే టోల్ ఫ్రీ నెంబర్ 08935293448 నంబర్ కు కాల్ చేసి సంప్రదించాలన్నారు . ఎక్కడైనా ఇంధన కొరత ఉన్నా, లేదా ఇబ్బందులు ఎదురైనా పై నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చాన్నారు. పెట్రోల్ బంకుల్లో కేవలం వాహనాలకు మాత్రమే ఇంధనం పోయాలని , విడిగా డబ్బాల్లో పోయకూడదని ఆదేశించారు. ద్విచక్ర మరియు నాలుగు చక్రాల వాహనాలకు నిర్దిష్ట పరిమితిలో మాత్రమే ఇంధనం అందించాలని సూచించారు. బంకుల వద్ద పరిస్థితిని పర్యవేక్షించడానికి సిసిటివి కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేవని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వి మోహన్, పెట్రోల్ బంక్ యాజమాన్యం మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జీవితం ఆదర్శనీయం

ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ టి. నిశాంతి

పాడేరు,ఏప్రిల్ 27,ప్రభాతవార్త:

అమరావతిని రాజధానిగా చేసుకొని కృష్ణా, గుంటూరు ప్రాంతాలను పాలించిన గొప్ప జమీందారు వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడని జిల్లా కలెక్టర్ నిషాంతి.టి కొనియాడారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పాలనాదక్షుడైన వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ధర్మ పరాయణుడిగా, దేవాలయాల నిర్మాతగా తెలుగు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన జీవిత కాలంలో 100 కు పైగా దేవాలయాలను నిర్మించి, పునరుద్ధరించి అమరావతి పట్టణ ప్రభు, చాళుక్య నారాయణ వంటి బిరుదులు పొందారన్నారు. ఆయన సేవలు నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ రెవెన్యూ అధికారి(ఎఫ్ ఏసీ)ఎమ్ వి ఎస్ లోకేశ్వరరావు, కెఆర్ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలకంఠరావు, కలెక్టరేట్ పరిపాలనా అధికారి ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మాతు నాయుడు, జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వి రామకృష్ణంరాజు, మద్యపాన నిషేధం ఎక్సైజ్ శాఖ అధికారి ఆర్ గౌరీశ్వరరావు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు ప్రభుత్వ ఫలాలు తప్పనిసరిగా అందాలి

కప్ కాఫీ శాంపిల్స్ వేగవంతంగా నిర్వహించండి -ఐటీడీఏ పి వి టి జి సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వెంకటేశ్వర్లు

పాడేరు,ఏప్రిల్27,ప్రభాతవార్త:

పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సోమవారం కాఫీ సాగుపై ప్రత్యేక ఐ టి డి ఏ సమావేశ మందిరం లో సమస్యల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాఫీ సాగు విస్తరణ, అభివృద్ధి మరియు రైతుల సంక్షేమంపై కీలక అంశాలను చర్చించారు. కాఫీ సాగును లాభసాటిగా మార్చడం మరియు రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. కొత్త కాఫీ తోటలు పెంపకం మరియు పాత తోటల పునరుద్ధరణ పనుల పురోగతిపై ఆరా తీసారు. కొత్తగా కాఫీ తోటలు వేయదలచిన రైతులకు భూమి తయారీ, మొక్కల మధ్య దూరం మరియు నీడ నిచ్చే చెట్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. నాణ్యమైన కాఫీ గింజల ఎంపిక నుండి నర్సరీల పెంపకం వరకు శాస్త్రీయ పద్ధతుల పాటించాలని అధికారులు సూచించారు. ఆరోగ్యవంతమైన మొక్కల ద్వారానే అధిక దిగుబడి సాధ్యమని పేర్కొన్నారు. భూమిలోని పోషక విలువల ఆధారంగా ఎరువులు వేయడం వల్ల ఖర్చు తగ్గుతుందని, అందుకే ప్రతి రైతు తమ తోటలోని మట్టి నమూనాలను పరీక్షించేందుకు 'కప్ కాఫీ శాంపిల్స్' సేకరించి పరీక్షా కేంద్రాలకు పంపాలని కోరారు. కాఫీ రైతులకు ప్రభుత్వ ఫలాలను అందించేందుకు మొబైల్ యాప్ ద్వారా రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని కాఫీ అధికారులను ఆదేశించారు. ఉత్తమ సాగు పద్ధతులను ప్రదర్శించడానికి ఎంపిక చేసిన ప్రాంతాల్లో డెమో ప్లాట్స్ ఏర్పాటు చేసి, రైతులకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కాఫీ గింజలకు పట్టే 'బెర్రీ బోరర్' పురుగు వల్ల రైతులు నష్టపోతున్నారు ఉండాలని, అధికారులు దానిపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ డైరెక్టర్ (కాఫీ) ఎల్. బొంజు బాబు, కాఫీ బోర్డు సీనియర్ లైజన్ ఆఫీసర్,ఎస్ రమేష్, కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ (రీసెర్చ్) సునీల్, జూనియర్ లైజన్ ఆఫీసర్లు, కాఫీ విభాగపు క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు నిల్వలపై అధికారుల తనిఖీ

గూడెం కొత్తవీధి ఏప్రిల్ 27 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకును సోమవారం స్థానిక అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఎస్సై సురేష్ బంకును సందర్శించి పెట్రోల్, డీజిల్ నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులు బంక్ మేనేజర్ రాజాబాబు, ఇన్చార్జ్‌తో మాట్లాడారు. ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.వారు మాట్లాడుతూ, బంకులో పెట్రోల్ మరియు డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని స్పష్టం చేశారు. బంకు కొరతపై వాహనదారులు ఎటువంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదని, బంక్ యథావిధిగా సేవలు అందిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

పెట్రోల్ బంకులో ముమ్మర తనిఖీ

డుంబ్రిగుడ: ఏప్రిల్ 27 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని పెట్రోల్ బంకులో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ త్రివేణి తనిఖీలు చేపట్టారు. పెట్రోల్, డీజిల్ తక్కువ నిల్వలు తక్కువ ఉన్నప్పుడు వ్యవసాయ, వాహన దారులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. నిల్వలు బ్లాక్ మార్కెట్కు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. వాహనదారులు రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేవిధంగా బంకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. సమాంతర పెట్రోల్ పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. డబ్బాలు, క్యాన్లు, బాటిల్స్లు పెట్రోల్ నిషేధించాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్ బంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'మీకోసం'

డుంబ్రిగుడ ఏప్రిల్ 27 ప్రభాతవార్త

గిరిజన సమస్యల పరిష్కారానికే మీ కోసం వేదికగా నిలుస్తోందని తహసీల్దార్ త్రివేణి చెప్పారు. మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీ కోసం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. లైగండలో రచ్చబండ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, పోతంగి పంచాయతీ ఆంత్రిగుడ గ్రామంలో విద్యుత్తు స్తంభాల మార్పుకు చర్యలు చేపట్టాలని గిరిజనులు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలోఎంపీడీఓ విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వృక్ష శాస్త్ర పర్యటన జరిపిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినీలు

అరకులోయ, ఏప్రిల్ 27, ప్రభాత వార్త

అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినీలకు సోమవారం కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి. చలపతిరావు ఆదేశాల మేరకు బోటనీ విభాగం ఆధ్వర్యంలో వృక్ష శాస్త్ర పర్యటన (బొటానికల్ టూర్) నిర్వహించారు. టూర్‌లో భాగంగా విద్యార్థినీలు సుంకరమెట్ట సమీపంలోని గాలికొండ తదితర ప్రాంతాలను సందర్శించి, పలు రకాల ఔషధ మొక్కలను తిలకించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ బొటానికల్ టూర్ విద్యార్థినీలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. పుస్తకాలలో చదివే విషయాలను ప్రకృతిలో ప్రత్యక్షంగా చూడడం ద్వారా మరింత అవగాహన పెరుగుతుందని చెప్పారు. వృక్ష శాస్త్ర పర్యటన ద్వారా వివిధ రకాల మొక్కలు, ఔషధ మొక్కల ప్రాముఖ్యత, వాటి వాడుకల గురించి నేర్చుకోవచ్చున్నారు. ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యత అని గుర్తుంచుకోవాలి అని విద్యార్థులకు తెలియజేశారు. బొటనీ అధ్యాపకులు డాక్టర్ సి.హెచ్. మురళి కృష్ణ విద్యార్థులకు ప్రత్యక్షంగా మొక్కలను చూపిస్తూ నేటముల ప్లాంట్ అనేది సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వినిపించే లోకల్ పేరు లొల్లోడు తీగ, విత్తనాలను ఎండబెట్టి ఉడికించుకొని ఆదివాసులు తినడమే కాకుండా నూనెను కూడా సేకరించుకుంటారని, ఇది కీళ్ల నొప్పుల నివారణకు ఉపయోగపడుతుందని చెప్పారు. టూర్‌లో భాగంగా పలు రకాల ఔషధ మొక్కల ను విద్యార్థినిలకు స్వయంగా చూపించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. బోటనీ అధ్యాపకురాలు ఎన్. శ్రావణి విద్యార్థులకు ప్రత్యక్షంగా ఫెర్న్ మొక్కలను చూపిస్తూ పువ్వులు, విత్తనాలు లేని ఇవి పురాతన వాస్కులర్ మొక్కలని, ఇవి బీజాంశాల ద్వారా పునరుత్పత్తి చెందుతాయని, నీడ, తేమతో కూడిన ప్రదేశాల్లో బాగా పెరుగుతాయని తెలియజేశారు. అలాగే ఆరోగ్యానికి ఉపయోగపడే పలు ఔషధ మొక్కల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినిలు మాట్లాడుతూ విద్యార్థులు బొటానికల్ పర్యటన కు వెళ్లటం చాలా సంతోషంగా ఉందని, పుస్తకాలలో మాత్రమే చూసిన మొక్కలను ప్రత్యక్షంగా చూసే అవకాశం టూర్ ద్వారా లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రకృతి మధ్యలో మొక్కల నిర్మాణం, ఆకులు, పువ్వులు, వేర్ల గురించి తెలుసుకోవడం చాలా ఆసక్తికరంగా అనిపించిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్.ఎస్.ఎస్. పి.ఓ కే .బాలరాజు, అధ్యాపకులు ఎన్. నాగేశ్వరరావు, డి.కె.వి. ఎస్. ప్రణీత , ఎం. రోజా రాణి, బి. సరస్వతి,కే.అఖిల్ తేజ, పి. శోభన్, కే.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

28,29 తేదీల్లో ఉపాధ్యాయులు ధృవపత్రాలు పరిశీలన

పాడేరు,ఏప్రిల్27,ప్రభాతవార్త

జనవరి 2026సంవత్సరం పదోన్నతుల నిమిత్తం చాలా మంది ఉపాధ్యాయులు ధ్రువ పత్రాలు పరిశీలన కు హాజరై ఉన్నారనీ అయితే. ఇంకా ఎవరైనా ఉపాధ్యాయులు హాజరుకాకుండా ఉన్నవారు ఉంటే ఈ నెల 28,29 తేదీల్లో పాడేరు గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు కార్యాలయం వద్దకు వచ్చి ధృవ పత్రాలను పరిశీలన చేయించు కొనవలసినదిగా ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడా చిట్టిబాబు, కూడా రాంబాబు సోమవారం పేర్కొన్నారు. ప్రస్తుతం (ఎల్ఎఫ్ ఎల్‌హెచ్ఎం కొరకు మాత్రమే) మిగిలిన పదోన్నతులు ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం తరువాత కల్పించ నున్నారని ఉపాధ్యాయులు గమనించవలసిందిగా అధ్యక్ష,కార్యదర్శులు చిట్టిబాబు, రాంబాబు కోరారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో వైసీపీలోకి భారీ చేరికలు

అరకులోయ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీ పరిధిలో సోమవారం అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం సమక్షంలో వైఎస్ఆర్సిపి పార్టీలోకి భారీ చేరికలు జరిగాయి. మండలం లోని పెదలబుడు గ్రామంతో పాటు పలు గ్రామాలకు చెందిన గిరిజనులు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ అరకులోయ మండలంలో సీఎం దత్తత పంచాయతీ అయిన పెదలబుడు గ్రామం తో పాటు కర్సలగుడ, గరుడగుడ గ్రామాలకు చెందిన సుమారు 60 కుటుంబాల గిరిజనులు వైసీపీలోకి చేరారని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనతో విసిగి చెందిన వారంతా వైఎస్ఆర్సిపి పార్టీలోకి చేరినట్లు చెప్పారు. దీంతో అరకులోయ నియోజకవర్గం లో వైసీపీకి మరింత బలం చేకూరగా, టిడిపి పార్టీ ఖాళీ అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేగం చాణక్య , ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షులు కమిడి అశోక్, వైసీపీ పార్టీ అరకులోయ నియోజక వర్గం బూత్ కమిటీ ఇన్చార్జి పాంగి విజయ్, వైస్ ఎంపీపీ రామన్న, నర్సింగ్, స్వాభి రామ్మూర్తి, సుక్ర, పరుశురాం, నగేష్, కిరణ్ కుమార్, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో కన్నుల పండగగా శ్రీ వెంకన్న కళ్యాణం

అరకు రూరల్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

అరకులోయలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ అలివేలు మంగా, పద్మావతి, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద సోమవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతం గా జరిగింది. ఆలయ వేద పండి తులు బాల గణేష్ మంత్రార్చనల మధ్య స్వామి వారి కళ్యాణం భక్తి శ్రద్దలతో జరిగింది. స్వామివారి కల్యాణ మహోత్సవంలో సుమారు 40 దంపతులు పాల్గొని కళ్యాణాన్ని వైభవంగా జరిపించారు. శ్రీ శ్రీ శ్రీ వెంకన్న కళ్యాణ మహోత్సవంను తిలకించేందుకు, భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దేవాలయంకు చేరుకోవడంతో ప్రాంగణమంతా వెంకన్న నామ స్వరంతో మారుమ్రోగింది. కాగా మూడు రోజులపాటు ఘనంగా జరగనున్న శ్రీ వెంకన్న కళ్యాణ మహోత్సవాలు పుట్ట మన్ను సేకరణ కార్యక్రమంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉండగా కళ్యాణ మహోత్సవంలో భాగంగా ఉదయం స్థానిక సర్వసిద్ధి వెంకటరావు, నాగమణి దంపతుల ఇంటి వద్ద స్వామివారి పెండ్లి మాటలు వైభవంగా జరగాయి. సాయంత్రం దేవాలయం వద్ద శ్రీ వెంకన్న కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. అరకులోయలో ప్రారంభమైన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు, ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యం లో మూడు రోజులపాటు ఘనంగా జరగనున్నాయి. కాక మూడు రోజులపాటు స్థానిక మ్యూజియం గేట్ దగ్గర సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ, ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది.

కాలుష్యం...రహదారుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు బీజేపీ నేతలు వినతి

రహదారుల మరమ్మతులకు రూ. 20 కోట్లు : ఎమ్మెల్యే పల్లా

గాజువాక,ఏప్రిల్ 27,ప్రభాతవార్త

గాజువాకలో కాలుష్య నివారణకు, గుంతలమయ మైన రహదారుల పునరుద్ధరణకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం గాజువాక టీడీపీ కార్యాలయంలో ఆయనను భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణంరెడ్డి నరసింగరావు, మాజీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కలిసి వినతిపత్రం అందజేశారు. కణితి రోడ్డు వై-జంక్షన్ నుంచి చినగంట్యాడ వరకు రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, పోర్టు కాలుష్యాన్ని అరికట్టాలని నేతలు కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఇప్పటికే రూ. 20 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయని, భూగర్భ కేబుల్ పనుల వల్ల కొంత జాప్యం జరుగుతోందని వివరించారు. త్వరలోనే పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు అశోక్, శ్రీను, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం ప్రారంభోత్సవం

పాడేరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

పాడేరు మండలం డి.గొందూరు పంచాయితీ సుకూరు పుట్టు సూర్యనగరంల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ ధర్మా దాయ శాఖ సిజిఎఫ్ నిధులతో నిర్మించిన శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం, శ్రీ గణపతి ఆలయం, శ్రీ సీతారామ ఆలయం, శ్రీ సరస్వతీదేవి ఆలయం, శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయాలు ప్రారంభోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా సోమవారం నిర్వహించారు. శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ధర్మ కర్త కూడా రామకృష్ణ పరమహంస ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రారం భోత్స వాలు శ్రీ విద్యా రాజ హంసబ్రహ్మ శ్రీ శ్రీష్ణ శర్మ చేతుల మీదుగా ప్రారంబించారు. ఈగ్రహాలు పటిష్ట కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరై విజయవంతం చేసారు.

పెదలబుడు చాపురాయి వద్ద వంతెన నిర్మించాలి

మాజీ ఎంపీటీసీ - దురియా సాయిబాబా వినతి

అరకు రూరల్, ఏప్రిల్ 27, ప్రభాత వార్త

అరకులోయ మండలంలోని పెదలబుడు చాపురాయి గెడ్డ వద్ద ప్రభుత్వం తక్షణమే వంతెనను నిర్మించాలని అలాగే అరుకులోయ లోని శరభ గుడ స్మశాన వాటికకు రోడ్డు పరిధిలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ దురియా సాయిబాబా ఆధ్వ ర్యంలో స్థానిక ఎంపీడీవోకి వినతి పత్రం అందించారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మేజర్ పంచాయతీ పెదలబుడు చాపురాయి గెడ్డ (దొబ్బ డోంట్) లో ప్రభుత్వం తక్షణమే వంతెన ను మంజూరు చేయాలని, ఆ ప్రాంతంలో వంతెన లేకపోవడం వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అలాగే శరభ గూడ స్మశాన వాటిక రోడ్డు పరిధిలో వీధి దీపాలు లేక రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకి గురి అవుతున్నారని, రాత్రివేళలో విష పాములు స్మశాన వాటిక పరిధిలో తిరుగుతున్నాయని తెలిపారు. దీనికి ఎంపీడీవో స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కృష్ణ నారాయణ, అకుల, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు పక్కా నిర్మితమైన షాపులకు మాత్రమే టెండర్లు ఆహ్వానం

జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ

పాడేరు,ఏప్రిల్27,ప్రభాతవార్త:

ఏపీఎస్ఆర్టీసీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో పక్కాషాపులు మరియు ఖాళీ స్థలాలు గురించి ఈనెల 7.న తేదీన టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని టెండర్ బాక్స్ ఓపెన్ ఈ నెల28వ తేదీన జరుగుతుందని ప్రచురించడం జరిగినదనీ కొన్ని అనివార్య కారణాల వలన మొత్తం షాపుల సంఖ్య ఎనిమిదిలో నాలుగు పక్కా నిర్మితమైన షాపు లు మాత్రమే టెండర్లు కు ఆహ్వానిస్తునమని జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున టెండర్ లో పాల్గొనే అభ్యర్థులు గమనించి పక్కా షాపులు అయిన పాడేరులో గల షాపు నెంబర్లు (ఒకటి,నాలుగు) మరియు చింతపల్లిలో గల షాపు నెంబర్లు(ఒకటి మరియు రెండు) వాటికి మాత్రమే టెండర్లు తీయబడునని వాటిని మాత్రమే పాడుకున్న వారికి కేటాయించబడుతుందని ఆమె పేర్కొన్నారు. కావున ఈ యొక్క మార్పులను గమనించి విశాఖపట్నం రీజనల్ మేనేజర్ కార్యాలయం, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం నందు హాజరయ్యి టెండర్ లో పక్కా నిర్మితమైన షాపులు గురించి టెండర్ లో హాజరు కావాలని జే సి సూచించారు.

ప్రమాదకర బొంతువలస ఘాట్ రోడ్డు పరిశీలన

గూడెం కొత్తవీధి,ఏప్రిల్ 27,ప్రభాతవార్త

మండలంలోని బూదరాళ్ల--బొంతువలస ఘాట్ రోడ్డుపై ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ హెచ్ అన్నాజీ రావు ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్, పిఆర్ -పిఐయు మండల ఇంజనీరింగ్ అధికారితో కలిసి నాలుగు ప్రమాద ప్రదేశాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా రహదారి భద్రత మెరుగుదలకు పలు చర్యలను గుర్తించారు. మలుపులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రహదారి వెడల్పును పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒక ప్రదేశంలో హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెండు ప్రాంతాల్లో రహదారి ఎత్తును (గ్రేడియంట్) తగ్గించాల్సి ఉందని గుర్తించారు. మరొక ప్రాంతంలో క్రాస్ బ్యారియర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.పరిశీలన ఆధారంగా పూర్తి నివేదికను జిల్లా అధికారులకు సమర్పించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రహదారి భద్రతకు అవసరమైన చర్యలు త్వరలో చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఉపాధి అవకాశాలు కల్పించాలి : జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,ఏప్రిల్27,ప్రభాతవార్త:

నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చుటకు, యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి, ప్రత్యామ్నా యంగా ఉపాధి అవకాశాలను కల్పించే విధముగా ప్రతిపాదనలు తయారు చేయాలని, మద్యపాన నియంత్రణలో ఎక్సైజ్ అధికారులను జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమా వేశం మందిరంలో మద్యపాన నియంత్రణ ఎక్సైజ్, రిజిస్ట్రేషన్స్ స్టాంప్స్, జిల్లా సహకార శాఖ, లీడ్ బ్యాంకు, డిసిసిబి, రవాణా, ప్రజా రవాణా కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా యువతకు ఉజ్వలమైన భవిష్యత్తును, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను అందించుటకు అవగాహనా కార్యక్రమాలు, శిక్షణలు నిర్వహించుటకు ప్రతిపాదనలు తయారు చేయాలని మద్యపాన నిషేధ, ఎక్సైజ్ అధికారులకు సూచించారు. బ్యాంకింగ్ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా, జిల్లాలోని ప్రతి మండలంలో బ్యాంక్ శాఖలు ఉండే విధంగా, బ్యాంకుల సేవల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని, జిల్లాలో అక్షరాస్యత పెరిగే విధంగా అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో పెద్ద యెత్తున లోన్ మేళాలు నిర్వహించి అధిక మొత్తంలో రుణాలు మంజూరయ్యే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. అదేవిధంగా నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి పై ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకు రుణాల ద్వారా ప్రోత్సహించాలి. ఉపాధి కోసం తీసుకున్న రుణాలను, పేరుకుపోయిన మొండి బకాయిలు వసూలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వివిధ ప్రభుత్వ పథకాల నిర్వహణకు శాఖల మధ్య సమన్వయంతో ముందుకు వెళ్లాలని లీడ్ బ్యాంకు వారికి సూచించారు. గిరిజన ప్రాంతంలో చట్టాల నియమ నిబంధనలకు లోబడి రిజిస్ట్రేషన్లు జరగాలని, ఆ విధంగా రిజిస్ట్రేషన్ స్టాంపులు శాఖ పనిచేయాలన్నారు. జిల్లాలో గల ఎన్జీవోలు అన్ని తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రోడ్లపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు విధిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని, ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక సూచికలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు జిల్లా స్థాయిలో రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేసి వాహన సదువులకు అవగాహన చేయాలన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో మౌలిక వసతుల కల్పనకు, సిబ్బంది శిక్షణకు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ప్రజా రవాణా అధికారులను సూచించారు. ఖరీఫ్, రబీ సీజన్లో రైతులను ప్రోత్సహించుటకు, వ్యవసాయ రుణాలు అత్యధికంగా మంజూరు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. బంగారంపై రుణాలు ఇచ్చుటకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. జిల్లా మద్యపాన నియంత్రణ ఎక్సైజ్ శాఖ అధికారి ఆర్.గౌరీశ్వరరావు, జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వి రామకృష్ణంరాజు, జిల్లా రిజిస్ట్రార్ సిహెచ్ నరసింహమూర్తి, జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా రవాణా శాఖ అధికారి ప్రకాష్, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతునాయుడు, జిల్లా ఖజానా శాఖ అధికారి పి. అనిల్ కుమార్, డీసిసిబి మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

30న పాడేరులో అఖిల పక్ష సమావేశం

పాడేరు,ఏప్రిల్27,ప్రభాతవార్త

భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన ఆదివాసీ ప్రజాసంఘాల, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, నిరుద్యోగ సంఘాల నాయకులకు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాడేరు గిరిజన ఉద్యోగుల సంఘ్ భవనంలో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని అల్లూరి జిల్లా అధ్యక్షులు మాసాడ ఈశ్వరరావు,ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో జోన్-1 లో పాడేరు మండలాల పునరుద్ధరణపై, జీవో నెంబర్ 03 రద్దైన జీవో 03 స్థానంలో శాశ్వత షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం రూపకల్పన కోసం ఒత్తిడి. హైడ్రో పవర్ ప్రాజెక్ట్స్ గిరిజన గ్రామాల్లో అక్రమంగా జరుగుతున్న హైడ్రో ప్రాజెక్టుల సర్వేలు మరియు గిరిజన భూముల రక్షణపై చర్చించనున్నారు అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి మాసాడ ఈశ్వరరావు,ముఖి శేషాద్రి తెలిపారు.కావునా అఖిల పక్ష సమావేశానికి ఆయా సంఘాల ప్రతినిధులు విధిగా హాజరు కావాలని వారు కోరారు.

ఇంధనాన్ని చిల్లరగా విక్రయించవద్దు..తాసిల్దార్ వరహాలరావు

ఎలమంచిలి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త: రూరల్ మండలం పరిధిలోగల పెట్రోల్ బంకులను జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు తాసిల్దార్ వరహాలరావు, ఎస్సై ఉపేంద్ర సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బంకులలోని రికార్డులను పరిశీలించి పెట్రోల్ డీజిల్ నిల్వలను పరిశీలించారు. ఇంధనాన్ని చిల్లరగా విక్రయించవద్దని బంకు యాజమాన్యాలను ఆదేశించారు. ముఖ్యంగా కేన్స్, డ్రమ్ములలో ఎటువంటి పరిస్థితుల్లోనూ డీజిల్, పెట్రోల్ విక్రయించరాదని హెచ్చరించారు. బ్లాక్ మార్కెట్ తగిలిపోకుండా చూడాలన్నారు. పెట్రోల్, డీజిల్ విక్రయాలలో పారదర్శంగా వ్యవహరించాలని సూచించారు.

రాజానగరంలో ఉపాధి హామీ పథకం కూలీకి పాము కాటు

- పరామర్శించిన ఎంపిడిఒ లవరాజు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం వెంకటనగరం పంచాయితీ రాజానగరం గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కూలీ పారా సూరిబాబు సోమవారం పాము కాటుకు గురయ్యాడు. గ్రామంలోని వెంకటపతి రాజు చెరువు దగ్గర పనిచేస్తూ ఉండగా ఉదయం ఆరు గంటల ప్రాంతంలో పాము కాటేసింది. వెంటనే అక్కడ సహచర కూలీలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది అత్యవసర చికిత్స నిమిత్తం శ్రీరాంపురంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లి విరుగుడు ఇంజక్షన్ చేయించి వైద్య సిబ్బంది సూచనల మేరకు తుని ఏరియా హాస్పటల్ కు తరలించారు. తుని ఏరియా హాస్పటల్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం సూరిబాబుకు ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. విషయం తెనుసుకున్న ఎంపిడిఒ అడపా లవరాజు తుని ఏరియా హాస్పటల్‌కు వెళ్లి సూరిబాబు పరామర్శించారు. అక్కడ వైద్యులతో మాట్లాడి ప్రస్తుతం జరుగుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

శ్రీ ప్రకాష్‌లో లఘు చిత్రాల ద్వారా మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం వంటి కీలక సమస్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఒక ప్రత్యేకమైన వాహనం ద్వారా లఘుచిత్రాలు ప్రదర్శించి వారికి అవగాహన కల్పించడం కోసం ఏర్పాటు చేయబడిన వాహనం సోమవారం శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలకు చేరింది. సైబర్ నేరాల ప్రమాదాలు, మహిళల హక్కులను పరిరక్షించుకోవాల్సిన ప్రాముఖ్యత, యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల దుర్వినియోగం వంటి విషయాలపై విద్యార్థులకు తెలియజేసి వారిలో చైతన్యం కలిగించడమే ఈ అవగాహన కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. అత్యవసర పరిస్థితుల్లో అధికారులను సంప్రదించాలని వేధింపులు లేదా సైబర్ నేరాలకు సంబంధించిన సంఘటనలను వెంటనే పోలీస్ శాఖ దృష్టికి తీసుకురావాలని ఇందులో వీడియోల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ రామకృష్ణా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీలలో అందిస్తున్న స్వచ్ఛరథం సేవలను సద్వినియోగించుకోండి:డిప్యూటీ ఎంపిడిఓ

(ఎస్. రాయవరం, ప్రభాతవార్త)

మండలంలోని గుర్రాజు పేట, కొరుప్రోలు గ్రామ పంచాయతీలలో అందిస్తున్న స్వచ్ఛ రథం సేవలును సోమవారం డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రా సాధనలో భాగంగా మండలంలో గల అన్ని పంచాయతీలలో షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛ రథం సేవలు ఉంటాయని పంచాయతీ కార్యదర్శిలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.స్వచ్ఛ రథం నిర్వాహకులు ప్రజల వద్ద నుండి పాత సామాన్లు తీసుకుని వాటి విలువ ఆధారంగా ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడం జరుగుతుందని స్వచ్ఛ రథం సేవలపట్ల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సోమవారం 205 కేజీలు పాత సామాన్లు స్వచ్ఛ రథం నిర్వాహకులు సేకరించి ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడం జరిగిందని అయన అన్నారు. అలాగే పారిశుద్ధ్య పనిలో భాగంగా తిమ్మాపురం కస్తూర్బా హాస్టల్ దార్లపూడి బాలిక వసతి గృహం లో ఉన్న చెత్తను తొలగించి, నీరునిల్వ బయటకు పోవడానికి అలాగే పరిసరాలు శుభ్రం పరసడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రసాదు, గంగరాజు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు.!

(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)

జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిఐ జూరెడ్డి మురళి పటిష్టమైన చర్యలు చేపట్టారు. ప్రధానంగా నక్కపల్లి జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రతి జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు (స్టాపర్లు) ఏర్పాటు చేయడంతో పాటు, ప్రమాదాలను నివారించేందుకు రేడియం స్టికర్లు అమర్చిన ఇసుక డ్రమ్స్, టైర్లను కూడా ఏర్పాటు చేశారు. ప్రధానమైన జంక్షన్లో వద్ద ప్రమాదాల నివారణకు ప్రతిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని సీఐ జూరెడ్డి మురళి చెబుతూ వాహనదారులు వేగవంతమైన ప్రయాణాన్ని మానుకోవాలని జంక్షన్ వద్దకు వచ్చేసరికి కొద్దిగా ఆగి ముందుకు వెళ్లాలని కోరారు. ప్రాణం చాలా విలువైనదని ఆ ప్రాణాన్ని రక్షించుకునే విషయంలో ఎదుటివారి ప్రాణాన్ని రక్షించే విషయంలో పూర్తిస్థాయిలో ఆలోచించి వాహనాలను నడపాలని సూచించారు.

పిఎల్ పురంలో సమస్యను తక్షణమే పరిష్కరించాలి

- ఎమ్మార్పీఎస్ నాయకులు మందపల్లి లోవరాజు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట మండలం, పిఎల్ పురంలో మాల, మాదిగల మధ్య తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ యూత్ నాయకులు మందపల్లి లోవరాజు సోమవారం తహసీల్దారు దొంకాడ శాంతి భూషణ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ... భారత మాజీ ఉప ప్రధాని, స్వతంత్ర సమర యోధులు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, ఎస్సీ కాలనీలో ఉన్నటువంటి కమ్యూనిటీ స్థలము, పార్కు స్థలములపై ఇరువురికి సమాన హక్కులు కల్పించాలని గ్రామంలో కొందరు ఉద్రిక్త వాతావరణం నెలకొల్పే విధంగా ఫ్లెక్సీలు ఎదురుగా కర్రలు పాతి పెట్టడం, ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాదిగలు వేసిన పూలమాలను తీసివేయడం సమంజసంకాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, మందపల్లి గురువులు, యమ్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలకు యువకులు బలికావద్దు: సీఐ "మురళి"

(నక్కపల్లి, ప్రభాతవార్త)

పిల్లలు, యువకులు భద్రత చాలా ముఖ్యమని వారిని సైబర్ నేరాలకు దూరంగా ఉంచడంతో పాటు మత్తు పదార్థాలు జోలికి వెళ్లకుండా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని సీఐ జూరెడ్డి మురళి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని చిన్నదొడ్డిగళ్ళు గ్రామంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు 100 రోజుల యాంటీ డ్రగ్ పై అవగాహన కార్యక్రమంలో భాగంగా సీఐ మురళి అద్వర్యం లో తల్లిదండ్రులకు పిల్లల భద్రత, సైబర్ క్రైమ్ పై అవగాహన, రోడ్డు భద్రత వంటి ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానమైన112, 1972, 1930 వంటి అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల ప్రాముఖ్యత గురించి పూర్తిస్థాయిలో వివరించారు. సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్, డ్రగ్స్ వినియోగం, ఫేక్ లోన్ యాప్స్, తెలియని లింకులు, అనధికార థర్డ్ పార్టీ యాప్స్ వల్ల కలిగే హానికర ప్రభావాలపై పూర్తిస్థాయిలో సీఐ మురళి ప్రజలకు అవగాహన కల్పించాము. తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వారికి మంచి భవిష్యత్తు ఇచ్చే విధంగా ఉండాలి తప్ప మన కళ్ళ ముందు పక్క మార్గం పట్టేటట్లు ఉండకూడదని సూచించారు. పిల్లల కదలికలు వారి ఆలోచనలు నిత్యము పరిశీలించి వారు ఒక మంచి మార్గంలో నడిచేటట్లు ఉన్నతమైన ఆలోచన కలగజేయాలని ,ప్రాణం చాలా విలువైనదని, ఆ ప్రాణాన్ని రక్షించుకునేందుకు కొద్దిగా వెనుకకు వెళ్లి ఆలోచిస్తే మంచిదని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని కోరారు. ఒక ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోవాలని నిర్ణయించుకున్న యువకులు ఆ లక్ష్యాలను చేరుకునే విధంగా చెడు మార్గాల వైపు పైనుంచి కుండా ఉన్నతమైన మార్గాల వైపు నడవాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సీఐ కోరారు .ఆయనతోపాటు ఎస్సై సాహిబా అంజుమ్, గ్రామ మహిళా పోలీసులు,మాజీ సర్పంచ్ చంద్రరావు లు ఉన్నారు

డీజిల్ కొరత కారణంగా మండలంలో బంకులను తనిఖీలు నిర్వహించిన తాసిల్దార్ రమేష్ బాబు

(ఎస్ రాయవరం ఏప్రిల్ 27 ప్రభాతవార్త)

డిజిల్ కొరత కారణంగా మండలంలో ఉన్న బంకులను సోమవారం తాసిల్దార్ రమేష్ బాబు తనిఖీలు నిర్వహించారు అడ్డు రోడ్డు పెద్ద గుమ్మలూరు దార్లపూడి గుడివాడ బంకులను తనిఖీ నిర్వహించారు. దార్లపూడి కోనవాని పాలెం బంకుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉంటుందని మంగళవారానికి మిగతా బంకుల్లో అందుబాటులో వచ్చే అవకాశం ఉందని డీజిల్ కొరత కారణంగా నియమ నిబంధన ప్రకారం విక్రయించాలన్నారు.

అనారోగ్యానికి గురైన పేదలకు సీఎం సహాయ నిధి ఒక వరం

అనకాపల్లి ఏప్రిల్ 27 :(ప్రభాతవార్త)

అనారోగ్యానికి గురైన పేదలకు సీఎం సహాయనిధి ఎంతో ఆర్థిక భరోసాను కల్పిస్తుందని అనకాపల్లి జనసేన నియోజకవర్గం ఇంచార్జి బీమరశెట్టి రామ్ కి అన్నారు. అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయం నుండి మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి నియోజకవర్గ చెందిన 8 మంది లబ్ధిదారులకు గాను 2,80,200/ రూపాయిల సీఎం సహాయ నిధి చెక్కును లబ్ధిదారులకు సోమవారం ఆయన జనసేన పార్టీ కార్యాలయంలో స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ఆపరేషన్లు చేయించుకోలేని నిరుపేదలకు, ఖరీదైన వైద్యం పొందలేని రోగులకు కొండంత అండగా, అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలను ఆదుకోవడం కోసమే సీఎం సహాయ నిధి అని అన్నారు. ఈ 22 నెలలకాలంలో అనకాపల్లి నియోజకవర్గంలో వందల మందికి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ సహాయం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు , అనకాపల్లి , కసింకోట మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో - కాసింకోటలో ప్రజలకు అవగాహన కార్యక్రమం

కసింకోట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

కసింకోట గ్రామ పంచాయతీ కార్యాలయంలో "డ్రగ్స్ వద్దు బ్రో" అవగాహన కార్యక్రమం కసింకోట సీఐ అల్లుస్వామి నాయుడు ఆదేశాల మేరకు ఎస్సై కే లక్ష్మణరావు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 30 మంది గ్రామ ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మణ రావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగించారు.

దాడి తల్లి సరే పోలమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా అవాంఛనీయ సంఘటన జరపరాదు

బొబ్బిలి ఏప్రిల్ 27 ప్రభాతవార్త

శ్రీ దాడి తల్లి పాత బొబ్బిలి సరే పోలమ్మ అమ్మవార్ల ఉత్సవం సందర్భంగా ఎవరైనా గంజాయ్ డ్రగ్స్ అమ్మడం వాడడంపై పూర్తిస్థాయి నిషేధం ఉందని ఎలా ఎవరు సేవించి పట్టుబడిన జైలుకు పంపెట్టడం జరుగుతుందని డీఎస్పీ ఆర్ గోవిందరావు హెచ్చరించారు. జీరో టాల రెన్సీ చట్టం అతిక్రమిస్తే ఎంతటి వాడినైనా వదలనని ఓపెన్ డ్రింకింగ్ మహిళలపై వేధింపులు సహించము యువత భవిష్యత్తు యువత భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఆయన హెచ్చరించారు. సిఐ నారాయణరావు మాట్లాడుతూ బెల్ట్ షాపులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మహిళలతో జోలికి వస్తే సహించేది లేదని పిడిఎఫ్ పెడతాం తల్లిదండ్రులు పిల్లలపై నిగావుంచి పండగను ప్రశాంతంగా జరుపుకోండి అని పిలుపునిచ్చారు పండగ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడానికి సోమవారం సాయంకాలం పోలీసులు దిశ నిర్దేశం చేశారు ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేసే పండగని సురక్షితంగా నిర్వహించే విధంగా మీ విధులు సక్రంగా నిర్వహించాలని అన్నారు. పంది నిర్లక్ష్యంతో కొన్ని అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటాయని వాటిని దృష్టిలో పెట్టుకొని మీరంతా క్రమశిక్షణతో పనిచేసి జిల్లా స్థాయిలో బొబ్బిలి పండుగ సక్రమంగా జరిగిందని అనాలని ఆయన ప్రతి ఒక్క సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. జంట పండుగలా జరపడంతో పోలీసులకు కత్తి మీద స్వాముల ఉందని మీరంతా ఏకాగ్రతతో విధులు నిర్వహించాలని కోరారు ఈ కార్యక్రమంలో సిఐ నారాయణరావు సిఐ శ్రీనివాస్ ఎస్ఐలు పాల్గొన్నారు

నేడు వీరబ్రహ్మేంద్ర స్వామివారి మఠం ప్రధమ వార్షిక ఆరాధన మహోత్సవం

నెల్లిమర్ల, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

మండలంలోని సారిపల్లిలోని జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం ప్రధమ వార్షిక ఆరాధన మహోత్సవము ఈ నెల 28వ తేదీన జరుగునున్నది. ఈ కార్యక్రమంలో భాగం గా పంచామృతాభిషేకం, స్వామి వారికి నూతన వస్త్రాలంకరణ అర్చన, మహానివేదన, మంగళ హారతి, మంత్ర, మంత్ర పుష్పం జరగనున్నది. ఉదయం 10 గంలకు హోమం, 1130 ని లకు పూర్ణాహుతి, మధ్యాహ్నం 1200 గంటల అన్న సమారాధన, సాయంత్రం 400 గం లకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామివారి శాంతి కళ్యాణం జరుగుతుందని ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. రాత్రి 700 గంటలకు గ్రామం లో ఊరేగింపు జరుగునన్నట్లు తెలిపారు.కార్యక్రమములో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఏయూ శతాబ్ద ఉత్సవాల దృశ్యమాలిక

భానుడి ప్రతాపానికి సొమ్మసిల్లిన ప్రజానీకం

పాచిపెంట ఏప్రిల్ 27 ప్రభాతవార్త

మండలంలోగత 40 రోజులుగా పెరుగుతున్నఉష్ణోగ్రతలు సూర్యోదయం నుండి సూర్యుడు అస్తమించే వరకు బాణుడు ప్రతాపంతో వృద్ధులు రోగులు చంటి పిల్లలు సొమ్మసిల్లి పోతున్నట్లు పలువురు తెలిపారు. మండలంలో అధిక సంఖ్యలో నిరుపేదలు కావడం వలన దినసరి వేతనానికి వెళ్ళక తప్పక కొంతమంది పనికి వెళ్లిన వ్యవసాయ కూలీలు వడదెబ్బలకు గురవుతున్నారు. ఉష్ణోగ్రతలు రోజు రోజుకి పెరుగుతుండడం వలన ప్రభుత్వం వడదెబ్బల గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు ఇచ్చినప్పటికీ తప్పనిసరి పరిస్థితిలో కూలీలు పనిచేస్తే తప్ప ఆరోజు పూట గడవనీ పరిస్థితులని పలువురు వాపోయారు . ఏడాది గత ఏడాది కంటే భానుడి ప్రతాపం సూర్యోదయం నుండి ఎక్కువ వేడి గాలులు కు ప్రతి ఒక్కరు చెమట పట్టడంతో పనిలో ఇబ్బంది పడుతున్నట్లు పలువురు వ్యవసాయ కూలీలు తెలిపారు. ఇలాగే ఉష్ణోగ్రతలు మే జూన్ నెలలో ఉన్నట్లయితే పలువురు అస్వస్థకు తో పాటు మృత్యువాత తప్పదని పలువురు ప్రభాతవార్త వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పాచిపెంట తదితర గ్రామాల్లో 9 గంటల నుండి సాయంత్రం వరకు గ్రామాల్లో మనుసంచారము లేకపోవడం షాపులు దుకాణాల్లో కొనుగోలు దారులు రాకపోవడంతో చిరు వ్యాపారస్తులు కు ఉష్ణోగ్రత ప్రభావం వలన చిరు వ్యాపారులకు జీవనోపాధికి గండి కొడుతుందని పలువురు తెలిపారు. ప్రధాని కోడలిలో మరియు మండలంలో గల గ్రామాల్లో రహదారి సమీపంలో గల బస్సు స్టాప్లవద్ద మజ్జిగ కేంద్రాలు అంబలి కేంద్రాలు మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇంధనం కొరతతో వాహనదారులకు ఇక్కట్లు

సరుబుజ్జిలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

మండలంలో మర్రిపాడు సమీపాన గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు, ఏ ఎల్ నగరంలో గల నయారా పెట్రోల్ బంకుల్లో వాహనదారులు బారులు తీరారు. డీఎస్ఓ ఆదేశాల అనుసారం బంకులకు ఇంధనం కొరతతో ప్రతి వాహనానికి పరిమిత ఇంధనం కొట్టడంతో వాహనదారులు బారులు తీశారు. ద్విచక్ర వాహనదారులకు పరిమిత పెట్రోలు రూ.200 పోలీసు సిబ్బంది సమక్షంలో ఇవ్వడంతో గంటల తరబడి క్యూలో ఉండడం జరుగుతుంది. అత్యవసర వాహనములు అంబులెన్సులు కూడా గంటల తరబడి క్యూలో ఉండటం గమనార్హం. సంబంధిత అధికారులు దానిపై దృష్టి సారించి వాహనదారులకు అత్యవసర వాహనాలకు ఎటువంటి అంతరాయం లేకుండా ఇంధనం అందజేయాలని కోరుతున్నారు.

ong-11._ong-11..qxd 4/27/2026 11:40 PM Page 1

శ్రీకాకుళం వార్త

వెంకటేష్‌కు అండగా నిలిచిన దాతలు

కవిటి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

అగ్ని ప్రమాదంలో జీవనోపాధి కోల్పోయిన తెలుకుల వెంకటేష్‌కు కవిటి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాండవ చంద్రశేఖర్‌తో పాటు పలువురు దాతలు అండగా నిలిచి ఆదుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. కవిటి శ్రీ కాళీమాత దేవాలయంలో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటనలో తెలుకుల వెంకటేష్ కాళికా వేషధారణ తలలు అగ్నిలో ఖాళీ బూడిదయ్యాయి. వీటి నష్టం సుమారు రెండు లక్షల వరకు ఉంటుంది. వెంకటేష్ నిరుపేద కావడంతో పలువురు దాతలు తెలుసుకొని సోమవారం నాయుడు ఆయనకు సహకారం అందించారు. పాండవ చంద్రశేఖర్ 10 వేల రూపాయలు, బెందాళం జోగి శ్రీధర్ 5000, పోల్లాయి ఉమామహేశ్వరరావు 3000, గోరకల షణ్ముఖరావు 3000 మరియు తన తోటి స్నేహితులు 2500 రూపాయలు ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ ప్రతినిధులు పొల్లాయి లక్ష్మణమూర్తి, పొల్లాయి కృష్ణ, పొల్లాయి దేవరాజు, పొల్లాయి సింహాచలం, దున్న పురుషోత్తంలతో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నౌపడలో ప్రారంభమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం

సంతబొమ్మాళి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

మండలంలోని నౌపడలో వెలసిన లక్ష్మీనారాయణ కల్యాణోత్సవం సోమవారం వైభవపేతంగా ప్రారంభమైంది. శ్రీలక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో పాంచరాత్ర, తిరు కళ్యాణ మహోత్సవ కార్యక్రమంను ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణ పీఠాధిపతి విధాత నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆగమ ప్రవక్త పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఈవో రాధాకృష్ణ పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా ఈ కళ్యాణం జరిగింది. ఈ పాంచ రాత్రి కళ్యాణం చైత్ర శుద్ధ ఏకాదశి నుండి చైత్ర పౌర్ణమి వరకు ఐదు రోజులు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజాము నుండి స్వామివారికి విశేష అభిషేకాలు పంచామృత అభిషేకాలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సర్వదేవత మండల పూజలు, ధ్వజస్తంభ పతాక ఆవిష్కరణలు నిర్వహించి స్వామికి విశేష పూజలు చేపట్టారు. ఈ పూజల్లో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు భాస్కర్‌దాస్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారి శోభాయాత్ర, ఊరేగింపు, మహా హోమాలు, తిరు కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు లక్ష్మీనారాయణ తులసి కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటినుంచి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

సంతబొమ్మాళి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

మండల కేంద్రం సంతబొమ్మాళి శాఖ గ్రంధాలయంలో మంగళవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమవుతుందని గ్రంధాలయధికారి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు వివిధ రకాలైన ఇండోర్ గేమ్స్‌ను మరియు చిత్రలేఖనం వ్యాసరచన క్విజ్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ పంచాయతీలోని విద్యార్థినీ విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి రామకృష్ణ కోరారు.

ఐటిడిఏ ప్రజా గ్రీవెన్స్‌కు 15 వినతలు

సీతంపేట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

ఐటీడీఏ ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్‌కు 15 వినతలు వచ్చినట్లు ఏపీవో జి.చిన్నబాబు తెలిపారు. ప్రజాగ్రీవెన్స్‌లో వచ్చిన వినతులకు సంబంధిత అధికారులు సత్వరం పరిష్కరించాలని గిరిజన ప్రాంతాలలో త్రాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సీతంపేట ఐటిడిఏ పెట్రోల్ బంకులో డీజిల్ పెట్రోల్ కొరత

సీతంపేట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

ఐటిడిఏ పెట్రోల్ బంకులో డీజిల్ పెట్రోల్ కొరత తప్పలేదు. సోమవారం సాయంకాలం నుంచి నో స్టాక్ బోర్డులు పెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోల్ బంకులో నాణ్యమైన పెట్రోల్ లభిస్తుందని నమ్మకం. మండలంలో ఏకైక పెట్రోల్ బంకు కావడంతో పెట్రోల్ డీజిల్ అమ్మకాలు అధికంగా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో పెట్రోల్ డీజిల్ కొరత ఉండడంతో వాహనదారులు ఆయిల్ దొరకదనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున పెట్రోల్‌ను నిల్వ చేసుకునే పరిస్థితి నెలకొంది. దీంతో పెట్రోల్ కొరత ఏర్పడడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం సాయంకాలం నుంచి పెట్రోల్ కొరత నెలకొనడం వలన సుదూర ప్రాంతాల నుండి వచ్చిన వారు పెట్రోల్ లేదని తెలియడంతో తీవ్ర ఇబ్బందులతో వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. పెట్రోల్ కొరత ఎక్కడ ఉండకూడదని ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పెట్రోల్ కొరత తప్పని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో వాహనదారులు ఆయిల్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా చూడవలసిన బాధ్యత ఉందని వాహనదారులు కోరుతున్నారు.

పి.పి.బి.ఎస్ వెరిఫికేషన్ ద్వారా తప్పులు సవరించే అవకాశం

కోటబొమ్మాళి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

పి.పి.బి.ఎస్ వెరిఫికేషన్ ద్వారా భూమి పాస్ పుస్తకాల్లో తప్పులను సవరించే ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు స్థానిక తహశీల్దార్ చింతలపూడి ప్రసాదరావు అన్నారు. సోమవారం ఆయన దంత గ్రామంలో పి.పి.బి.ఎస్ వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటీవలే భూ సర్వే పూర్తయ్యి కొత్తగా వచ్చిన పాస్ పుస్తకాలు సంబంధిత రైతులకు పంపిణీ చేసే ముందు ఆ పుస్తకాల్లో పేర్లు, సర్వే నెంబర్లు వంటివి పొరపాట్లు దొర్లి ఉంటే వాటిని సవరించే కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అందు కోసం గ్రామాల్లో రైతులు ఈ కార్యక్రమానికి సహకరించాలని సూచించారు. రీ సర్వే తర్వాత వచ్చే పాస్ పుస్తకాల్లో ఎటువంటి తప్పులు లేకుండా మరోసారి రైతు కార్యాలయం చుట్టూ తిరగకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అప్పుడే రైతులు లోపాలను సరిదిద్దుకోవాలని, రాజముద్రతో కూడిన ఈ పాస్ పుస్తకం మరోసారి మార్చే అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానిక వీఆర్వో ఉన్నారు.

ఎఫ్‌పిఎల్ విధానాన్ని అమలు చేయాలని ఎరువుల షాపులు బంద్

కోటబొమ్మాళి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఎస్ పి ఎల్ విధానాన్ని అమలు చేయాలని, లింకు ప్రోడక్ట్ లేకుండా ఎరువుల అందించాలని ఎరువుల డీలర్లు కోరుతూ సోమవారం ఎరువుల దుకాణాలు మూసి నిరసన తెలిపారు. ఉత్పత్తిదారుల విధానాలను నిరసిస్తూ ఈ నిరసన తెలుపుతున్నామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువులు డీలర్ల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎరువులు డీలర్ బోయ గోపాల్, ఎస్.పెంటయ్య, భద్రయ్య తదితరులు షాపులు మూసివేసి నిరసన తెలిపారు.

గాయపడి చికిత్స పొందుతున్న జీవితకు ఆర్థిక సాయం

కంచిలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

హెడ్మాస్టర్ చాణక్య ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం ఇటీవల మేడపై జారిపడి తీవ్రంగా గాయపడిన మట్ట జీవిత నడుముకు తీవ్ర గాయం అయ్యింది. అమ్మ హాస్పిటల్ వైజాగ్ నందు చికిత్స పొందుతున్న అమ్మాయి త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ ఆ అమ్మాయికి జడ్పీ హైస్కూల్ కంచిలి తరపున 25 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగినది. హాస్పిటల్‌కు చాణిక్య, బొడ్డ వెంకటరావు, అగ్గున్న త్రినాధరావు, భూరాడ ప్రసాద్, పాఠశాల తరపున అమ్మ హాస్పిటల్ వైజాగ్ వచ్చి అమ్మాయికి ధైర్యం చెప్పారు.

మనోహర్ కుటుంబాన్ని పరామర్శించిన సత్తిబాబు

వీరఘట్టం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :



హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని జనసేన పార్టీ పిఏసి చైర్మన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌ని సోమవారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు, తూర్పు కాపు స్టేట్ డైరెక్టర్ పాలకొండ నియోజక వర్గం సీనియర్ నాయకులు గర్భాన సత్తిబాబు స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఇటీవల మనోహర్ తండ్రి, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నాదెండ్ల భాస్కరరావు మరణం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందన్నారు. హృదయపూర్వక సంతాపం వ్యక్తం చేస్తూ, మనోహర్ మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జిల్లాలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

వీరఘట్టం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

పార్వతీపురం మన్యం జిల్లాలోని వివిధ ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు సహాయకురాళ్ల పోస్టుల భర్తీకి రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మాత్యులు గుమ్మిడి సంధ్యారాణి నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గల ఎంపిక కమిటీ ద్వారా ఈ నియామకాలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొత్తం 263 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో కొత్త ఖాళీలతో పాటు అప్‌గ్రేడ్ చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని కూడా పోస్టులు ఉన్నాయన్నారు. ఇందులఅంగన్‌వాడీ కార్యకర్తలు 05 పోస్టులు, అంగన్‌వాడీ సహాయకురాళ్ళు (ఆయాలు) 258 పోస్టులు, మొత్తం 263 పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. జిల్లా కలెక్టర్ పరిధి (పార్వతీపురం డివిజన్) బలిజిపేట, సాలూరు, భామిని, పాలకొండ, కొమరాడ ప్రాజెక్టులలో మొత్తం 31 పోస్టులు. అలాగే ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐటీడీఏ పార్వతీపురం పరిధి భద్రగిరి, పాచిపెంట, పార్వతీపురం, కురుపాం, కొమరాడ ప్రాజెక్టులలో అత్యధికంగా 175 పోస్టులు. అదేవిధంగా ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐటీడీఏ సీతంపేట పరిధి సీతంపేట, పాలకొండ, భామిని ప్రాజెక్టులలో 57 పోస్టులు ఉన్నాయన్నారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా సంబంధిత గ్రామం/వార్డులో స్థానిక నివాసి అయి ఉండాలి. కేవలం వివాహిత మహిళలు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత విద్యార్హతలు మరియు వయోపరిమితి కలిగి ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు 14.5.2026 వ తేదీ సాయంత్రం ఐదు గంటలు నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సంబంధిత ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో సమర్పించాలనలన్నారు. మరింత సమాచారం కోసం ప్రాజెక్ట్ అధికారి ఐ.సి.డి.ఎస్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చున్నారు.

ఇంటింటికి త్రాగునీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యం

కోటబొమ్మాళి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

ఇంటింటికి త్రాగునీరు అందించటమే ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తుందని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ తెలిపారు. ఆయన సోమవారం కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలో హడ్కోకాలనీలో జరుగుతున్న ఇంటింటికి త్రాగునీరు పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి చింతాడ సన్యాసిరావును సూచించారు.

కొత్తమ్మతల్లి నిత్య అన్నదానంకు రూ.లక్ష విరాళం

కోటబొమ్మాళి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయ సన్నిధిలో జరుగుతున్న నిత్య అన్నదానంకు హైదరాబాద్‌కు చెందిన పొట్నూరు కవిత అనందరావు దంపతులు సోమవారం ఆలయ ఈవో వి.రాధాక్రిష్ణకు రూ.లక్ష చెక్కును విరాళంగా అందజేశారు. కవిత ఆనందరావులు కోటబొమ్మాళి గ్రామానికి చెందిన లాడి ప్రసాదరావు కుమార్తె, అల్లుడు అమ్మవారిపై భక్తితో ఈ విరాళం అందజేశారని ఈవో తెలిపారు. వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం కొత్తమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పర్యటన

సీతంపేట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ మెంబర్ సి.మధుసూదన్ ఈ నెల 28న సీతంపేట మన్యంలో పర్యటిస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.కనకదుర్గ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఐసిడిఎస్ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

ముఖలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ 'కూన'

ఆముదలవలస, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

శ్రీకాకుళం జిల్లాలో ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిన ప్రాచీన పుణ్యక్షేత్రం శ్రీ ముఖలింగేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. సోమవారం శ్రీముఖలింగం వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, విశిష్టత, అభివృద్ధి అవసరాలపై ఆలయ అధికారులతో, అర్చకులతో, స్థానిక ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే రవికుమార్ సమగ్రంగా చర్చించారు. వంశధార నది తీరాన వెలసిన శ్రీ ముఖలింగేశ్వర స్వామి ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత ప్రాచీన శైవక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిందన్నారు. తూర్పు గంగుల పాలన కాలంలో నిర్మితమైన ఈ ఆలయం తన శిల్పకళా వైభవం, చారిత్రక ప్రాముఖ్యత, ఆధ్యాత్మిక మహిమాన్వితతతో భక్తులను ఆకర్షిస్తోందని తెలిపారు. ఆలయంలోని శిల్ప సంపద, గోపుర నిర్మాణ శైలి, గర్భగుడి నిర్మాణ కౌశలం భారతీయ దేవాలయ నిర్మాణ కళకు ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా ముఖలింగేశ్వర స్వామి స్వయంభూ లింగరూపంలో వెలసి భక్తులకు దర్శనమిస్తుండటంతో ఈ క్షేత్రానికి అపారమైన ఆధ్యాత్మిక విశిష్టత ఏర్పడిందని అన్నారు. దక్షిణ కాశిగా పేరుగాంచిన ఈ పుణ్యక్షేత్రం శైవ భక్తులకు అత్యంత పవిత్రమైన క్షేత్రంగా గుర్తింపు పొందిందని, కాశీ విశ్వనాథుని దర్శనం చేసినంత పుణ్యం శ్రీ ముఖలింగేశ్వర స్వామివారి దర్శనంతో లభిస్తుందని భక్తుల విశ్వాసమని, మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ జరిగే ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది భక్తులను ఆకర్షిస్తాయిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. ఆలయం స్థాపించబడిన నాటి నుంచి ఇప్పటి వరకు కుంభాభిషేకం జరగకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆలయ సంప్రదాయ పరిరక్షణలో భాగంగా త్వరితగతిన కుంభాభిషేకం జరిగేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే ఆలయ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, భక్తులకు మెరుగైన సదుపాయాలు, పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దేవాలయాలు మూలస్తంభాలని పేర్కొన్నారు. శ్రీ ముఖలింగేశ్వర స్వామి ఆలయం వంటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన క్షేత్రాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆలయ వైభవాన్ని జాతీయ స్థాయిలో మరింతగా ప్రచారం చేసి భక్తులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, అర్చకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

సంతకవిటి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

మండలంలో మందరాడ గ్రామంలోని తోటలో పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లని సోమవారం ఎస్సై గోపాలరావు అదుపులోకి తీసుకోవడం జరిగింది. పారిపోతున్న ఇద్దరు వ్యక్తులను వెంబడించి వారిని పట్టుకోవడం జరిగింది. వారి వద్ద నుండి 4960నగదు పేక ముక్కలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఎవరైనా జూదమాడిన బెట్టింగ్ పాల్పడిన డ్రగ్స్ వాడిన వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించడం జరిగింది.

ఘనంగా అయ్యప్ప స్వామి దేవాలయం వార్షికోత్సవం

ఆమదాలవలస, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

ఆముదాలవలస పట్టణంలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ తొమ్మిదో వార్షికోత్సవం సోమవారం ఆలయ నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్, గీత దంపతులు ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. 9వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంత భక్తులు సుమారు 2000 మంది అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులకు తీర్థ ప్రసాదములు ఆలయ నిర్వాహకులు ఇచ్చారు. భక్తుల కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అన్నెపు సురేష్, సీల్లా మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా మండల పర్యటన

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు సాలిన డిల్లీరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ మోర్చా మండల పర్యటనలో, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులుగా మద్దెల సిమ్మయ్య, ప్రధాన కార్యదర్శులుగా సాలిన మోహనరావు, మద్దెల సిన్నయ్యలను నూతనంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన నాయకులను అభినందిస్తూ, పార్టీ అభివృద్ధికి మరియు ఓబీసీ వర్గాల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు లక్కోజు ధర్మారావు, బీజేపీ సీనియర్ నాయకులు రామానంద స్వామి, జిల్లా కోశాధికారి వి.పి.ప్రసాద్, జిల్లా కార్యదర్శి బూర్జి పేట హరికృష్ణ, జిల్లా ఐటీ కోకన్వీనర్ వమ్మరవెల్లి శ్రీనివాసరావు, చెల్లూరి విజయకుమార్ మరియు ఇతర బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసిన ఉపరాష్ట్రపతి పర్యటన

- జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

సోమవారం గౌరవ ఉపరాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్ శ్రీకాకుళం జిల్లా పర్యటనను జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పూర్తి చేసింది. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, స్వీయ పర్యవేక్షణలో ముందస్తు ప్రణాళిక ప్రకారం సమగ్ర భద్రతా చర్యలు చేపట్టబడినాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టితో కలిసి జిల్లా ఎస్పీ ముందస్తుగా హెలిప్యాడ్, రూట్ మార్గం, శ్రీకూర్మం, అరసవిల్లి ఆలయ ప్రాంగణం భద్రత, బందోబస్తు క్షుణ్ణంగా పరిశీలించారు. పర్యటనకు సంబంధించి మార్గమంతా విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేసి, ముఖ్య ప్రదేశాల్లో పటిష్ట నిఘాతో పాటు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేయబడినాయి. అవసరమైన చోట అదనపు పోలీసు బలగాలు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లను వినియోగించి ప్రతి ప్రాంతాన్ని ముందస్తుగా పరిశీలించి భద్రతను మరింత బలోపేతం చేశారు. ఆధునిక సాంకేతిక, కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహించబడింది. ట్రాఫిక్ మళ్లింపులు, మార్గ నిర్దేశాలు ప్రజలకు ముందుగానే తెలియజేసి, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రజలు పోలీసుల సూచనలను పాటించడం వల్ల పర్యటన సజావుగా సాగడానికి సహకారం లభించిందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ, భద్రతా విధుల్లో నిమగ్నమైన పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర విభాగాల సమన్వయంతో పని చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. అలాగే పర్యటన విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

పెట్రోల్, డీజిల్ కొరత లేదు: జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం నాలుగు రోజులకు సరిపడా 713 కిలోలీటర్ల పెట్రోల్, 734 కిలో లీటర్ల డీజిల్ అందుబాటులో ఉన్నాయని ఇది మరో 4 రోజులకు పైగా సరిపోతుందన్నారు. ఇది కాకుండా ప్రతిరోజు ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ కంపెనీలు నిరంతరం సరఫరా చేస్తున్నాయి. విశాఖపట్నం నుండి నిత్యం ట్యాంకర్లు వస్తూనే ఉన్నాయి. కృత్రిమ కొరత సృష్టించినా లేదా అక్రమ వ్యాపారానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు, ఇంధన సరఫరాలో సమస్యలు ఉంటే ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌ను ఇళ్లలో నిల్వ ఉంచడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున అవి పేలుళ్లకు దారితీసి అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరిఓం పాండ్యా కూడా ఉన్నారు.

శ్రీకూర్మనాథ ఆలయ అభివృద్ధి

శ్రీకాకుళం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :

శ్రీకాకుళం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మూడు కీలక అంశాలపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వగృహంలో ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణకు ఎమ్మెల్యే గొండు శంకర్ వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా శ్రీకూర్మనాథ ఆలయం సమగ్ర అభివృద్ధి, పునరుద్ధరణ మరియు వారసత్వ సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించడంతో పాటు, వసతి, పారిశుద్ధం, రవాణా వంటి సౌకర్యాలను మెరుగుపరచడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం పరిధిలోకి చేర్చి, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఈ ఆలయం రాష్ట్రంతో పాటు పొరుగు ప్రాంతాల నుండి భారీగా భక్తులను ఆకర్షిస్తున్న ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉండటంతో, యాత్రికులకు తగిన సౌకర్యాలు కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, తరచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని రహదారి విస్తరణ అత్యవసరమని పేర్కొన్నారు. ప్రజల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదించి పనులు ప్రారంభించాలంటూ ఉపరాష్ట్రపతిని ఎమ్మెల్యే గొండు శంకర్ వినయపూర్వకంగా కోరారు.

తొలకరి ఋతుపవనాలకు ముందు పొడి విత్తుల విధానం మేలు

- టెక్కలి ఏ.డి.ఏ జగన్మోహనరావు

సంతబొమ్మాళి. ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

రానున్న తొలకరిలో వరి ఎద విస్తృతమైన విస్తీర్ణాల్లో పాటిస్తున్న సంతబొమ్మాళి మండలంలో ఉన్న ప్రత్యేకమైన వ్యవసాయ పరిస్థితుల్లో తొలకరిలో రుతుపవనాలకు ముందు పొడివిత్తుల విధానం ప్రకృతి వ్యవసాయ పద్దతులలో అత్యంత ఉత్తమమైనదని టెక్కలి సహాయ వ్యవసాయ సంచాలకులు కొడవంటి జగన్మోహనరావు తెలిపారు. సంతబొమ్మాళి మండల కేంద్రంలో మండలంలోని ఆర్.ఎస్.కె ల ఇన్‌చార్జ్‌లు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన వివిధ అంశాలపై మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. రుతుపవనాలకు ముందు పొడివిత్తుల విధానం (పి.ఎం. డి.ఎస్) మరియు విత్తన గుళికలు తయారీ విధానం ప్రదర్శన తిలకించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాళ్ల పేట అప్పారావు, ఏ.ఈ.ఓ లు గొండు శ్రీధర్, మెండ పావని, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్లు కింజరాపు ఉష, అంగ షణ్ముఖరావు, తంగి విజయ, వేణమ్మ, సౌందర్య, శాంతమ్మ పాల్గొన్నారు.

4 నుండి రత్తకన్న గ్రామ దేవత సంబరాలు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

రత్తకన్న గ్రామ దేవత మా పులకాసుణి అమ్మవారి సంబరాలు మే 4 నుండి 12 వరకు 9 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. 4న సోమవారం రాత్రి మేళతాళాలతో అమ్మవారిని తోటవీధి ఉత్సవ మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కి ఆహ్వాన పత్రం అందజేశారు.

ఎండల్లో హాయ్..హాయ్

వేసవి కాలమంటే ఎండలు, బండలే కాదు... సంతోషంగా గడిపే రోజులూ ఉంటాయండోయ్ !

నెత్తిన సర్రున కాలే మంట... ఎండ, పై నుంచి కిందకు నిండా కారే చెమట, శరీరంలో ఆవిరవుతుండే శరీర తాపం ,...ఇవన్నీ ఎండాకాలంలో చీకాకు పెడుతుంటాయి. అంతే కాదు..ఇదే వేసవి కాలం చాలా మందికి ఆనందాన్ని కూడా ఇస్తుంది. అది మన పరిస్థితులు, మన దృక్కోణం, మన జీవనశైలి మీద ఆధారపడి ఉంటుంది.

పిల్లల దృష్టిలో 'వేసవి' అనేది అత్యంత సంతోషకరమైన సందర్భం. పాఠశాలలకు సెలవులివ్వడంతో వారు ఒత్తిడి లేకుండా ఆటలలో, వినోదాలలో గడుపుతారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నేహితులతో కలిసి ఆటలు ఆడటం, చెట్ల నీడలో కూర్చుని కథలు, కబుర్లు చెప్పుకోవడం వంటి వంటే ఎంత ఆనందమో! మామిడి పండ్లు, పుచ్చ కాయలు తినడమంటే మరీ..మరీ... ఆనందం. ఇవే వారి ఆనందాలను ద్విగుణీకృతం చేస్తుంటాయి. ఇలాంటప్పుడే వారి జీవితాలు ఉత్సాహవంతంగా ఎగిరి గంతులేస్తాయి.

అందుకే పిల్లలకు వేసవి కాలం అనేది నిజమైన సంతోష కాలం.

చాలా మంది తమ తాతయ్య, అమ్మమ్మల ఇంట్లో గడపడానికి వెళ్తుంటారు , అలా కుటుంబ సభ్యుల తో కలిసి సమ యం గడపడం వలన అనుబంధాలు మరింత బలపడతాయి.



కుటుం బాల పరంగా చూసినా వేసవి ప్రత్యేకమైన సమయం. నగరాల్లో బిజీ బిజీగా ఉండే జీవితానికి కొంత విరామమే.

ఈ సమయం నిజంగా విరామ సమయం కన్నా విజ్ఞాన సమయం అని కూడా చెప్పుకోవాల్సి వస్తుంది కుటుంబ సమైక్యతను పెంపొందించే కాలంగా భాసిల్లుతోంది. ప్రతి ఒక్కరికీ వేసవి సమయం ఎంతో సంతోషకరంగా ఉంటుందని చెప్పుకోవాల్సి వస్తే వృద్ధులు, చిన్నపిల్లలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశమూ ఉంటుంది. కాబట్టి పరిస్థితులు అనుకూలంగా లేకపోతే వేసవి సంతోషాన్ని ఇవ్వదు.

అయితే కొన్ని పరిస్థితులను పాటిస్తే వేసవిని సంతోషకరంగా మార్చుకోవచ్చు. తగి నంత నీరు తాగడం, చల్లని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలు అవసరం. ప్రకృతిని ఆస్వాదించ డం, ఉదయం లేదా సాయంత్రం సమయంలో బయట గడపడం ద్వారా వేసవి అందాలను కూడా అనుభవించవచ్చు. ముఖ్యంగా సానుకూల దృక్కోణం కలిగి ఉంటే ఏ కాలమైనా ఆనందంగా మారుతుంది.

వేసవి కాలం స్వతహాగా సంతోషకరమో కష్టకరమో కాదు. అది మన మనసు, మన పరిస్థితులు, మన జీవన విధానంపై ఆధారపడి ఉంటుంది. సరైన జాగ్రత్తలు తీసుకుంటూ, చిన్న చిన్న ఆనందాలను ఆస్వాదిస్తూ ... వేసవిని గడపితే ... సంతోషకరమే !

జలక్రీడలో జాగ్రత్త !

ఈత ఒక మంచి వ్యాయామం. ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగకరం. ఈత ఒక ఆనందదాయకమైన క్రీడ. ముఖ్యంగా బాలురు ఈత నేర్చుకోవడం వల్ల శారీరక దృఢత్వం, ధైర్యం , ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. ఈత కొట్టేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశముంది. అందువల్ల బాలురు ఈత కొట్టేటప్పుడు కొన్ని ముఖ్యమైన నియమాలు పాటించాలి. ఈత గురువుల పర్యవేక్షణలో నేర్చుకోవాలి. స్వయంగా లేదా స్నేహితులతో కలిసి తెలియని ప్రదేశాల్లో ఈత కొట్టడం ప్రమాదకరం. నీటి లోతు ఎంత ఉందో ముందుగా తెలుసుకోవాలి. ఈత కొట్టే ముందు శరీరాన్ని కొంచెం వ్యాయామం చేసి సిద్ధం చేయాలి. ఆకలి ఎక్కువగా ఉన్నప్పుడు లేదా పూర్తిగా తిన్న వెంటనే నీటిలోకి దిగకూడదు. ఇది ఆరోగ్యానికి హానికరం.

లైఫ్ జాకెట్ వంటి రక్షణ పరికరాలు ఉపయోగించడం మంచిది. ముఖ్యంగా ఈత బాగా రాని వారు, అలాగే ఒంటరిగా ఈత కొట్టకుండా ఎప్పుడూ ఇతరు లతో కలిసి ఉండాలి. ప్రమాదం జరిగితే ఎలా స్పందించాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. సహాయం కోసం అరిచే ధైర్యం ఉండాలి. ఇతరులకు కూడా సహాయం చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఈతను ఆస్వాదించగల నియమాలను పాటిస్తే బాలురు సురక్షి త జాగ్రత్తలు పాటించడం అత్యవసరం.

త్యాగనిరతి !

రామాయణంలో గొప్ప త్యాగనిరతి ఊర్మిళ..ది. ఆమె చేసిన త్యాగం ఆధ్యాత్మికంగా చాలా గొప్పది.'ఊర్మిళ నిద్ర' అనే భావన మనకు త్యాగం, భక్తి, కర్తవ్య నిబద్ధత వంటి విలువలను గుర్తు చేస్తుంది. లక్ష్మణుడు శ్రీరామునితో కలిసి 14 సంవత్సరాలు అరణ్యంలో నివసించాల్సి వచ్చింది. ఈ సమయంలో ఆయన రాత్రింబగళ్లు నిద్రకు కూడా అవకాశం లేకుండా రాముని సేవలో నిమగ్నమై ఉండాలి. అయితే, నిద్ర అనేది ప్రతి మనిషికి సహజమైన అవసరం. ఇక్కడే ఊర్మిళ పాత్ర ఆవిర్భవిస్తుంది. పురాణ కథనం ప్రకారం, లక్ష్మణుడు తన నిద్రను విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నప్పుడు, ఆ నిద్రదేవత ఊర్మిళ దగ్గరకు వెళ్లింది. ఊర్మిళ తన భర్తకు సహాయం చేయడానికి, అతని నిద్రను తానే స్వీకరించింది. 14 సంవత్సరాల పాటు ఆమె నిద్రలోనే ఉండి, లక్ష్మణుడు జాగరూకంగా రామునికి సేవ చేయడానికి అవకాశం కల్పించింది. ఊర్మిళ తన వ్యక్తిగత సుఖాలను, తన జీవితాన్ని కూడా పక్కన పెట్టి, తన భర్త కర్తవ్యానికి తోడ్పడింది. ఇది కేవలం ఒక ఆత్మీయ ధర్మాన్ని పాటించిన చర్య.

వాముతో ఉపయోగాలు..

వామును బుగ్గన పెట్టుకుని నమిలి చప్పరిస్తూ రసాన్ని మింగితే గొంతులో నొప్పి, గురగుర శబ్దాలు తగ్గుతాయి.

వామును కరక్కాయ, ఉసిరికాయ, తావికాయలతో కలిపి ముద్దగా నూరి దంతాల మూలల్లో పెడితే దంత వ్యాధులు తగ్గుతాయి.

వామును ధనియాలు, జీలకర్రలను దోరగా వేయించి కషాయం చేసి తీసుకుంటే జ్వరం తగ్గుతుంది. వాము మిరియాలు, ఉప్పు సమాభాగాలుగా తీసుకొని చూర్ణం చేసి ప్రతి దినం భోజనానికి ముందు సేవిస్తే అజీర్ణం ఉదరశూల తగ్గును.

'ఏసీ'లో ఉండడమే మీకు ఇష్టమా!.

ఎవరికైనా సరే ! ఎండల నుంచి ఉపశమనానికి శీతల యంత్రంకేసి చూస్తుం టాము. ఏసీ కింద పడుకోగానే, హమ్మయ్య అని నిట్టూర్పులు విడుస్తారు. అదేంటో కావలసినంత హాయినిస్తుంది. అందుకేనేమో! దాన్ని కాసేపు వది లేందుకు కూడా ఇష్టపడరు. అయినా, అతిగా వాడటం వల్ల ఆరోగ్యానికి ముప్పు అని తెలిసినా బయటకు రారు. వేడి వాతావరణం నుంచి హఠాత్తుగా చల్లని ఏసీ గదిలోకి వెళ్లడం 'థర్మల్ షాక్'కు దారితీసే అవకాశం ఉంటుందని గుర్తుంచుకోవాలి.ఏసీని 24-26 డిగ్రీల మధ్య ఉంచడం, గదికి వెంటిలేషన్ వంటి జాగ్రత్తలతో ప్రమాదాల నివారణకు ఛాన్స్ ఉంటుంది. భారతదేశంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్న వేళ, పట్టణ ప్రాంతాల్లో ఎయిర్ కండిషనర్ (ఏసీ) వాడకం విలాసం నుంచి నిత్యావసరంగా మారింది. చాలామంది రోజులో 20 గంటలకు పైగా చల్లని కార్యాలయాల్లోనో, కార్లలోనో ఇళ్లలోనే గడుపుతున్నారు. ఎండవేడి నుంచి ఏసీ తక్షణ ఉపశమనం కలిగిస్తున్నప్పటికీ, ఈ కృత్రిమ శీతలీకరణ వ్యవస్థపై అధికంగా ఆధారపడటం మన ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వివిధ అధ్యయనాల ప్రకారం సాధారణ గాలి ప్రసరణ ఉన్న ప్రదేశాలతో పోలిస్తే, ఏసీ వాతావరణంలో ఎక్కువ సమయం గడిపే వారిలో శ్వాసకోశ సంబంధిత లక్షణాలు 50 శాతం అధికంగా కనిపిస్తున్నాయి. సెంట్రల్ ఏసీ ఉన్న భవనాల్లో పనిచేసే వారిలో సిక్ బిల్డింగ్ సిండ్రోమ్ లక్షణాలు ఎక్కువగా ఉన్నట్లు అంతర్జాతీయ పత్రికలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఏసీ వాడకం వల్ల కలిగే ఐదు ప్రధాన ఆరోగ్య ప్రమాదాలపై నిపుణులు విశ్లేషణ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

ఏసీ యూనిట్లు, ముఖ్యంగా సెంట్రల్ కూలింగ్ సిస్టమ్స్ తేమను ఎక్కువగా నిల్వ చేస్తాయి. ఏసీ ఫిల్టర్లను, కాయిల్స్ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోతే, అక్కడ నిలిచిన తేమలో బ్యాక్టీరియా, బూజు, ఫంగస్ వంటివి వృద్ధి చెందుతాయి. ముఖ్యంగా 'లెజియోనెల్లా' అనే బ్యాక్టీరియా ఏసీ డక్టులలోని నీటిలో పెరిగి, ఏసీ ఆన్ చేసినప్పుడు గాలి ద్వారా వ్యాపించి 'లెజియోన్నేర్స్' అనే తీవ్రమైన న్యూమోనియాకు కారణమవుతుంది. అలాగే, బూజు కణాలు అలర్జీలు, దీర్ఘకాలిక సైనస్ ఇన్ఫెక్షన్లకు దారితీస్తాయి.

ఏసీ గదిలోని గాలిని చల్లబరిచే క్రమంలో తేమను గ్రహిస్తుంది. ఇది గాలిలోని తేమతో పాటు మన శరీరంలోని తేమను కూడా లాగేస్తుంది. దీనివల్ల 'డ్రై ఐ సిండ్రోమ్' ఏర్పడికళ్లు పొడిబారడం, ఎర్రబడటం, మంట వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే, చర్మం తన సహజ నూనెలను కోల్పోయి పొడిబారడం, దురద, పొట్టు రాలడం వంటి సమస్యలు తలెత్తుతాయి. తామర, సోరియాసిస్ వంటి సమస్యలు ఉన్నవారికి ఇది మరింత ప్రమాదకరం.

ఏసీ గదిలో గాలి బయటకు వెళ్లి, తాజా గాలి లోపలికి రాదు. ఉన్న గాలినే మళ్లీ మళ్లీ చల్లబరచడం వల్ల గదిలో దుమ్ము, పుప్పొడి, బూజు వంటి కాలుష్య కారకాల సాంద్రత పెరుగుతుంది. 'ఏసీ ఫిల్టర్లను ప్రతి 15 నుంచి 30 రోజులకు శుభ్రచేయకపోతే, మనం కలుషితమైన గాలినే పీలుస్తాం. ఇది ఆస్తమా, దీర్ఘకాలిక రినిటిస్ వంటి సమస్యలను ప్రేరేపిస్తుంది' అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చల్లని గాలి నేరుగా తగలడం వల్ల కొంతమందిలో శ్వాసనాళాలు సంకోచించి, ఆయాసం వస్తుంది.

బయట 45 డిగ్రీల వేడి నుంచి అకస్మాత్తుగా 18 డిగ్రీల చల్లని ఏసీ గదిలోకి ప్రవేశించినప్పుడు శరీరం 'థర్మల్ షాక్'కు గురవుతుంది. ఈ ఉష్ణోగ్రత మార్పులకు అనుగుణంగా సర్దుబాటు అయ్యేందుకు శరీరంపై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. రక్తనాళాలు ఒక్కసారిగా సంకోచించడం వల్ల ముక్కులో రోగనిరోధక శక్తి తగ్గి జలుబు, ఫ్లూవంటి వైరల్ ఇన్ఫెక్షన్ల బారినపడేప్రమాదం పెరుగుతుంది.

ఏసీ టెంపరేచర్ను 24 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంచాలి. ప్రతి నాలుగు గంటల ఏసీ వాడకానికి, 15 నిమిషాల పాటు కిటికీలు తెరిచి గదిలో గాలి ప్రసరణ జరిగేలా చూడాలి. శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉండేందుకు తరచుగా నీళ్లు, పండ్ల రసాలు తాగాలి. ఏసీ ఫిల్టర్లను ప్రతి రెండు వారాలకు ఒకసారి శుభ్రం చేయాలి. సీజన్ ప్రారంభంలో ప్రొఫెషనల్స్తో డీప్ క్లీనింగ్ చేయించడం ఉత్తమం.

తెర

హిలేరియస్ వ్లాగర్‌గా అలరిస్తా

డిఫరెంట్ ఎంటర్టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి గాయపడ్డ సింహం అలరించబోతున్నారు. ఈ చిత్రంలో హీరో శ్రీవిష్ణు స్పెషల్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సాదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్స్, పిఠవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్ల పై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. జేడి చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ ఫరియా అబ్దుల్లా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. ' ఇందులో నేను శాలిని అనే వ్లాగర్ పాత్రలో కనిపిస్తాను. ఇది ఒక క్రేజీ క్యామియో రోల్. నా క్యారెక్టర్‌లో కామెడీ ఎలిమెంట్స్ చాలా ఎక్కువగా ఉంటాయి. డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ ఈ యూనివర్స్‌ను, పాత్రలను చాలా హిలేరియస్‌గా డిజైన్ చేశారు. ముఖ్యంగా మల్టిపుల్ లేయర్స్ ఉన్న కథలో ప్రతి పాత్రకు ఒక ప్రాముఖ్యత ఉంటుంది. నా క్యారెక్టర్ రైటింగ్ చాలా ఫన్నీగా వచ్చింది. తరుణ్ కామెడీ టైమింగ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. శ్రీవిష్ణు పాత్ర చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది, దాన్ని చాలా బాగా డిజైన్ చేశారు. ఇక మానస పాత్ర గురించి చెప్పాలంటే.. తను హ్యాండ్ ఇచ్చిన అమ్మాయి అయితే, నేను హ్యాండ్ పట్టుకున్న అమ్మాయిని (నవ్వుతూ). వీరిద్దరి మధ్య సీన్స్ కూడా చాలా బాగుంటాయి.

కోల్ సిండికేట్ వేట

టాలీవుడ్ వెర్సటైల్ హీరోయిన్ సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ దిబ్లాక్ గోల్డ్ చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. యోగేశ్ కె.ఎం.సి. దర్శకత్వంలో, మాగంటి పిక్చర్స్ సహకారంతో రాజేశ్‌దండా ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో..తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని బొగ్గు గనుల నేపథ్యంలో, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్ సిండికేట్ మాఫియా కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. ఇందులో సంయుక్త చట్టాన్ని గౌరవించే, అత్యంత శక్తివంతమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌లో చేతిలో గన్ పట్టుకుని సంయుక్త కనిపిస్తున్న తీరు సినిమాపై భారీ అంచనాలను పెంచింది. మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లోని బొగ్గు గనుల్లో 45 డిగ్రీల ఎండను సైతం లెక్కచేయకుండా ఈ సినిమా చిత్రీకరణ జరిపారు. సుమారు 60కిపైగా పనిదినాల్లో, ఐదుపవర్‌ఫుల్ షెడ్యూల్స్ లో షూటింగ్ పూర్తయ్యింది. టెక్నికల్‌గా ఈ సినిమా అత్యున్నత స్థాయిలో ఉండబోతోందని, కొన్ని కీలక సన్నివేశాల కోసం ఏకకాలంలో ఐదు కెమెరాలను ఉపయోగించినట్లు దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో మురళీశర్మ,రావు రమేష్, నాసర్ వంటి దిగ్గజ నటులతో పాటు మనీష్ వాధ్వా, చంద్రిక రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం, మలయాళం మరియు కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. షూటింగ్ పూర్తవడంతో ప్రస్తుతం చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైంది.

అన్యోన్య దంపతుల మధ్య..

దశాబ్దాల క్రితం వెండితెరపై అన్యోన్య దంపతులుగా మెప్పించిన జగపతిబాబు, లయ కాంబినేషన్ మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆకెళ్ల వి.కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సస్పెన్స్ ఎమోషనల్ థ్రిల్లర్'వదలా. వాసవ ఎంటర్‌టైన్‌మెంట్స్, చరిత చిత్ర ప్రొడక్షన్స్‌పై కిశోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను సోమవారం చిత్ర బృందం విడుదల చేసింది. టీజర్ ప్రారంభంలో ఒక అందమైన, సంతోషకరమైన కుటుంబాన్ని చూపిస్తూ.. హఠాత్తుగా వారి జీవితంలోకి ప్రవేశించిన ఒక యువతి (ప్రీతిక శ్రీనివాస్) వల్ల ఆ కుటుంబం ఎలా అతలాకుతలమైందనే అంశాన్ని గ్రిప్పింగ్‌గా చూపించారు. యోగి (జగపతిబాబు) తన భార్య (లయ)ను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తాడు. అయితే, వీరిద్దరి మధ్యకు వచ్చిన మూడో వ్యక్తి పంతం లేదా ఆవేశం కారణంగా ఆ కుటుంబం ఎలాంటి ప్రమాదంలో పడింది? వారిలో ఒకరిని చంపాలనే హెచ్చరిక వెనుక ఉన్న రహస్యం ఏంటి? అనే ఉత్కంఠను టీజర్ రేకెత్తిస్తోంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అందించిన విజువల్స్, కార్తీక్ కొడకండ్ల నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. దర్శకుడు ఆకెళ్ల వి.కృష్ణ ఫ్యామిలీ డ్రామాకు థ్రిల్లర్ ఎలిమెంట్స్‌ని జోడించి ఈ చిత్రాన్ని మలిచిన తీరు విలక్షణంగా ఉంది. టీజర్ విడుదల సందర్భంగా హీరో జగపతి బాబు మాట్లాడుతూ..'వదల్లా సాలిడ్ కాన్సెప్ట్ ఉన్న సినిమా. లైఫ్‌లో అన్నీ అనుకోకుండా జరిగిపోయినట్టే ఈ సినిమా కూడా జరిగింది. కిషోర్, భరద్వాజ ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు. విజువల్స్, మ్యూజిక్ అద్భుతంగా వచ్చాయి. ఖచ్చితంగా ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు.

నిశ్శబ్ద విషంపై పోరాటం

ప్రముఖ నటి కాజల్ అగర్వాల్, వెర్సటైల్ యాక్టర్ శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటించిన సోషియోనేషనల్ డ్రామా ది ఇండియా స్టోరీ (స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్) విడుదలకు సిద్ధమైంది. సామాజిక బాధ్యతతో కూడిన ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. చేత్తన్ డీకే దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని సాగర్ బి షిండే నిర్మించి, స్వయంగా కథను అందించారు. ఈ సినిమా ప్రధానంగా దేశంలో విస్తరిస్తున్న రసాయనాల దుర్వినియోగం, పురుగుమందుల సాగు వల్ల తలెత్తుతున్న ఆరోగ్య సంక్షోభం చుట్టూ తిరుగుతుంది. ఆహారంలో కలిసే రసాయనాలు కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదని, అది మానవ మనుగడకే ముప్పుగా పరిణమించిన వైనాన్ని దర్శకుడు ఇందులో ఆవిష్కరించారు.

వెండితెరపై గైరమ్మత్త రచ్చ..

సోషల్ మీడియా సెన్సేషన్, క్లాసికల్ డ్యాన్సర్ దువ్వాడ మాధురి (దివ్వెల మాధురి) ఇప్పుడు కొత్త అవతారమెత్తారు. వివాదాలు, రాజకీయ వార్తలతో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే ఆమె.. ఇప్పుడు వెండితెరపై తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. చీన్ టపాక్ డుం డుం అనే వెరైటీ టైటిల్‌తో వస్తున్న సినిమా ద్వారా ఆమె టాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. విలేజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మాధురి గైరమ్మత్త అనే పవర్‌ఫుల్ అత్త పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గంభీరమైన చూపులు, పక్కా విలేజ్ మేకోవర్‌తో ఆమె కనిపిస్తుండటంతో, సినిమాలో ఆమె క్యారెక్టర్ చాలా వైవిధ్యంగా ఉండబోతోందని అర్థమవుతోంది. కుమారి శ్రీమతి ఫేమ్ గవిరెడ్డి శ్రీనివాస్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. వై. ఎన్. లోహిత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విలేజ్ టాకీస్ బ్యానర్‌పై శ్రీను నాగులపల్లి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నర్సీపట్నం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఆగస్టులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి టాలీవుడ్ దిగ్గజాలు తరలివచ్చారు. స్టార్ డైరెక్టర్లు గోపిచంద్ మలినేని, మల్లిడి వశిష్ట, నందిని రెడ్డి, రచయిత బీవీఎస్ రవి తదితరులు చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నవ్వుల విందుకు సిద్ధం

కాంతార చిత్రంతో దేశవ్యాప్త సంచలనం సృష్టించిన విలక్షణ నటుడు రిషబ్ శెట్టి హీరోగా నటించిన తాజా చిత్రం ఏ ఫిల్మ్ బై గిరి విడుదలకు ముహూర్తం ఖరారైంది. స్టార్ వుడ్ ఎంటర్టైన్మెంట్, రిషబ్ శెట్టి ఫిలిమ్స్ సంయుక్త నిర్మాణంలో, ఎమ్. అచ్చిబాబు సమర్పణలో తెరకెక్కిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని మే 8న గ్రాండ్‌గా విడుదల కానుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే..రచన ఇందిర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా పక్కా కామెడీ ఎంటర్టైనర్‌గా రూపొందింది. ఈ చిత్రం ద్వారా కరణ్ అనంత్, అనిరుద్ మహేష్ దర్శకులుగా వెండితెరకు పరిచయం అవుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ఎంజి మూవీస్ సంస్థ ద్వారా ఎమ్. అచ్చిబాబు అత్యంత భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఇందులో ఎన్.పి తాపెస్వరి, హోన్నవలి కృష్ణ, ప్రమోద్ శెట్టి వంటి హేమాహేమీలు ముఖ్య పాత్రల్లో నటించారు. సంగీతం: వాసుకి వైభవ్, సినిమాటోగ్రఫీ: రఘునాథ్ సిఎంఎడిటింగ్: భరత్ ఎంసి, ప్రదీప్ అర్ రావురిషబ్ శెట్టికి తెలుగులో ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ సినిమాను ఇక్కడ భారీగా ప్రమోట్ చేస్తున్నారు. వేసవి కానుకగా మే 8న థియేటర్లలో నవ్వుల విందును పంచడానికి గిరి సిద్ధమయ్యాడు.

కల్కి సీక్వెల్‌లో శింబు మెరుపులు?

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి సినిమా సీక్వెల్‌లో ఒక అత్యంత కీలకమైన స్పెషల్ రోల్ ఉందని, ఆ పాత్రలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు కనిపించబోతున్నారని సమాచారం.మరీ ముఖ్యంగా, సినిమా క్లైమాక్స్‌లో వచ్చే ఈ పాత్ర కథను మలుపు తిప్పుతుందని తెలుస్తోంది.

కర ఒక సాధారణ యువకుడి కథ

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, మమితా బైజు జంటగా నటించిన చిత్రం కర. పోరు తొళిల్ వంటి సక్సెస్‌ఫుల్ మూవీని అందించిన విఘ్నేశ్ రాజా ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. కుష్మిత గణేష్ సమర్పణలో డా. ఐషరి కె. గణేష్ నిర్మించిన ఈ సినిమాను తెలుగులో విఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ సంస్థలు ఏప్రిల్ 30న విడుదల చేస్తున్నాయి.

ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్, దర్శకులు బుచ్చిబాబు సానా, వెంకీ అట్లూరి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హీరో ధనుష్ మాట్లాడుతూ.. కర సినిమా ఒక సాధారణ యువకుడి కథ. విఘ్నేశ్ రాజా ఈ కథను ఎంతో అద్భుతంగా మలిచారు. పోరు తొళిల్ చూసినప్పుడే ఆయన ఎనర్జీ నాకు నచ్చింది, అందుకే వెంటనే ఈ ప్రాజెక్ట్ ఓకే చేశాను. ఈ మూవీలో మమితా బైజు నటన హైలైట్‌గా ఉంటుంది. జీవీ ప్రకాష్ మరోసారి మంచి సంగీతం అందించారు. ఏప్రిల్ 30న వస్తున్న ఈ సినిమాను ప్రేక్షకులందరూ థియేటర్లలో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

ముఖ్య అతిథి సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ.. నిర్మాత గణేష్ చేసే సేవా కార్యక్రమాలు నాకు స్ఫూర్తినిస్తాయన్నారు.

విఘ్నేశ్ గత చిత్రం నాకు చాలా ఇష్టం, ఈ సినిమా కూడా అదే స్థాయిలో ఉండబోతోందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది అని పేర్కొన్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ధనుష్‌పై ఉన్న అభిమానంతోనే ఈ కార్యక్రమానికి వచ్చానని తెలిపారు. దర్శకుడు విఘ్నేశ్ రాజా మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు నా గత సినిమాకు ఇచ్చిన గౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, మీ సమయం, డబ్బుకు పూర్తి విలువ ఇచ్చేలా కరను తీర్చిదిద్దాను అని ధీమా వ్యక్తం చేశారు.

ong-9_ong-9.qxd 4/27/2026 11:43 PM Page 1

ఏపీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ నిర్లక్ష్యం

మక్కువ ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

ఏపీఎస్ఆర్టీసీ సాలూరు ఆర్టీసీ డిపోలో ఉన్న లాజిస్టిక్ కేంద్ర నిర్వాహకులు అత్యంత నిర్లక్షయం వహిస్తున్నారు. వచ్చిన పార్సెల్ ను రిసీవింగ్ కొట్టకుండా చెట్టు కింద నిర్లక్షయంగా వదిలేస్తున్నారు. సిబ్బందిని వినియోగదారులు అడుగ గా నిర్లక్షయంగా వస్తువు పోతే డబ్బులు కడతాం కదా మీకేంటి అన్నట్టుగా సమాధానం ఇస్తున్నారు. పార్సిల్లు డెలివరీ తీసుకునే క్రమంలో స్థానిక కళాశాల కూడా డబ్బులు ఇస్తే గాని పార్సెల్ ఇవ్వమని తేల్చి చెబుతున్న సంబంధిత శాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై సాలూరు డిపో మేనేజర్ పి ఆచారి కి లిఖితపూర్వక ఫిర్యాదు చేయగా ఎంక్వయిరీ చేస్తామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లాజిస్టిక్ సర్వీస్ పై చర్యలు తీసుకోకుంటే ఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీసుల పైన ప్రజలలో అపనమ్మకం ఏర్పడే అవకాశం లేకపోలేదు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్

బొబ్బిలి ఏప్రిల్ 27 ప్రభాతవార్త

జనసేన పార్టీ ఇంచార్జి డా గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో మాజీ మంత్రివర్యులు జనసేన పార్టీ రాష్ట్ర శితిది మెంబర్ పడాల అరుణ చేతులు మీదుగా ప్రారంభించడం జరిగిం దఈ సందర్భంగా అప్పలస్వామి గారు మాట్లాడుతూ ప్రతి సోమవారం ఓపెన్ చేసి ఉంటుందని తెలియజేశారు. అదేవిధంగా రామభద్రపురం మండల ఉల్లి సంతోష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం నాడు పేదలకు అన్నదానం ఏర్పాటు చేయడం జరుగుతుంది. పేద ప్రజలు జనసేన కార్యాలయంకి రావడం రోడ్ల మీద ఉండటం నాకు చాలా బాధాకరంగా ఉందని వ్యక్తపరిచారు. పేదలకు సంపూర్ణంగా కడుపునిండా, ఒక్కరోజైన అన్నం పెట్టాలని నా ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. ఈ బొబ్బిలి పండగ సందర్భంగా ప్రారంభించినందుకు నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. మాజీ మంత్రివర్యులు పడాల అరుణ మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి జి. అప్పలస్వామి తన సొంత నిధులతో ప్రతి సోమవారం పేదలకు ఉచిత భోజన సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు లంక రమేష్, పైల హరి ప్రసాద్, ఉల్లి సంతోష్, ఎడ్ల మోహన్, మోతి దాసు, జమ్మూ గణేశ్, పాండ్రకీ అప్పారావు, మోళి, పేకేటీ సురేష్, రాంబాబు, అల్లు రమేష్, శింబు, జాన్, గండేటి శ్రీను..జనసేన వీర మహిళలు రౌతు శ్రీదేవి, రామలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నార

బొబ్బిలి దాడి తల్లి అమ్మవారు సరే

పోలమ్మ అమ్మవారు పండగల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు

బొబ్బిలి ఏప్రిల్ 27 ప్రభాతవార్త

బొబ్బిలి పట్టణంలో బొబ్బిలి రాజావారి ఆర్వీఎస్ కేకే రంగారావు ఆధ్వర్యంలో కలింగవైశ్య భవనం కలింగవైస్య సంఘం ఆధ్వర్యంలో ఫోటో ప్రదర్శన నిర్వహించారు. మాజీ ఫ్లోర్ లీడర్ తెలుగుదేశం పార్టీ పట్టణ ఇంచార్జ్ జంబల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ఫోటో ప్రదర్శన నిర్వహించారు. అలనాటి మధుర గీతాలను ఆలపించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎస్ టి ఓ ఆఫీసులో ఎస్ టి ఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గిరిజన సంపదను ప్రదర్శింపబడ్డాయి . తేనె తదితర గిరిజనులు తయారు చేసే పలు వస్తువులను ప్రదర్శించారు. శ్రీ కళాభారతి ఆడిటోరియంలో గౌరవాధ్యక్షులు నంబియార్ వేణుగోపాలరావు అధ్యక్షతన వివిధ సాంస్కృతిక కళావైభవాన్ని ప్రదర్శింపబడ్డాయి చిన్నారులు చేసిన భరతనాట్యము తదితర నృత్యాలను ఆహుతలను ఆకట్టుకున్నాయి. పాత బొబ్బిలి సరే పోలమ్మ పండగ సందర్భంగా అనువంశిక ధర్మకర్త చొడిగంజి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో భైరసాగరము లో ఐదు పడవ పోటీలు నిర్వహించి పండగ శోభ ఒక ప్రాచీన గ్రామీణ వరవడిని భావి తరాలకు తెలియజేసే విధంగా ఐదు పడవలతో పడవ పోటీలు పెట్టి బాణసంచా పెద్ద ఎత్తున కాల్చారు ఈ పోటీలలో వివిధ గ్రామాలకు చెందిన పడవ పోటీదారులు విచ్చేసి పండగకు వచ్చే గ్రామీణులకు ఆహ్లాదాన్ని అందజేశారు

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు వదంతులు నమ్మవద్దు

- జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి

విజయనగరం, ఏప్రిల్ 27: ప్రభాతవార్త

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉన్నట్లుగా వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ సమీక్షా సమావేశంలో భాగంగా జిల్లాలో ఇంధన సరఫరా పరిస్థితిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 134 పెట్రోల్ బంక్ అవుట్‌లెట్లు ఉన్నాయని తెలిపారు. అందులో నాలుగు బంకులు తాత్కాలికంగా డ్రై అవుట్ అయినప్పటికీ, ఈరోజు రాత్రి లేదా రేపు ఉదయం లోపు వాటికి స్టాక్ చేరుకుంటుందని చెప్పారు. జిల్లాలో రోజువారీగా సగటున 713.2 కిలోలీటర్ల డీజిల్, 442 కిలోలీటర్ల పెట్రోల్ డిమాండ్ ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో 1022 కిలోలీటర్ల డీజిల్, 1069 కిలోలీటర్ల పెట్రోల్ నిల్వలు ఉన్నాయని, ఇవి సుమారు మూడు రోజుల అవసరాలకు సరిపోతాయని పేర్కొన్నారు. సకాలంలో ఇండెంట్ పెట్టకపోవడం వల్ల కొన్ని చోట్ల తాత్కాలిక ఇబ్బందులు తలెత్తినట్లు గుర్తించామని, ఇకపై బంక్‌లలో 30 శాతం స్టాక్ మిగిలి ఉన్నప్పుడే ఆయిల్ కంపెనీలకు ఇండెంట్ పెట్టాలని కఠినంగా ఆదేశించినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు ఇండెంట్ పెట్టి స్టాక్ తెప్పించే విధంగా చర్యలు కొనసాగుతున్నాయని, ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని విజ్ఞప్తి చేశారు. డీలర్లకు ఆయిల్ సరఫరా మరియు క్రెడిట్ విషయాల్లో ఆయిల్ కంపెనీలు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని, ఆయిల్ కంపెనీలు తమ డిపోల ద్వారా సరఫరాను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజలు వదంతులకు లోనుకాకుండా ప్రభుత్వంపై విశ్వాసం ఉంచాలని, జిల్లాలో ఎటువంటి ఇంధన కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

చీపురుపల్లి సబ్ జైల్ తనిఖీ..

విజయనగరం ఏప్రిల్ 27 ప్రభాతవార్త

జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ న్యూఢిల్లీ వారి యొక్క ఉత్తర్వులు మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఏ కృష్ణ ప్రసాద్ చీపురుపల్లి సబ్ జైలును సందర్శించి తనిఖీ చేసినారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ వారు ఏర్పాటు చేసిన స్పృహ పథకం గురించి తెలియజేశారు ఈ పథకానికి సంబంధించి జైల్లో ఉన్న ముద్దాయిల యొక్క కుటుంబ నికి ఏ విధమైన సహాయ సహకారాలు కావాల్సింది ఎడల ఈ స్పృహ పథకం ద్వారా అందించడం జరుగుతుందని తెలియజేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించినారు. వీరికి పలు చట్టాలపై అవగాహన కల్పించినారు.ఖైదీల పట్ల సిబ్బంది గాని తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ ను గూర్చి తెలియజేశారు. ఆ విధంగా ఖైదీల పట్ల వివక్షత చూపించిన యెడల కఠినమైన చర్యలు ఉంటాయని, ఆ విషయమై జైలు సూపరిడెంట్ గారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేసిరి. జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్స్ నిర్వహిస్తున్న విధులను పర్యవేక్షించారు. ఖైదీలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని మారుమనస్సు పొంది మంచి పౌరులుగా మెలగాలని హితవు పలికారు. సకాలంలో న్యాయ సహాయము అందించడానికి జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్లను ఏర్పాటు చేశామని వాటిని సక్రమంగా కొనసాగించాలని తెలియజేశారు. స్టోర్ రూమ్ సందర్శించి వంట సరుకులను పప్పు దినుసులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో భాగంగా సబ్ జైలు పరింటెండెంట్ కే కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి కి గాయాలు

మక్కువ ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



మండలంలో కోన దబ్బ గడ్డ రహదారిలో సొంతేశ్వర ఆలయం వద్ద సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురి అయిన వ్యక్తి పాచిపెంట మండలం భూతాడ వలస గ్రామానికి చెందిన జట్ల ఉదయ్ కుమార్ గా స్థానికులు తెలిపారు. ప్రమాదం గుర్తించిన ఉపాధి కూలీలు ఆటోపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.ప్రమాదానికి గురి అయిన వ్యక్తి తలకు బలమైన గాయం అవడంతో స్థానికులు మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సాలూరు తరలించుగా అక్కడనుండి విజయనగరం ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు.

మేడే వారోత్సవాల్లో భాగంగా ఉపాధి హామీ వేతనదారులకు మజ్జిగ పంపిణీ

బలిజిపేట 27 ఏప్రిల్ ప్రభాతవార్త

బలిజిపేట మండలం.. వెంగాపురం గ్రామం రెండు చెరువుల్లో పనిచేస్తున్న ఉపాధి కార్మికులకు భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు బండి కోటేశ్వరరావు సౌజన్యంతో 500 మంది ఉపాధి కార్మికులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ వేసవి ఎండలు మండుతున్న నేపథ్యంలో ఒక్క పూట పని పెట్టి ఫేస్ యాప్ రద్దు చేయాలని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పాత చట్టాన్ని కొనసాగించాలని కొత్త చట్టాన్ని రద్దు చేయాలని పాత చట్టంలో ఉన్నటువంటి మౌలిక సదుపాయాలు టెంట్, మజ్జిగ, మంచినీళ్లు, మెడికల్ కిట్టు, వేసవి అలవెన్సు చట్ట ప్రకారం 14 రోజుల్లో బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు. మేడే స్ఫూర్తితో హక్కులు రక్షణ కోసం కార్మికులు కర్షకులు మహిళలు విద్యార్థులు యువకులు వృత్తుదారులు అందరు కదలాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణం మన కార్మికులు రామనాయుడు, వాసు శంకర్ విశ్వేశ్వరరావు తదితర ఉపాధి కార్మికులు పాల్గొన్నారు

ప్రైవేట్ విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరిక

గరివిడి ఏప్రిల్,27 ప్రభాతవార్త

బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సోమవారం గరివిడి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.వాసుదేవ రావు నిర్వహించిన ఎన్ రోల్ మెంట్ లో నలుగురు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించారు. ఒకటవ తరగతి లో ఇద్దరు, రెండవ తరగతి లో ఒకరు, నాల్గవ తరగతి లో ఒక విద్యార్థి జాయిన్ అయ్యారు.అలాగే అంగన్వాడీ చిన్నారులను కూడా ప్రాథమిక పాఠశాల లో చేర్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పి.రామారావు, ఎం ఈ ఓ 2 డి.అప్పన్న ఉపాధ్యాయులు భాస్కరరావు, డి.కన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ బడి ప్రాధాన్యత ను ఈ సందర్భంగా హెచ్ ఎం వాసుదేవ రావు ప్రజలకు వివరించారు.

రీసర్వే పనుల్లో వేగం పెంచాలి: జేసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

పార్వతీపురం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:

జిల్లాలో జరుగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని తహసీల్దార్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమం ద్వారా భూ రికార్డుల ప్రక్షాళన జరుగుతుందని, దీనివల్ల రైతులకు శాశ్వత భూ హక్కులు లభిస్తాయని అన్నారు. తహసీల్దార్లు స్వయంగా క్షేత్రస్థాయిలో సర్వే పనులను పర్యవేక్షించాలని, ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. సర్వే సమయంలో భూ యజమానుల నుంచి వచ్చే అభ్యంతరాలు మరియు సరిహద్దు వివాదాలను చట్టపరంగా, పారదర్శకంగా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. సర్వేలో వాడుతున్న ఆధునిక పరికరాలు, డ్రోన్ల ద్వారా పొందిన డేటాను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి అవకతవకలకు తావులేకుండా, అత్యంత ఖచ్చితత్వంతో సర్వే పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రీసర్వే పనుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని జె.సి హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు, వివిధ మండలాల తహసీల్దార్లు మరియు సర్వే విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

వీకెండ్ కామెంట్ బై ఆర్కేపై చర్యలేవి....?

- వైఎస్ఆర్సిపి మన్యం జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజు

పార్వతీపురం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:

ఇటీవల ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ లో ప్రసారమైన వీకెండ్ కామెంట్ బై ఆర్ కె లో తమ నేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యొక్క వ్యక్తిగత హననానికి, నాయకులు క్యాడర్ను కించపరిచే విధంగా వ్యాఖ్యలను ప్రసారం చేయడం సిగ్గుచేటని వీటిని ఖండిస్తూ ఆ రోజున అన్ని స్టేషన్లలో సంబంధిత అంశంపై వైయస్ఆర్సీపీ క్యాడర్ ఫిర్యాదులు చేయడం జరిగిందని అయితే ఇంతవరకు కనీస చర్యలు లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వైయస్సార్సీపి మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అన్నారు. కూటమి ప్రభుత్వ అసత్య ఆరోపణలు ఏబీఎన్ ఛానల్ లో ప్రసారం చేసి వెనకేసుకుని వస్తుందా అని ప్రశ్నించారు. వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ఉద్దేశించి వెన్నుముకలేని వ్యక్తులుగా చిత్రీకరించి అవహేళన చేయడం ఎంతవరకు సమంజసం అని సూటిగా ఛానల్ ఎండి రాధాకృష్ణ ను వైయస్సార్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఛానల్ నిర్వహణ సంబంధితలపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతిపత్రం అందజేసే ప్రయత్నంలో ఎస్పీ అందుబాటులో లేకపోవడం మూలంగా ఏఎస్పీ కు ఫిర్యాదు ఇచ్చారు. అనంతరం ఎస్పీ కార్యాలయం వెలుపల మన్యం జిల్లా పరిధిలోని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మూడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, విశ్వసరాయి కళావతి, నాయకులు తదితరులతో ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ ఇప్పటికైనా పోలీస్ శాఖ నిజాలను నిగ్గు తేల్చి తమకు జరిగిన అన్యాయాన్ని నాయకులకు చేసిన అవమానాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షం లో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయక తప్పదని అందుకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అన్యాయాలు పెరిగిపోతున్నా యని తాము సమన్వయం పాటిస్తున్నామని దానిని చేతకానితనంగా అనుకోవద్దని పుష్ప శ్రీవాణి హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లాలోని పరిధిలోని వైఎస్ఆర్సిపి శ్రేణులు నాయకులు పాల్గొన్నారు.

ఇందన కొరత లేకుండా తక్షణ చర్యలు చేపట్టండి: సిపిఎం

కొమరాడ,ఏప్రిల్ 27 ప్రభాతవార్త

మండలంలో పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా అధికారి యంత్రాంగం తక్షణమే చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లి సాంబమూర్తి కోరారు సోమవారం కొమరాడ మండల కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద వాహనదారులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలో ఉన్న రెండు పెట్రోల్ బంకులలో ఒక బంకులో సోమవారం డీజిల్ లభించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారని పేర్కొన్నారు. బంకులో డీజిల్ ఎప్పుడు వస్తుందో చెప్పలేమని బంకు నిర్వాహకులు చెప్పడంతో వినియోగదారులు ఆందోళన గురవుతున్నట్లు ఆయన చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడకుండా వినియోగదారులకు సక్రమంగా అందాల తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు

పాచిపెంట ఏప్రిల్ 27 ప్రభాతవార్త

పదోన్నతి పొందిన పి.శ్రీనివాసరావు సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జి ఎస్ డబ్ల్యూ ఎస్ డిప్యూటీ ఎంపీడీఓ గా బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం జిల్లా గుర్ల మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహించి పదోన్నతపై పాచిపెంట మండల పరిషత్ కార్యాలయము సచివాల యాలు,డిప్యూటీ ఎంపీడీవోగా పదవీ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ టైపిస్టు నాగేశ్వరరావు సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు,సిబ్బంది స్వాగతం పలికారు.

గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తేకఠిన చర్యలు

రామభద్రపురం ఏప్రిల్ 27 ప్రభాతవార్త

గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జ్ఞానప్రసాద్ రావు పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా బెల్ట్ షాపులు నిర్వహించిన బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు ఇప్పటికే గ్రామాల్లో ప్రత్యేకంగా నిఘాఏర్పాటు చేశామని అన్నారు రోడ్డు ప్రమాదంలో నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ముఖ్యంగా మద్యం తాగి వాహనలునడిపితే కేసులు నమోదు చేస్తామని అన్నారు మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని మైనర్లు వాహనం నడిపితే ప్రమాణం జరిగితే వారీయొక్క తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని అన్నారు ద్విచక్ర మోహం దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సి బుక్కు డ్రైవర్ లైసెన్సు హెల్మెట్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని ఆయన తెలిపారు గంజాయి రవాణా చేసిన వినియోగించిన చర్యలు చేపడతామని ఇందులో భాగం కొట్టెక్కి దగ్గర చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామని అన్నారు నిత్యం గంజాయి నివారించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు గంజాయి అక్రమ రవాణా పై ఎవరైనా సమాచారం ఇస్తే వారి యొక్క పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు మహిళలపై లైంగిక దాడులు చేసినా వారిపై కేసు నమోదు చేస్తాం అన్నారు ఇందులో భాగంగా సంకల్పం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మాజీ సైనికుల సమస్యలుపై స్పందించిన జిల్లా కలెక్టర్

- హర్షం వ్యక్తం చేసిన మాజీ సైనికులు

లక్కవరపు కోట /విజయనగరం ఏప్రిల్ 27 ప్రభాతవార్త)

మాజీసైనికులు అందరు కలిసి సోమవారం విజయనగరం జిల్లా కలెక్టర్ మరియు డి .ఆర్. ఓ. అలాగే విజయనగరం తహసిల్దార్ జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో మాజీ సైనికుల, వితంతువుల భూ సమస్యలు గూర్చి ముఖ్యముగా విజయనగరం జిల్లాలో గాజులు రేగ ఇండ్ల స్థలాల సర్వేనెంబర్ 1/ 84,1/85, 15 ఎకరాల ఇండ్ల స్థలం గూర్చి. దానిని నిషేధిత జాబితా నుండి తొలగించమని గౌరవ కలెక్టర్ మరియు సైనిక సంక్షేమ ఛైర్మన్, మిగతా ఉన్నత అధికారులు ఆర్డీవో డిఆర్ఓ కలిసి మనకిచ్చిన స్థలాలు, గురించి క్లుప్తంగా చదును చేసుకున్నామని, ట్రాన్స్ఫార్మర్ వేసుకున్నామని, బోర్వెల్ లో తీసుకున్నామని, డెవలప్మెంట్ కార్యాలయం నిర్మించామని స్థలం మా ఆధీనంలోనే ఉందని వివరించడం జరిగినది. ఈ విన్నపం కి అధికారులు స్పందించారు అని . సమస్య పరిష్కారం త్వరగా చేస్తామని సైనిక సంక్షేమ అధికారి సాయి దుర్గాప్రసాద్ రెవెన్యూ అధికారులు ముందు మాటిచ్చారని వారు విలేకరులకు తెలిపారు 22ఏ నిషేధిత జాబితా నుండి తమకు చెందిన 15 ఎకరాలు భూమిని తొలగిస్తే లబ్ధిదారులైన ఇండ్ల స్థలములు పొందిన పట్టాలు పొందిన వారు బ్యాంకు నుంచి ఇండ్ల నిర్మాణ నిమిత్తం రుణాలు పొందవచ్చు అని కలెక్టర్ గారికి వివరించగా జిల్లా కలెక్టర్ 10 సంవత్సరాలు దాటిపోయింది, కాబట్టి తగిన చర్య తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు దేవర ఈశ్వరరావు, కార్యదర్శి బారుకుల వెంకట్రావు, ఆదారి సత్యనారాయణ, బాబురావు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

హిందుస్తాన్ పెట్రోల్ బంకులో ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

లక్కవరపుకోట ఏప్రిల్ 27 ప్రభాత వార్త):

శృంగవరపుకోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఎల్ కోట మండలం గంగుబూడి గ్రామం వద్ద గల హెచ్.పీ పెట్రోల్ బంకును సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీలు చేసి పెట్రోల్ నాణ్యత బంకులో పెట్రోల్ నిలవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ వాహనదారులకు తప్ప ఇతరులు ఎవరికి పెట్రోల్ అమ్మ రాదని బాటిల్లో గాని డ్రమ్ముల్లో, క్యాన్లకు గాని పెట్రోల్ పోయరాదని కేవలం వాహనాలకు మాత్రమే పెట్రోల్ పోయాలని అలాకాకుండా బ్లాక్ లో అమ్మకాలు జరిపినట్టు అయితే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఎదురవుతున్న పెట్రోల్ సమస్యపై ఇప్పటికే పెట్రోల్ సరఫరా సంస్థలతో చర్చించారని, ఈ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని తెలిపారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం: ఎమ్మెల్యే కోళ్ల

లక్కవరపు కోట ఏప్రిల్ 27 ప్రభాతవార్త)

నియోజకవర్గం లోని ప్రజల సమస్యలు పరిస్కరించడమే ప్రజా దర్బార్ ప్రధాన లక్షయం అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం ఎల్ కోట మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్వయంగా పాల్గొని, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఓపికగా ఆలకించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం 14 వినతులను ఆమె స్వీకరించారు. వీటిలో ప్రధానంగా పెన్షన్ల మంజూరుకు సంబంధించి 10 వినతులు, రెవెన్యూ 1, పంచాయతీ రాజ్ 1, ఆర్ డబ్ల్యూ ఎస్ 1, మరియు విద్యుత్ శాఖ 1 వినతులు అందాయని కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రజలు సమర్పించిన వినతులపై ఎమ్మెల్యే లలితకుమారి తక్షణమే స్పందిస్తూ, ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో ఏ ఒక్క అర్హుడు ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉండకూడదని, వచ్చిన ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యతని, ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు చేరాలన్నదే తన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ఈ ప్రజాదర్బార్‌లో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, సివిఏపియూ సిబ్బంది పాల్గొన్నారు.

జయమ్మ పార్థీవ దేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట ఏప్రిల్ 27 ప్రభాతవార్త

బలిజిపేట మండలం, పెదపెంకి గ్రామానికి చెందినది వైసిపి కుటుంబ సభ్యులు కాగాన జయమ్మ అనారోగ్య కారణంగా ఈరోజు అకాల మరణం చెందిన విషయాన్ని స్థానిక నాయకులు ద్వారా తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పెదపెంకి గ్రామానికి వెళ్లి దివంగత జయమ్మ పార్థీవ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి శ్రద్దాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ నిజంగా పార్టీ ఒక మంచి కార్యకర్తను కోల్పోవడం చాలా బాధాకరం అని వారి కుటుంబానికి పార్టీ, తామంతా అండగా నిలవడం జరుగుతుంది అని ఆయన వారికి భరోసాను కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ, జడ్పీటీసీ, స్థానిక సర్పంచ్, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించడం జరిగినది.

అంతర్జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో భార్గవికి పసిడి పతకం

నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), ఏప్రిల్ 27, ప్రభాతవార్త

విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెల గాడ గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి బెల్లాన భార్గవి అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకం సాధించి దేశానికి కీర్తి ప్రతిష్టలు పెంచింది. సమోహ దేశంలో సోమవారం ప్రారంభమైన కామన్వెల్త్ దేశాల యూత్, జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొన్న భార్గవి యూత్ విభాగంలో బంగారు పతకం సాధించింది. స్నాచ్‌లో 78 కిలోల బరువు, క్లీన్ అండ్ జర్క్ లో 102 కేజీల బరువు మొత్తం 180 కేజీలు బరువు ఎత్తి ఈ అంతర్జాతీయ పతకాన్ని సాధించింది. ఈ పోటీలు ఈనెల 30వ తేదీ వరకు జరుగనున్నాయి. వెయిట్ లిఫ్టింగ్ సీనియర్ క్రీడాకారుడు, 2010 కామన్వెల్త్ దేశాల పోటీలో విజేత వల్లూరు శ్రీనివాసరావు వద్ద భార్గవి శిక్షణ పొందింది. భార్గవి సాధించిన విజయంపట్ల తల్లిదండ్రులు శ్రీనివాసరావు, గౌరీ,వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా సంఘాల ప్రతినిధులు, కోచ్ శ్రీనివాసరావు,గ్రామపెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు.

ఇది ఫౌంటెన్ కాదు.. పైపు లీకేజీ

బొండపల్లి ఏప్రిల్ 27 (ప్రభాతవార్త):

చూపరులను ఆకర్షిస్తున్న ఈ దృశ్యాన్ని చూస్తే ఎవరికైనా ఆనందం కలగక మానదు. ఇది ఫౌంటెన్ అనుకుంటే పొరపడినట్లే. ఆదివారం ఉదయం ఈ దృశ్యం పలువురుని ఆకర్షితులను చేసింది. వివరాల్లోకి వెళితే మండల కేంద్ర సముదాయం దాటిన తర్వాత జాతీయ రహదారి పక్కన పైపులైను లీకేజీ కారణంగా ఫౌంటెన్ రూపంలో నీరువృధాగా పోవడం కనిపించింది. ఒకవైపు చూపులను ఆకర్షతులను చేసినప్పటికీ మరొకవైపు నీరు వృధాగా పోతుంది అన్న బాధను పలువురు వ్యక్తం చేశారు.

28-04pg10exHMNWJQEB.qxd:28-04pg10exHMNWJQEB.qxd 1/1/02 6:17 AM Page 1

శతక్కొట్టేదెవరు?

నేడు పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ ఢీ

ఢిల్లీ క్యాపిటల్స్ 265 రన్స్
సన్‌రైజర్స్ హైదరాబాద్ 220 రన్స్
చెన్నై సూపర్ కింగ్స్ 210 రన్స్
ముంబై ఇండియన్స్ 196 రన్స్
గుజరాత్ టైటాన్స్ 166 రన్స్
లక్నో ముందు 255 రన్స్

పైవన్నీ స్కోర్లన్నీ పంజాబ్ కింగ్స్ ముందు ఆయా జట్లు ఉంచిన టార్గెట్‌లు. వీటన్నింటిని శ్రేయాస్‌సేన ఉఫ్ మనిపించింది.ఇక ఢిల్లీ క్యాపిటల్స్ ఉంచిన 265 రన్స్ లక్ష్యాన్ని కూడా ఊదేసి రికార్డు సృష్టించింది. ఈ ఐపీఎల్ సీజన్‌లో చేజింగ్ టీమ్‌గా పంజాబ్ కింగ్స్ అవతరించింది. పోనీ మేమే టార్గెట్ నిర్ణయిస్తాం మీరు ఊదేయండి అన్న తరహాలో లక్నో జూపర్ జెయింట్స్ ముందు ఏకంగా 255 రన్స్ లక్ష్యం నిర్దేశించింది. దీన్ని చేధించడంలో లక్నో చతికిలపడింది. ఇపుడు రాజస్థాన్ రాయల్స్ వంతు. పంజాబ్‌కు కళ్లెం వేస్తుందా?

చండీఘడ్: మొత్తానికి ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ అద్భుతమైన ఫామ్‌తో దూసుకుపోతోంది. ప్రస్తుతానికి ఆ జట్టును ఆపడం ఇతర జట్లకు కష్టంగా మారింది. ఈసీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌ల్లో ఓటమి ఎరగకుండా దూసుకుపోతోంది. 6 మ్యాచ్‌ల్లో గెలుపొందగా, ఒక మ్యాచ్ వర్షార్పణం అయింది. 13 పాయింట్లతో టాప్ పొజిషన్‌లో ఉంది. గత ఏడాది తృటిలో చేజారిన ఐపీఎల్ ట్రోఫీని ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ అందుకోవడమే లక్ష్యంగా దూసుకుపోతోంది.

ఆర్సీబీ, ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి బలమైన జట్లపై కూడా పంజాబ్ సులభంగా విజయం సాధించింది. శ్రేయాస్ కెప్టెన్సీలో పంజాబ్ కింగ్స్ జట్టులో సరికొత్తనత ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. సర్పంచ్ సాబ్‌గా జట్టును విజయపథంలో నడిపిస్తున్నాడు. జట్టులోని వనరులను చక్కగా ఉపయోగించుకుంటున్నాడు. ముఖ్యంగా ఓపెనర్లు ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్య అందిస్తున్న విధ్వంసకర ఆరంభాలే జట్టు విజయాల్లో కీ రోల్ పోషిస్తున్నాయి. ఎంతలా అంటే డీసీపై పవర్ ప్లే ఆరు ఓవర్లలోనే 116 రన్స్ సాధించారు. ఆతర్వాత వచ్చే కూపర్ కానోలీ, శ్రేయాస్ అయ్యర్, నేహాల్ వదేరా, స్టోయినోస్ వరకు అందరూ విధ్వంకరంగా ఆడుతూ భారీ స్కోర్లు సాధిస్తున్నారు.

ఈ క్రమంలో నేడు పంజాబ్ కింగ్స్‌తో రాజస్థాన్ రాయల్స్ తలపడుతోంది. శ్రేయాస్ సేనను రాయల్స్ అడ్డుకుంటుందా? పంజాబ్ కు తొలి ఓటమి రుచి చూపిస్తుందా? లేదా యాధావిధిగా పంజాబ్ ఖాతాలో ఏడో విజయం చేరుతుందా? అన్నది ఆసక్తిగా మారింది. తమ విజయ పరంపరను

కొనసాగించి, ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత పటిష్టం చేసుకోవడంపై పంజాబ్ కింగ్స్ ఫోకస్ పెట్టింది. మరోవైపు, ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదు విజయాలతో నాలుగో స్థానంలో ఉన్న రాజస్థాన్ రాయల్స్... పుంజుకుని విజయాల బాట పట్టాలని ఉవ్విళ్లూరుతోంది.

పంజాబ్ ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్... రాజస్థాన్ ఓపెనర్లు సెంచరీ హీరో వైభవ్ సూర్యవంశీ, యశస్వీ జైసాల్ పోరు ఆసక్తి రేపుతోంది. ఈ నలుగురిపైనే మ్యాచ్ ఫోకస్ అంతా. ఇక ఈ పోరులో పేసర్ జోఫ్రా ఆర్చర్ కీలక బౌలర్ కావచ్చు. అతను ఎనిమిది మ్యాచ్‌లలో 17.92 అద్భుతమైన సగటుతో 13 వికెట్లు పడగొట్టి, ఈ సీజన్‌లో తన ప్రభావాన్ని చాటుకున్నాడు. అతని బౌలింగ్, ముఖ్యంగా పవర్‌ప్లే సమయంలో, ఆట గమనాన్ని మార్చడంలో కీలకం కానుంది. ఒకవేళ ఆర్చర్ ఆరంభంలోనే వికెట్లు తీస్తే, అతను పంజాబ్ కింగ్స్‌పై ఒత్తిడి పెంచి, రాజస్థాన్ రాయల్స్‌కు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించగలడు.

హెడ్ టు హెడ్ రికార్డ్ : ఇరుజట్లు 30 మ్యాచ్‌ల్లో తలపడగా, రాజస్థాన్ రాయల్స్ ఆధిక్యం చాటింది. పంజాబ్ కింగ్స్ 13 మ్యాచ్‌ల్లో, రాజస్థాన్ రాయల్స్ 17 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. చివరి సారి తలపడినపుడు పంజాబ్ కింగ్స్ నెగ్గింది.

తుది జట్లు(అంచనా) : పంజాబ్ కింగ్స్: ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రియాంష్ ఆర్య, కూపర్ కానోలీ, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్, మార్కో జాన్సెన్, జేవియర్ బార్ట్‌లెట్, విజయ్‌కుమార్ వైషాక్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్; **ఇంపాక్ట్ ప్లేయర్:** నేహాల్ వధేరా

రాజస్థాన్ రాయల్స్: యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్ (కెప్టెన్), హెట్మెయర్, ఫెరీరా, రవీంద్ర జడేజా, ఆర్చర్, దేశ్‌పాండే, బర్గర్, బ్రిజేష్ శర్మ, బిష్ణోయ్; **ఇంపాక్ట్ ప్లేయర్:** సూర్యవంశీ.

ఢిల్లీని కుప్పకూల్చిన హాజిల్, భువీ

ఢిల్లీ: శనివారం బౌలర్లకు బ్లాక్‌డేగా నిలిస్తే... సోమవారం బ్యాట్స్‌మెన్‌వంతయింది. తమ సొంత మైదానంలోనే గత మ్యాచ్‌లో 264పరుగులు కొట్టిన ఢిల్లీ క్యాపిటల్... సోమవారం మాత్రం బ్యాటింగే చేతకాదన్నట్టు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భువనేశ్వర్, హాజిల్‌వుడ్ ఫాస్ట్ బౌలింగ్‌కు 75 పరుగులకు కుప్పకూలింది. ఈస్వల్ప లక్ష్యాన్ని ఆర్సీబీ ఒక వికెట్ కోల్పయి 6.3 ఓవర్లలోనే చేధించింది. తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుంది. జాకెబ్ బెతెల్(20) అవుటైనా... విరాట్ కోహ్లీ(15 బంతుల్లో 23), దేవదత్ పడిక్కల్(13 బంతుల్లో 34) అజేయంగా నిలిచి ఆర్సీబీకి మరో విజయాన్ని ఖాయం చేశారు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఆర్సీబీ ఆరంభ పేస్ అటాక్ భువనేశ్వర్, హాజిల్ వుడ్ వణికించారు. ఇన్నింగ్స్ రెండో బంతికే సాహిల్(0)ను భువీ క్లీన్ బౌల్డ్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికాడు. ఫ్రెష్ ఓవర్‌తో వచ్చిన హాజిల్‌వుడ్ ...తొలి బంతికే గత మ్యాచ్ సెంచరీ హీరో రాహుల్(1)ను, రెండో బంతికి రిజ్వీ(0)ని పెవిలియన్‌కు పంపాడు. ఇకమూడో ఓవర్ తొలి బంతికి స్టబ్స్(5)ను, నాలుగో బంతికి అక్షర్‌పటేల్(0)ను వెంటవెంటనే అవుట్ చేశాడు. మరో ఎండ్‌లో హాజిల్ వుడ్... నితీష్ రాణా(1) పనిపట్టడంతో నాలుగో ఓవర్‌కే ఢిల్లీ క్యాపిటల్స్ 8 రన్స్‌కే 6 వికెట్లు కోల్పోయింది. కాసేపు వికెట్ల పతనాన్ని అభిషేక్(30), డేవిడ్ మిల్లర్(19) అడ్డుకున్నారు. ఏడో వికెట్‌కు 35 రన్స్ జోడించారు. అయితే మిల్లర్‌ను రసిఖ్ అవుట్ చేయడంతో మరోసారి వికెట్లపతనం వేగమందుకుంది. జెమిసన్(12)ను కృనాల్, కుల్‌దీప్(3)ను సుయాష్ అవుట్ చేశారు. మరోసారి బౌలింగ్‌కు వచ్చిన హేజిల్‌వుడ్.. చక్కని ఇన్ స్వింగ్‌తో అభిషేక్‌ను బౌల్డ్ చేయడంతో ఢిల్లీ 75 పరుగులకే ఆలౌటైంది. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఇదే అత్యల్ప స్కోరు. ఆర్సీబీ బౌలర్లలో హేజిల్ వుడ్ నాలుగు, భువనేశ్వర్ మూడు వికెట్లు పడగొట్టారు.

థామస్ కప్ క్వార్టర్‌లో భారత్

హార్సెన్స్: థామస్ కప్ బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్లు అదరగొడుతున్నారు. పురుషుల సింగిల్స్ లో ఆయుష్ షెట్టి, డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ రాణించడంతో ఆస్ట్రేలియాపై క్లీన్ స్వీప్ చేసి క్వార్టర్ ఫైనల్ స్థానం ఖాయం చేసుకుంది. 2022 ఛాంపియన్ కెనడాపై4-1 తేడాతో నెగ్గి థామస్ కప్ పోరును గ్రాండ్‌గా ఆరంభించిన భారత్.. రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను 5-0తో చిత్తుచేసింది. పురుషుల సింగిల్స్‌లో పారిస్ ఒలింపిక్స్ మెడలిస్ట్ లక్ష్యసేన్21-14, 21-16తో స్టీఫెన్ సామ్‌పై, సూపర్ ఫామ్‌లో ఉన్న యువకెరటం ఆయుష్ షెట్టి 21-18, 21-16తో శ్రేయ్ ధాండ్‌పై నెగ్గి 2-0ఆధిక్యం అందించారు. డబుల్స్‌లో సాత్విక్ -చిరాగ్ జోడీ 21-14, 21-16తో రిజ్కీ హిదా యత్, జాక్ యూ జోడీపై సునాయాసంగా నెగ్గి ఆధిక్యాన్ని 3-0కు పెంచారు. రివర్స్ సింగిల్స్‌లో ప్రణయ్ సైతం జోరు చూపిస్తూ 21-11, 21-17తో రిషి హోండాపై విజయం సాధించాడు.

రెండో డబుల్స్‌లో హరిహరన్, అర్జున్ జోడీ.. 21-12, 21-10తో స్టీఫెన్ ఫామ్, అండికా జోడీపై గెలు పొందారు. దీంతో 5మ్యాచ్‌ల్లోనూ భారత్ నెగ్గి ఆస్ట్రేలియాను క్లీన్‌స్వీప్ చేసింది. గ్రూప్-ఏ లో రెండేసి విజయాలతో భారత్, చైనా సమవుజ్జీలుగా ఉన్నాయి. తర్వాతి మ్యాచ్‌లో భారత్- చైనాతో తలపడనుంది. గత ఏడాది పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది. మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండానే గ్రూప్-ఎ నుంచి చైనా, భారత్ జట్లు క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి.

నష్టాలనుంచి లాభాల్లోకి సెన్సెక్స్, నిఫ్టీ

ఫార్మా, ఆయిల్,బ్యాంకింగ్‌ల మద్దతు

ముంబయి, ఏప్రిల్ 27: మూడురోజుల నష్టాల ర్యాలీనుంచి దేశీయ ఈక్విటీ సూచీలు లాభాల్లోకి మళ్లాయి. భౌగోళిక ఉద్రిక్తతల్లో సడలింపులు కనిపించడం, నాలుగోత్రైమాసికంలో స్థిరమైన ఫలితాలు కార్పొరేట్లుప్రకటించడం వంటివి మార్కెట్లకు కలిసొచ్చాయి. దీనికితోడు ఇరాన్ హార్ముజ్‌ను తెరుస్తామన్న ప్రతిపాదన తీసుకురావడం మార్కెట్లకు ఊతం ఇచ్చింది. బిఎస్ఇ సెన్సెక్స్ 639.42 పాయింట్లు పెరిగి 77,303.63 పాయింట్ల వద్ద ట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 194.75 పాయింట్లు పెరిగి 24,092.70 పాయింట్లకు చేరింది. గత సెషన్లలో సెన్సెక్స్ నిఫ్టీలు వరుసగా 3.29శాతం,2.76శాతం క్షీణించాయి సన్‌ఫార్మా భారీగా లాభపడింది. 7.03శాతం సన్ పెరిగితే రిలయన్స్ 2.88శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.64శాతంపెరిగాయి. మార్కెట్లలో బిఎస్ఇ మిడ్ క్యాప్‌సూచీ 1.38శాతం,స్మాల్‌క్యాప్‌సూచీ 1.98 శాతం పెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 3075 షేర్లుపెరిగితే 1288 షేర్లు క్షీణించాయి. 208 కంపెనీలషేర్లు నిలకడగా కొనసాగాయి.

భారత్‌పదేళ్ల బాండ్లు 0.27శాతంపెరిగి 6.952గా కొనసాగింది. విదేశీ కరెన్సీ మార్పిడి కౌంటర్లలో భారత్ రూపాయి స్వల్పంగా పెరిగింది. 94.14 వద్ద కొనసాగింది. గత ముగింపులో 94.16గా ఉన్నసంగతి తెలిసిందే. వారం ప్రారంభంలో మెరుగయింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదునాటికి 0.43శాతంపెరిగి రూ.1,52,050గా కొనసాగింది. కమోడిటీ

మారెనకట్లలో బ్రెంట్‌ముడిచమురు జూన్ సెటిల్ మెంట్లు 2.47డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 107.80 డాలర్లుగా కొనసాగాయి. ఆర్గానన్ అండ్‌కంపెనీని కొనుగోలుచేసినట్లుప్రకటించడంతోకంపెనీ షేర్లు ఒక్కసారిగా పెరిగాయి. 7.03శాతంపెరిగింది. రిలయన్స్ కూడా 2.88శాతంపెరిగింది. నికరలాభాల్లో వృద్ధి ప్రధానకారణం. వన్ మొబిక్విక్ సిస్టమ్స్ 10.98శాతం పెరిగితే వన్ 97 కమ్యూనికేషన్స్ 1.48శాతం దిగజారింది. పేటిఎంపేమెంట్స్ బ్యాంకు లైసెన్సు రద్దుచేయడంతో షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. వరుణ్ బేవరేజెస్ 5.79శాతంపెరిగింది. యాక్సిస్‌బ్యాంకు మాత్రం 3.05శాం క్షీణించింది. నికరలాభాల్లో క్షీణత ఎఫెక్ట్ చూపించింది. ఇక శ్రీరామ్‌ఫైనాన్స్ కూడా 3.61శాతం పతనం అయింది. మహీంద్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ 7.71శాతం పెరిగాయి. కంపెనీ లాభాలు 55.02శాతం పెరగడమే ఇందుకు కారణం. ఎల్అండ్‌టి ఫైనాన్స్ 0.86శాతం క్షీణించింది. ఇక ఇండస్‌ఇండ్ బ్యాంకు షేర్లు 6.09శాతం పెరిగాయి. ఐడిఎఫ్‌సిఫస్ట్‌బ్యాంకు 4.57శాతం, అవంటెల్ 1.52శాతంపెరిగితే మంగళూరు రిఫైనరీ పెట్రోకెమికల్స్ 7.59శాతం పతనం అయ్యాయి. ఇండియా సిమెంట్స్ మాత్రం7.25శాతం ర్యాలీతీసింది. డిసిబి బ్యాంకు కూడా త్రైమాసిక ఫలితాలు ఆశించినట్లు లేకపోవడంతోషేర్లు 1.12శాతం క్షీణించాయి. లోధా డెవలపర్స్ 4.64శాతం నికరలాభాలు ప్రకటించడంతోకంపెనీ షేర్లు కూడాపెరిగాయి. సుప్రీం పెట్రోకెమ్ 5.41శాం క్షీణించాయి. తాన్లా ప్లాట్‌ఫామ్స్ 20శాతం ఎగువ సర్క్యూట్‌లోముగిసాయి. కంపెనీ నికరలాభా లు పెరగడం, రెండోతాత్కాలిక డివిడెండ్ 6రూపాయల చొప్పున ప్రకటించడం షేర్లు ర్యాలీకి దారితీసాయి.



ఒరాకిల్‌లో 20 వేలమందిపై లే ఆఫ్ వేటు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: దిగ్గజ టెకీ కంపెనీ ఒరాకిల్ 20వేలమందికిపైగా ఇళ్లకు పంపిస్తోంది. సోమవారం ఆ కంపెనీ లే ఆఫ్‌ల ప్రకటన చేసింది. ప్రపంచ వ్యాప్తంగా 20 నుంచి 30 వేల మందిని తొలిగించే అవకాశాలు ఉన్నట్లు చెప్పింది. సోమవారం ఉదయం పంపిన ఈమెయిల్స్‌తో ఉద్యోగులకు చేరవేశారు. అమెరికా, ఇండియా, కెనడా, లాటిన్ దేశాల్లో ఉన్న ఒరాకిల్ కంపెనీ ఉద్యోగులపై భారీ వేటు పడనున్నది. ఒరాకిల్ కంపెనీలో పనిచేస్తున్న సీనియర్లను కూడా తొలగిస్తున్నారు. 33 ఏళ్లుగా ఒరాకిల్ లో చేసిన సీనియర్ సెక్యూర్టీ ప్రొఫెషనల్ నీనా లివస్ కూడా తన ఉద్యోగాన్ని కోల్పోనున్నారు. 30 వేల మంది లేఆఫ్స్‌లో తాను కూడా ఉండబోనున్నట్లు ఆమె తన లింక్డిన్ ప్రొఫైల్‌లో రాశారు. లేఆఫ్స్‌లో సంఖ్య కన్నా సీనియర్ల తొలగింపు ప్రశ్నార్థకంగా మారింది. సుదీర్ఘకాలం కంపెనీలో పనిచేస్తున్న వారు, నైపుణ్యం కలిగిన ఉద్యోగులపై ప్రభావం పడడం శోచనీయంగా మారింది. ఇటీవల మెటా, మైక్రోసాఫ్ట్, డిస్నీ, ఏఎస్ఎంఎ కంపెనీలు కూడా లేఆఫ్స్ ప్రకటించాయి. మెటా, మైక్రోసాఫ్ట్ కంపెనీలు గత వారంలో 20 వేల ఉద్యోగులను తొలగించాయి.

ప్రస్తుత దశలో చాలా వరకు కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై భారీగా పెట్టుబడి పెడుతున్నాయి. పనివిధానాలను ఆటోమెట్ చేయడంలో కంపెనీలు నిమగ్నమయ్యాయి. వర్కింగ్ టీమ్స్‌ను పునర్ నిర్మిస్తున్నారు. అధిక సామర్థం, తక్కువ ఇన్‌పుట్, ఎక్కువ లాభాలు అన్న రీతిలో కంపెనీలు పనిచేస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. లాభాలపై దృష్టి పెట్టిన కంపెనీలు భారీ వేతనపరులు అవసరమా అన్న రీతిలో ఆలోచిస్తున్నాయి. వీరి స్థానంలో ఏఐతో పాటు యువ ఉద్యోగులను నియమించేందుకు ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఎంట్రీ లెవల్ జాబ్‌లను పూర్తిగా ఆటోమేట్ చేశారు.

టాప్ కంపెనీలన్నీ దాదాపు ఫ్రెషర్స్‌కు అవకాశాలు ఇవ్వడం లేదని విమర్శలు వస్తున్నాయి. అవసరాన్ని బట్టి హైరింగ్ జరుగుతోందన్నారు. మిడ్, సీనియర్ లెవల్ ఇంజినీర్లు సామర్థ్యాన్ని పెంచేందుకు ఏఐపై ఆధారపడుతున్నారని, దీని వల్ల సర్వీస్‌తో పాటు ప్రొడక్ట్ బేస్డ్ కంపెనీలు కొత్త వారికి ఉద్యోగాలు ఇవ్వలేకపోతున్నాయి.

మేనేజర్, డైరెక్టర్ స్థాయి ఉద్యోగాలు ఇప్పుడు గ్యారెంటీ లేకుండా ఉన్నాయి. ప్రస్తుత దశలో ఒక్క కాలేజీ కూడా 100 శాతం ప్లేస్‌మెంట్ గ్యారెంటీ ఇవ్వడం లేదని గ్రేట్ లేక్స్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ పీడీఎం డైరెక్టర్ డాక్టర్ పూర్ణిమా గుప్తా అభిప్రాయపడ్డారు. కొత్త గ్రాడ్యుయేట్లు అనుభవం కోసం చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నట్లు చెప్పారు. కాస్ట్ కట్టింగ్ దశ నుంచి ఇప్పుడు ఏఐ ఫస్ట్ ఫ్యూచర్ అన్న రీతిలో కంపెనీలు ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఒరాకిల్ కంపెనీ ఎక్కువగా క్లౌడ్, ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పెట్టుబడి పెడుతోంది. వర్క్‌ఫోర్స్‌ను రిడిజైన్ చేస్తున్నది. అందువల్లనే సుదీర్ఘకాలం పనిచేసిన ఉద్యోగులను తొలగిస్తున్నారు.

609 కోట్లకు ఎస్‌బిఐ కార్డ్ లాభాలు

ముంబయి, ఏప్రిల్ 27: స్టేట్‌బ్యాంక్ కార్డ్ సంస్థ నాలుగోత్రైమాసికంలో నికరలాభాలు 14శాతంపెరిగి 609 కోట్లకు చేరినట్లు సంస్థ ప్రకటించింది. ఎస్‌బిఐ కార్డ్స్ అండ్‌పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ పేరుతో ఉన్న ఈ ఎస్‌బిఐ అనుబంధ సంస్థ అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.534 కోట్లు సాధించింది. మొత్తం రాబడులు కూడా 4832 కోట్లనుంచి రూ.5187 కోట్లకు పెంచుకోగలిగింది. వడ్డీ ఆదాయం మాత్రం గతత్రైమాసికంలో రూ.2415 కోట్లనుంచి రూ.2382 కోట్లకు తగ్గింది. ఈ త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 2.41శాతంగా ఉన్నాయి. ఇక నికర నిరర్థక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 1.04శాతానికి దిగివచ్చాయి. రానిబకాయిలు కూడా 1245 కోట్లనుంచి రూ.1097 కోట్లకు తగ్గాయి. పూర్తి ఆర్థికసంవత్సరానికి లాభం 13శాతంపెరిగి రూ.2167 కోట్లుగా ఉంది. మొత్తం రాందులు కూడా రూ.20,708 కోట్లుగా ఉంది. కంపెనీ బ్యాలెన్స్ షీట్‌కూడా 65,546 కోట్లనుంచి రూ.66,328 కోట్లకు పెరిగింది. ఏడాదిక్రితం ఎస్‌బిఐ కార్డ్స్ రూ.534 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం రాబడులు కూడా 4832 కోట్లనుంచి రూ.5187 కోట్లకు పెంచుకోగలిగింది. స్థిరాస్తిప్రమాణాలను గణనీయంగా పెంచుకోగలిగామని, రానున్న కాలంలో మరింతగా ఆర్థికపరిపుష్టి పెరుగుతుందని ఎస్‌బిఐ కార్డ్ సంస్థ ధీమా ప్రకటించింది.



BAJAJ HOUSING FINANCE

14శాతం పెరిగిన లాభాలు

ముంబయి, ఏప్రిల్ 27: నాన్‌బ్యాంకింగ్ బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ త్రైమాసిక లాభాలు 14శాతంపెరిగాయి. రుణావృద్ధి పటిష్టంగా ఉంది. మార్జిన్లను తగ్గించుకుంటూ హోమ్‌లోన్ మార్కెట్‌లో తన స్థానం నిలబెట్టుకుంటూ వస్తోంది. భారత్ రుణాల డిమాండ్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో అర్థభాగంలో పెరుగుతూ వచ్చింది.

ద్రవ్యోల్బణ సడలింపులు, తక్కువ పన్నులు వంటివి గృహవాసుల వ్యయానికి మద్దతిచ్చాయి. కార్పొరేట్ రుణాలుకూడా విస్తృతం అయ్యాయి. ఇపుడు బజాజ్ కంపెనీ నిర్వహణ ఆస్తులు 23శాతంపెరిగి 1.41 లక్షల కోట్లుగా ఉన్నాయి. రుణాల పంపిణీ కూడా 23శాతంపెరిగి 17,506 కోట్లవరకూ ఉన్నాయి. నికరవడ్డీ ఆదాయం 945 కోట్లుగా ఉంది. రుణ ఆస్తులు వంటివి 5.5శాతం పెరిగినట్లు కంపెనీ ఎక్స్ఛేంజిలకు నివేదికిచ్చింది. మార్చి త్రైమాసికంలో 9.1శాతం ఉంది. నికరలాభాలు 587 నుంచి 699 కోట్లకు పెరిగినట్లుప్రకటించింది. ఇక లీజు రెంటల్ డిస్కొంటింగ్ పోర్టుఫోలియో, కమర్షియల్ రెంటల్ ఆదాయం వంటివి శరవేగంగా పెరుగుతున్న విభాగంగా మారాయి. వార్షికపద్ధతిలో 44శాతంపెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. కంపెనీ ప్రమాణాల్లో మొత్తం 44శాతం వాటా కమర్షియల్ అద్దె రాబడులే ఉన్నాయి.

65శాతానికి ఎయుస్మాల్ లాభం

ముంబయి, ఏప్రిల్ 27: ప్రైవేటురంగంలోని ఎయుస్మాల్ ఫైనాన్స్ బ్యాంకు 65శాతం నికరలాభాలను పెంచుకుంది. అంతేకాకుండా బ్యాంకు ప్రతి వాటాకు ఒకరూపాయి డివిడెండ్‌ప్రకటించింది. రానున్న వాటాదారుల సర్వసభ్యసమావేశంలో ఆమోదించాల్సి ఉంటుంది. ఎజిఎంలో ఆమోదించిన తేదీనుంచే పంపిణీ జరుగుతుందని బ్యాంకు స్టాక్ ఎక్స్ఛేంజిలకు ఫైలింగ్ ఇచ్చింది. బ్యాంకు నికరలాభాలు రూ.504 కోట్లనుంచి రూ.832 కోట్లకు పెరిగాయి. నికరవడ్డీ మార్జిన్ కూడా 23శాతంపెరిగి రూ.2582 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదేకాలంలో రూ.2094 కోట్లుమాత్రమే ఉన్నాయి. స్థూల నిరర్థక ఆస్తులు కూడా మొత్తం అడ్వాన్సుల్లో 2.03శాతంగా ఉంది. గత త్రైమాసికంలో 2.3శాతంగా ఉన్నవి గణనీయంగా పెరిగాయి. నికర నిరర్థక ఆస్తులు కూడా 0.74శాతానికి తగ్గాయి. కేటాయింపులు కూడా 635 కోట్లనుంచి రూ.269 కోట్లకు తగ్గించింది. నిర్వహణ లాభం కూడా 4.6శాతంపెరిగి రూ.1352 కోట్లుగా ఉంది. అలాగే కంపెనీ గౌరవ్‌జైన్‌ను చీఫ్‌ఫైనాన్షియల్ అధికారిగా నియమించింది. త్రైమాసిక ఫలితాల వెల్లడితో బ్యాంకు షేర్లు 2.13శ్శాతం తగ్గాయి. రూ.832వద్దనే కొనసాగాయి. ఎన్ఎస్ఇ నిఫ్టీలో మాత్రం 0.81శాతం పెరిగినట్లు తేలింది.





సన్‌ఫార్మా షేర్లు 35వేల కోట్ల వృద్ధి

ముంబై, ఏప్రిల్27: అమెరికన్ ఫార్మా సంస్థ ఆర్గాననన్‌ను సుమారు రూ.1 లక్ష కోట్లతో కొనుగోలు చేస్తున్నట్లు మార్కెట్‌ప్రచారం రావడంతో సన్ ఫార్మా షేర్లు మార్కెట్లో రాకెట్‌లా దూసుకుపోయాయి. ఈ డీల్ బయటకు రాగానే సోమవారం ట్రేడింగ్‌లో సన్ ఫార్మా షేర్లు ఒక దశలో 9 శాతం వరకు లాభపడ్డాయి. రూ.1632.50 వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైన ఈ కంపెనీ షేర్, మధ్యాహ్నానికి రూ.1,766.65 గరిష్ట స్థాయిని తాకింది. మార్కెట్‌ముగిసే సమయానికి దాదాపు 7శాతం లాభంతో రూ.1,733.15 వద్ద ట్రేడ్ అయింది. రాన్‌బాక్సీని కొనుగోలు చేసిన సన్ ఫార్మాకు, ఈ ఆర్గానన్ డీల్ అంతర్జాతీయంగా మరింత బలాన్ని ఇస్తుందని మార్కెట్ నిపుణులు అంచనా. ఈ కంపెనీ షేర్ల ధర పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువ భారీగా పెరిగింది. గత వారం మార్కెట్ ముగిసే సమయానికి ఈ కంపెనీ విలువ రూ.3,88,715.97కోట్లు ఉండగా సోమవారం ట్రేడింగ్ సెషన్‌లో ఇది ఏకంగా రూ. 4,23,917.44 కోట్లకు చేరింది. అంటే కేవలం ఒక్క రోజులోనే కంపెనీ విలువలో రూ.35,201.47కోట్ల పెరుగుదల కనిపించింది. ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్స్ డేటా ప్రకారం సన్‌ఫార్మా ఫౌండర్ అండ్ ఎండీ దిలీప్ సంఘ్వీ వ్యక్తిగతసంపద 1.6బిలియన్ డాలర్లు (15వేల కోట్లు) పెరిగింది. మొత్తం నికర ఆస్తివిలువ 24.9 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇదే సమయంలో గ్లోబల్ ఫార్మా మార్కెట్లో సన్‌ఫార్మా తన పట్టును పెంచుకోవడానికి ఈ లక్ష కోట్ల రూపాయల డీల్ కీలకం కానుందని సమాచారం. అమెరికా మార్కెట్లో తన ఉనికిని చాటుకోవడంతో పాటు,కొత్త ఉత్పత్తుల తయారీలో కంపెనీకి ఇది మేలు చేస్తుందని విశ్లేషిస్తున్నారు

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.